


ESTD: 1999
www.voodayam.com
# వుదయం




ఖమ్మం | 17-06-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 329 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal
Follow us on

# యాప్‌లో యూరియా



**యూరియా బుకింగ్‌కు సరికొత్త యాప్**

**పంపిణీ బాధ్యతలు అదనపు కలెక్టర్లకే**

**రామగుండం ఎరువులన్నీ తెలంగాణకే ఇవ్వాలి**

**వ్యవసాయ శాఖలో సాంకేతిక విప్లవం**

**సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలి**

**హైదరాబాద్, జూన్ 16 (వుదయం) :** రాష్ట్రంలో సన్న వరి రకాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. బోనస్ లభించే 7 రకాల సన్నవడ్ల విత్తనాలను రైతు వేదికల్లోనే అందుబాటులో ఉంచాలని, వాటిపై రైతులకు రాయితీ (సబ్సిడీ) కల్పించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు తదితరులతో కలిసి వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

**సాంకేతికతతో పారదర్శకత.. ఎరువుల పంపిణీకి యాప్:**
వ్యవసాయ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో సన్నవడ్లు పండించే రైతుల పూర్తి డేటాను సేకరించాలని, వడ్ల కొనుగోళ్ల ప్రక్రియలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా నియమించి, దాంతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా చూసేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్స్‌కు ఒక ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. యాప్‌లో బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారానే పంపిణీ చేయాలని, ఈ మొత్తం పర్యవేక్షణ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్ (అడిషనల్ కలెక్టర్)కు అప్పగించాలని ఆదేశించారు.

**రామగుండం ఎరువులపై కేంద్రంపై ఒత్తిడి:** రాష్ట్రానికి అవసరమైన యూరియా, ఎరువుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వానికి తరచూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (RFCL)లో తయారయ్యే మొత్తం ఎరువులను తెలంగాణ రాష్ట్రానికే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పార్టీ వీడే వారికి పూర్తి స్వేచ్ఛ..



**ముంబై, జూన్ 16 (ఎఎంఎస్) :** శివసేన (యూబీటీ) ఎంపీలు ముఖ్యమంత్రి ఏకనాథ్ శిందే వర్గంలో చేరబోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలపై ఆ పార్టీ అధినేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అత్యంత ఆసక్తికరంగా స్పందించారు. పార్టీని వీడాలని అనుకునే వారు నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చని, ఈ విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛ ఉందని ఆయన స్పష్టం చేశారు. గతంలో సంభవించిన భారీ చీలికను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేస్తూ.. నాడు నలభై మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి వెళ్లిపోయారని, అప్పుడే తాను ఎవరినీ పార్టీలో ఉండమని బలవంతం చేయకూడదని గట్టిగా వెల్లడించారు.

**రేపు కచ్చితంగా నాదే.. ఓర్పుతో ఉంటా:**
సందిగ్ధ సమయాల్లో పార్టీని వీడి వెళ్లేవారు ఎన్నటికైనా తమ తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడటం ఖాయమని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. అయితే, వారు ఆ విషయం గ్రహించే సరికి అంతా ముగిసిపోతుందని, సమయం మించిపోతుందని వ్యాఖ్యానించారు. "ఈ రోజు సమయం నాది కాకపోవచ్చు.. కానీ రేపు కచ్చితంగా నాదే అవుతుంది. అప్పటి వరకు పూర్తి ఓర్పు, సహనంతో ముందుకు సాగుతాను" అని ఠాక్రే ధీమా వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ టైగర్' పేరిట ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఎంపీలను తమ వైపు తిప్పుకోవడానికి శిందే వర్గం తెర వెనుక భారీ వ్యూహాన్ని రచిస్తోందంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఉద్ధవ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఏసీబీ సోదాల్లో రూ.150 కోట్ల తిమింగలం



**డిప్యూటీ డైరెక్టర్ నరహరి అరెస్ట్**

**10 చోట్ల ఏసీబీ తనిఖీలు**

**అధికారి ఇంట్లో రూ.1.54 కోట్ల నగదు స్వాధీనం**

**రూ.13.05 కోట్ల ప్రభుత్వ విలువైన అక్రమాస్తులు**

**గచ్చిబౌలి, మహేశ్వరం, పుప్పాలగూడల్లో భవనాలు, ప్లాట్లు..**

**హైదరాబాద్, జూన్ 16 (వుదయం) :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. నరహరి అక్రమార్జనపై పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. ఆయన నివాసంతో పాటు ఏకకాలంలో మరో 9 ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో ఊహించని స్థాయిలో భారీగా అక్రమాస్తులు వెలుగుచూశాయని అధికారులు వెల్లడించారు.

**ఇంట్లోనే నోట్ల కట్టలు, కేజీల కొద్దీ బంగారం:**
నరహరి ఇంట్లో జరిపిన తనిఖీల్లో ఏసీబీ అధికారులు భారీగా నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన నివాసంలో రూ.1.54 కోట్ల నగదు లభించగా.. ఏకంగా రూ.5.04 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, వివిధ బ్యాంకు ఖాతాల్లో మరో రూ.2.29 కోట్ల సొమ్ము ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నరహరి భార్య పేరిట రెండు బ్యాంకు లాకర్లు, ఒక లగ్జరీ కారు ఉన్నట్లు సోదాల్లో తేలింది.

**భారీగా భూములు, భవనాలు:**
నరహరి కేవలం నగదు, బంగారమే కాకుండా రియల్ ఎస్టేట్ రంగంలోనూ భారీగా పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. రంగారెడ్డి జిల్లా పరిధిలో 5 ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఒక విలాసవంతమైన అపార్ట్‌మెంట్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో ఒక ఫ్లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 అంతస్తుల భవనం, ఛత్రినాకలో మరో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ నిర్ధారించింది.
ప్రభుత్వ అధికారిక లెక్కల (రిజిస్ట్రేషన్ విలువ) ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లుగా తేలినప్పటికీ.. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం వీటి విలువ రూ.150 కోట్లకు పైమాటే ఉంటుందని ఏసీబీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసిన అధికారులు, నరహరిని కోర్టులో హాజరుపరచనున్నారు.

## చిన్న కాంట్రాక్టర్లకు 'ప్రజా ప్రభుత్వం' అండ

**'చలో హైదరాబాద్' వాయిదా**



**హైదరాబాద్, జూన్ 16 (వుదయం) :** రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో స్పందిస్తోందని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఆయన వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. అంతకుముందు, మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారితో చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు.

**'చలో హైదరాబాద్' వాయిదా: రవీందర్ రెడ్డి**
పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తానే లేకుంటే ఇజ్రాయెల్ ఉండేది కాదు



**పారిస్:** పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) సంక్షోభం, ఇజ్రాయెల్ భద్రతపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గనుక మధ్యలో జోక్యం చేసుకోకపోయి ఉంటే ఇజ్రాయెల్ దేశం ఎప్పుడో అంతమైపోయేదని ఆయన సంచలన ప్రకటన చేశారు. జీ-7 దేశాల సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ వచ్చిన ట్రంప్.. ఈ సందర్భంగా ఖతార్ ఎమిర్‌తో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో పశ్చిమాసియా పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే, లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న సైనిక తీరు పట్ల ఆయన బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు.

**నెతన్యాహు మరింత బాధ్యతగా వ్యవహరించాలి:**
ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు (బీబీ)తో తనకు వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయని చెబుతూనే, ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన మరింత జాగ్రత్తగా ఉండాలని ట్రంప్ సూచించారు. "లెబనాన్ అనేది ఒకప్పుడు గొప్ప సంస్కృతి, ప్రొఫెసర్లు, లాయర్లు, వైద్యులతో విలసిల్లిన దేశం. కానీ ఇప్పుడు అక్కడ అత్యంత దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. లెబనాన్, హెజ్‌బొల్లా వ్యవహారంలో ఇజ్రాయెల్ అవలంబిస్తున్న వైఖరి నాకు నచ్చడం లేదు. వాస్తవానికి ఈపాటికే అక్కడ శాంతి ఒప్పందం పూర్తి కావాల్సింది.. కానీ అంతులేకుండా సాగుతూనే ఉంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**మరో మార్గం లేకనే ఇరాన్‌పై దాడులు:** ఇదే సమయంలో ఇరాన్ అంతర్గత పరిస్థితులను ప్రస్తావిస్తూ.. అక్కడి ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా నిరసనల్లో దాదాపు 42 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్‌పై అమెరికా జరిపిన సైనిక దాడులను సమర్థిస్తూ.. తమకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేకనే ఆ దేశంపై దాడులు చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.
అయితే, ప్రస్తుత శాంతి ఒప్పందం ఇరుపక్షాలకు న్యాయబద్ధంగానే ఉందని, అదే సమయంలో ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్‌లో అమెరికా భారీగా పెట్టుబడులు పెట్టబోతోందంటూ వస్తున్న వార్తలను ఆయన పూర్తిగా కొట్టిపారేశారు. కాగా, అమెరికా-ఇరాన్‌ల మధ్య కుదిరిన తాజా ఒప్పందం పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపనకు, సానుకూల వాతావరణానికి మార్గం సుగమం చేస్తుందని ఖతార్ ఎమిర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.




## హైదరాబాద్ మెట్రోకు కేంద్రం పూర్తి సహకారం



**దిల్లీ జూన్ 16 (ఎఎంఎస్) :** హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న మిగతా మెట్రో ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భారతీయ జనతా పార్టీకి లేదని, బహుశా అది కాంగ్రెస్‌కే ఉండి ఉండవచ్చని వ్యాఖ్యానించారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సరైన రీతిలో సహకరిస్తేనే ప్రాజెక్టులు సాకారమవుతాయని, తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం అనేక మార్పులను, సూచనలను రాష్ట్రానికి పంపిందని వివరించారు.

**తెలంగాణ ప్రజలకే జవాబుదారీ:**
తెలంగాణ అభివృద్ధి పట్ల కేంద్రానికి పూర్తి చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్ 1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. ఇలాంటి తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి రేవంత్‌రెడ్డి లేదా కాంగ్రెస్ పార్టీ సర్టిఫికెట్లు అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ" అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తాము 12 ఏళ్లుగా పనిచేశామని, ఇప్పుడూ చేస్తామని.. హైదరాబాద్ అభివృద్ధి పట్ల తమకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదని ఎద్దేవా చేశారు.

## లాఠీలతో నిరుద్యోగుల గొంతు నొక్కితే ప్రభుత్వానికి కాలం దగ్గరపడినట్టే



**హైదరాబాద్, జూన్ 16 (వుదయం) :** రాజధానిలోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగ యువత, పోలీస్ అభ్యర్థులపై ప్రభుత్వం లాఠీఛార్జ్ చేయించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) తీవ్రంగా ఖండించారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న అభ్యర్థులను వీధుల వెంట వెంటాడి వేటాడటం, అక్రమంగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, నిరంకుశత్వానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. విద్యార్థులను, నిరుద్యోగులను పోలీసు బూట్లతో అణగదొక్కడమే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 'ఇందిరమ్మ ప్రజా పాలన'నా అని కేటీఆర్ తీవ్రంగా ప్రశ్నించారు.

**నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతున్నారు:**
ఎన్నికల ముందు ఒకే ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, 'మెగా నోటిఫికేషన్లు', 'జాబ్ క్యాలెండర్' అంటూ ఆచరణ సాధ్యం కాని కోతలు కోసి, నిరుద్యోగ యువతను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతోందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేలకి పైగా పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ, కేవలం 5 వేల పోస్టులతో ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం అభ్యర్థులకు జరుగుతున్న ముమ్మాటికీ అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నట్టుగా వెంటనే 20,000 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అరెస్టయిన వారిని బేషరతుగా విడుదల చేయాలి:**
దిల్‌సుఖ్‌నగర్‌లో తమ హక్కుల కోసం పోరాడిన నిరుద్యోగ జేఏసీ నేతలను, విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అరెస్టయిన ప్రతి ఒక్క నిరుద్యోగ బిడ్డను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "లాఠీలతో నిరుద్యోగుల గొంతు నొక్కాలని చూస్తే ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడినట్టే. నిరుద్యోగుల ఆవేదనను, వారి న్యాయమైన డిమాండ్లను లాఠీలతో అణచివేయలేరు" అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరి వీడి.. 20 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ, వయోపరిమితి సడలింపు వంటి నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో నిరుద్యోగ, విద్యార్థి సమాజానికి అండగా నిలిచి బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాడుతుందని హెచ్చరించారు.

## యూరియా పంపిణీలో పారదర్శకతే ప్రధానం



- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఎరువుల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు రైతులు ఆందోళన చెందొద్దు

నాగర్ కర్నూల్, జూన్ 16
(వుదయం ప్రతినిధి)

ఖరీఫ్ సాగు సీజన్‌లో రైతులకు యూరియా ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని గ్రోమోర్ క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రం, పీఏసీఎస్, ప్రైవేట్ ఎరువుల కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రోమోర్ కేంద్రంలో యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, నానో యూరియా, నానో డీఏపీ లభ్యతను కలెక్టర్ పరిశీలించారు. రైతుల అవసరాలు, రాబోయే డిమాండ్‌కు అనుగుణంగా నిల్వల నిర్వహణపై ఆరా తీశారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పీఏసీఎస్ కేంద్రంలో ఆధార్ ధృవీకరణ, బయోమెట్రిక్, పీఓఎస్ యంత్రాల ద్వారా జరుగుతున్న ఆన్‌లైన్ యూరియా పంపిణీని కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. "ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి రైతుకు ఎరువులు అందాలి. కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని హెచ్చరించారు. "రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించడమే ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు ఆందోళన చెందొద్దు" అని కలెక్టర్ భరోసా ఇచ్చారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా కోఆపరేటివ్ అధికారి రఘునాథ్ రావు, ఆర్డీవో సురేష్ బాబు, నాగర్‌కర్నూల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి పూర్ణచంద్రారెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, సంబంధిత అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు, ఎరువుల కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఓట్లు చోరీ జాగ్రత్త : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ జిల్లా
(వుదయం బ్యూరో)



మహబూబ్ నగర్,స్థానిక సుదర్శన్ కన్వెన్షన్ హాల్‌లో టి పిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)పై బిఎల్ఎలకు అవగాహన శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,ప్రతి గ్రామంలో ఒక్క ఓటు కూడా ఎవరూ నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బిఎల్ఎ లకు పిలుపునిచ్చారు. SIR ప్రక్రియ పేరుతో దేశంలోని కొన్ని రాష్ట్రాలలో లక్షలాది ఓట్లను తొలగించిన ఉన్నాయని ఆరోపించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలను ఉదాహరణగా చూపుతూ, ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే చర్యలను ఆయన ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇలాంటి కుట్రలు జరిగే అవకాశముందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్రంలో ఒక్క ఓటరు కూడా తన ఓటును కోల్పోకుండా కాపాడటం ప్రతి బిఎల్ఎ బాధ్యత అని స్పష్టం చేశారు. బిఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, వారు అందించే ఫారాలను ప్రజలచేత సరిగ్గా నింపించి అధికారులకు సమర్పించాల్సిన బాధ్యత బిఎల్ఎ లపైన ఉందన్నారు. ఓటర్లకు ఎల్లప్పుడూ అండగా నిలిచి, వారిలో చైతన్యం కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో వాటిని తిప్పికొట్టాలని, వలస వెళ్ళిన వారి వివరాలను ఓటర్ లిస్టులో ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే గ్రామ స్థాయిలో ప్రతి ఓటరిని అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దాన్ని కాపాడటం ప్రతి కార్యకర్త ధర్మమని అన్నారు. బిఎల్ఎ శిక్షణ కమిటీ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే టి. రాంమోహన్ రెడ్డి బిఎల్ఎలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బిఎల్ఓలు గ్రామాలకు వచ్చినప్పుడు ఇతర పనులను పక్కన పెట్టి వారితో కలిసి SIR కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. నెలరోజులపాటు గ్రామాలలోనే ఉండి ఓటర్ల వివరాలను సమగ్రంగా సేకరించాలని, ఎలాంటి అలసత్వం వహించినా పార్టీకి మరియు ప్రజలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, టి పిసిసి ప్రత్యేక ట్రేనర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, డిసిసి ప్రధాన కార్యదర్శులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సాయిబాబా, రాములు యాదవ్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ సెల్ చైర్మన్ ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో కరెంటు అంతరాయం..

మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి

నిజాంపేట మండల కేంద్రంతోపాటు నస్కల్, బచ్చురాజుపల్లి, నల్ స్టేషన్,ల పరిధిలో గల గ్రామాలకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ గణేష్,ఓ ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట, నస్కల్,బచ్చురాజుపల్లి, 33/11కెవి సంబంధించి వర్షాకాలం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యగా చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా అంతరాయం కావున విద్యుత్ వినియోగదారులు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

## పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలి



అదనపు కలెక్టర్ మధు మోహన్
గద్వాల జూన్ 16
(వుదయం కరస్పాండెంట్)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (యస్ ఐ ఆర్) రూపకల్పన ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండాపారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుమోహన్ సూచించారు. మంగళవారం ఐడిఓసి సమావేశపు హాలులో గద్వాల రూరల్ మరియు అర్బన్ బిఎల్ఓ లు, బిఎల్ఏలు, సూపర్వైజర్లకు ఓటర్ జాబితా రూపకల్పనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధు మోహన్ మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా (ఎస్ఐఆర్) ను పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఈనెల 25 నుండి వచ్చేనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలన్నారు. డోర్ లాక్ ఉన్నట్లయితే ఒకటికి మూడుసార్లు ఇండ్ల వద్దకు వెళ్లి ఫారాలను అందించాలని సూచించారు. డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి వివరాలను సేకరించి ఓటర్ జాబితా నుండి అట్టి పేర్లను తొలగించాలన్నారు. అర్హత గల ఓటర్లు కచ్చితంగా తమ పేర్లను నమోదు చేసుకోనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, బిఎల్ఓ, బిఎల్ఏ లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## 40 ఫీట్ల రోడ్డు ఎప్పుడు..? కాలనీవాసుల నిరీక్షణకు ముగింపు ఎప్పుడో!

- ఎఫ్ఆర్ఎస్ రోడ్డు నుంచి బైపాస్‌కు కీలక లింక్ రోడ్డు నిర్మాణం కోసం ప్రజల విజ్ఞప్తి

సంగారెడ్డి వుదయం



సంగారెడ్డి పట్టణ అభివృద్ధిలో కీలకంగా మారే 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం ఇంకా అమలుకు నోచుకోకపోవడంతో స్థానికులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 37వ వార్డు పరిధిలో రుక్మిణి థియేటర్ రోడ్డు నుంచి డీఐసీ కార్యాలయం లోపలి భాగం గుండా వెళ్లే 40 ఫీట్ల రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు భౌతిక రూపం దాల్చకపోవడం చర్చనీయాంశంగా మారింది.ఈ రోడ్డు నేరుగా సంగారెడ్డి బైపాస్ రోడ్డుకు అనుసంధానం అయ్యే అవకాశం ఉండటంతో, పట్టణ రవాణా వ్యవస్థకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఐయం కాలనీ, పరిసర కాలనీలతో పాటు మరో మూడు కాలనీల ప్రజలకు ఈ రోడ్డు ద్వారా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని వారు చెబుతున్నారు.సగం వరకే సర్వే.. ఆ తర్వాత మౌనంస్థానికుల కథనం ప్రకారం, గతంలో హెచ్ఎండీఏ అధికారులు ఈ రహదారి విషయంలో సర్వే చేపట్టినప్పటికీ, అది పూర్తి స్థాయిలో కొనసాగకుండా మధ్యలోనే నిలిచిపోయింది. సర్వే పనులు సగం వరకే జరిగి, తదుపరి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నాలుగు కాలనీలకు ఊరటఈ 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే బైపాస్ రోడ్డుకు చేరుకోవడం మరింత సులభమవుతుందని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం బైపాస్ చేరుకోవడానికి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, ఈ లింక్ రోడ్డు అందుబాటులోకి వస్తే సమయం, ఇంధనం ఆదా కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.అధికారుల సమన్వయంతోనే సాధ్యంహెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు వచ్చి మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ఈ రహదారి అమలుకు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కీలక ప్రాజెక్టును ఇకపై ఆలస్యం చేయకుండా అమలు చేసి, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల ప్రశ్నమాస్టర్ ప్లాన్‌లో ఉన్న 40 ఫీట్ల రోడ్డు ఎప్పుడు వాస్తవ రూపం దాల్చుతుంది..? సర్వే పూర్తయి, బైపాస్‌కు లింక్ రోడ్డు కల నెరవేరేది ఎప్పుడో..? అనే ప్రశ్నలు ప్రస్తుతం 37వ వార్డు ప్రజల నోట వినిపిస్తున్నాయి. అభివృద్ధి మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలని స్థానికులు కోరుతున్నారు.

## సంగారెడ్డిలో SIRపై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం



సంగారెడ్డి వుదయం

సంగారెడ్డిలో నిర్వహించిన SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 23న ఆందోల్‌లో మీనాక్షి నటరాజన్‌తో కలిసి SIRపై మరో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 2002లో SIR ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియలో ఓటర్ల జాబితా నుంచి కొన్ని ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.చీఫ్ ఎలక్షన్ కమిషన్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా SIR ప్రక్రియను నిర్వహిస్తున్నారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో SIR పేరుతో లక్షలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు.బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేసి ఓటర్ల హక్కులను కాపాడాలని సూచించారు. దామోదర రాజనర్సింహ తన రాజకీయ గురువని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మీనాక్షి నటరాజన్ నిజాయితీ గల నాయకురాలని, ఆమె నామినేషన్ తిరస్కరణ అన్యాయమని అన్నారు.బీజేపీపై విమర్శలు చేస్తూ, అధికారాన్ని శాశ్వతంగా భావించడం ప్రమాదకరమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. దేవుళ్ల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నించదని స్పష్టం చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 80 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ కాలేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై స్పందిస్తూ, గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమి చేసిందో వివరించాలని డిమాండ్ చేశారు. విభజన హామీలు ఇంకా అమలు కాలేదని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరారు.
రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసహనంతో విమర్శలు చేస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

## ధర్మపురిలో ఘనంగా అంగన్‌వాడీ పిల్లల సామూహిక అక్షరాభ్యాసం

- అమ్మ మాట-అంగన్వాడీ బాటలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం
- చిన్నారులకు స్కూల్ యూనిఫాంలు పంపిణీ జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్

ధర్మపురి,జూన్ 16
(వుదయం ప్రతినిధి):



ధర్మపురి క్షేత్రంలో అంగన్‌వాడీ చిన్నారుల కిలకిలరావాలు, వేదమంత్రాల సాక్షిగా అక్షర దీక్షా మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మమాటఅంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళ వారం స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ధర్మపురి లోకల్ సెంటర్ల అంగన్‌వాడీ పిల్లలకు సామూహిక అక్షరా భ్యాస కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.చిన్నా రులను విద్యాపథంలో నడిపించేం దుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్ర మంలో భాగంగా,ఆలయ అర్చకు ల వేదమంత్రోచ్చారణల మధ్య పిల్లల చేత అధికారులు,తల్లిదం డ్రులు ఓనమాలు దిద్దించారు. అనంతరం అంగన్‌వాడీ విద్యా ర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ యూనిఫాంలను అందజేశారు.ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్) చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఈ సందర్భం గా అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్ వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అక్షరాభ్యాస మహోత్సవంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని, తన చేతుల మీదుగా చిన్నారులకు యూనిఫాంలను డిస్ట్రిబ్యూట్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, సీడీపీఓ వాణిశ్రీ, ఏసీడీపీఓ మౌనిక, సూపర్వైజర్ స్వప్న,మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలు,పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 18వ తేదీ జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి.ప్రశాంతి



గద్వాల జూన్ 16
(వుదయం కరస్పాండెంట్)

జోగులాంబ గద్వాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ఈ నెల 18వ తేదీన ఐడీఓసీ (IDOC) లోని జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, విద్యార్హతగా ఎస్.ఎస్.సి, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు.
ఈ జాబ్ మేళా ద్వారా పుష్కల్ ఆగ్రో టెక్ లిమిటెడ్ ఐజ & గద్వాల, అర్సెటి గద్వాల, PMKK గద్వాల, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలలో 250 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎంప్లాయిమెంట్ కార్డు నమోదు చేసుకోని అభ్యర్థులు జాబ్ మేళా ప్రాంగణంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## గాయత్రి బ్యాంకు ఖాతాదారుడి కుటుంబానికి రూ.1 లక్ష ప్రమాద బీమా అందజేత

ధర్మపురి,జూన్ 16
(వుదయం ప్రతినిధి):



రోడ్డు ప్రమాదంలో మరణించిన గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడు సర్దా లక్ష్మణ్ కుటుంబానికి గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతా కింద లభించే రూ. 1.00 లక్ష ప్రమాద బీమా చెక్కును మంగళవారం ధర్మపురి శాఖలో అందజేశారు.మృతుడి భార్య జమునకు బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బింగె తిరుపతి,బ్రాంచ్ మేనేజర్ వొౌఝల మోహన్‌లు ఈ చెక్కును అందజేశారు.ఈ సంద ర్భంగా ఏజీఎం తిరుపతి మాట్లా డుతూ కనీస డిపాజిట్‌తోనే పేద, మధ్యతరగతి వినియోగదారుల కు బ్యాంకు అండగా నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు.ధర్మపురి పరిసర ప్రాంతాల్లో 14మంది బ్యాంకింగ్ కరెస్పాండెంట్లను నియమించి పెన్షనర్లు, రైతులకు సేవలు అందిస్తున్నామని బ్రాంచ్ మేనేజర్ మోహన్ తెలిపారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ. 8,600 వరకు రుణాలు ఇస్తున్నామని, కేవలం 10% వడ్డీకే కిసాన్ వికాస్ పత్రాలు, పోస్టాఫీస్ డిపాజిట్లపై రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 24 గంటల ఏటీఎం, మైక్రో ఏటీఎం,ఏఈపీఎస్, యూ పీఐ వంటి అన్ని రకాల డిజిటల్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సీట్ల కొరతతో బాలికల చదువులకు బ్రేక్

- కేజీబీవీల్లో అదనపు సీట్లు మంజూరు చేయాలి
- డీఈవోకు బీఆర్ఎస్వి వినతి

గద్వాల జూన్ 16 (వుదయం బ్యూరో)



జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీలు) సీట్ల కొరత కారణంగా పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన అనేక మంది బాలికలు ప్రవేశాలకు దూరమవుతున్నారని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి బాలికకు విద్యా అవకాశం కల్పించేలా కేజీబీవీల్లో సీట్ల సంఖ్యను పెంచాలని కోరుతూ మంగళవారం జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈవో)కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగులాంబ గద్వాల జిల్లా విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతమని, ముఖ్యంగా బాలికల అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు కేజీబీవీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన బాలికలు విద్యాభ్యాసంపై ఆసక్తి కనబరుస్తు న్నప్పటికీ, సీట్ల కొరతతో అనేక మంది ప్రవేశాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మాత్రమే కాకుండా ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా సీట్లను పెంచాలని, సీటు లేక ఒక్క బాలిక కూడా విద్యకు దూరం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదనపు సీట్లు, మౌలిక వసతులు, బోధన సిబ్బందిని అందుబాటు లోకి తీసుకురావాలని కోరారు. బాలికల విద్యాభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రంగస్వామి, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల బలోపేతమే లక్ష్యం




- జిల్లాకలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి
- నల్లమల్ల ఏజెన్సీలో ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేయాలిఅధికారులకు ఆదేశం

నాగర్ కర్నూల్, జూన్ 16
(వుదయం ప్రతినిధి)

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహిళా మరియు శిశు సంక్షేమ, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు జారీ చేశారు.జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పనితీరును సమగ్రంగా పరిశీలించాలని, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి పొందించాలని కలెక్టర్ సూచించారు. ర్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలపై మరింత శ్రద్ధ వహించాలని అన్నారు. తీవ్ర, మధ్యస్థ పోషకాహార లోపం కేటగిరీల్లో ఉన్న పిల్లలను తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమన్వయం పెంచుకొని అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల వివరాలు, చికిత్సలు, పోషకాహార చర్యల సమాచారంతో సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. "పిల్లల ఆరోగ్యం, పోషకాహార స్థితి మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా పనిచేసి నిర్దేశిత గడువులోపు నివేదికలు అందజేయాలి. పోషకాహార లోపం నిర్మూలనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను ఆదర్శంగా నిలపాలి" అని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు.

## 23 వేల ప్రభుత్వ బడుల మూసివేతపై ఏబీవీపీ ఆగ్రహం

హైదరాబాద్:

రాష్ట్రంలో విద్యావ్యవస్థ సమస్యలపై అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసిందని ఆరోపిస్తూ మంగళవారం ఏబీవీపీ కార్యకర్తలు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ) కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో బైఠాయించి ప్రభుత్వం, విద్యాశాఖకు వ్యతిరేకంగా సందర్భంగా ఏబీవీపీ ప్రతినిధులు మాట్లాడుతూ.. వేలాది ప్రభుత్వ బడులను మూసివేయడం వల్ల అందులో చదువుకునే పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నేటికీ కనీసం పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు (దుస్తులు) పంపిణీ చేయకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇదే అదునుగా పుస్తకాలు, దుస్తుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నాయని, వారి దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోయిందని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## ధరూర్ బడిలో డీఈవో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల పరిశీలన
- చిన్నారులకు పుస్తకాల పంపిణీ..
రికార్డుల నిర్వహణపై సంతృప్తి

ధరూర్ జూన్ 16 (వుదయం బ్యూరో)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంపు, విద్యార్థుల నమోదు విస్తరణ లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయలక్ష్మి ధరూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హరిజన్ చెర్రీ) ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, అభ్యాస స్థాయిలు, కొత్త అడ్మి, లేఖన నైపుణ్యాలను పరీక్షించి, ప్రాథమిక విద్యాభ్యాసంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్లు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. పాఠశాల అకడమిక్ రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం రిజిస్టర్లు, ఇతర పరిపాలనా పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలకు విద్యార్థుల నమోదు పెరుగుతోందని, మరో ఐదుగురు విద్యార్థులు త్వరలో ప్రవేశం పొందనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జోష్ణ డీఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జోష్ణ, ఉపాధ్యాయులు మంజులదేవి, వెంకటేశ్వరమ్మ, కిషోర్ చంద్ర, సీఆర్పీ నరసింహులు పాల్గొన్నారు.

## జూన్ 20న రెండవ జాతీయ లోక్ అదాలత్ - కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల జూన్ 16 (వుదయం బ్యూరో)



ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, సులభంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెండవ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 2026 జూన్ 20న నిర్వహించనున్న రెండవ జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు ఒక గొప్ప అవకాశం అని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర రాజీ ద్వారా తక్కువ సమయంలో పరిష్కరించుకునే వీలు ఈ వేదిక ద్వారా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, కుటుంబ సమస్యలు వంటి అనేక అంశాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు కోర్టు చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గి, సమయం మరియు వ్యయం రెండూ ఆదా అవుతాయని ఆయన వివరించారు. అదేవిధంగా లోక్ అదాలత్ ఒక శాంతియుత, రాజీ విధానంలో జరిగే పరిష్కార ప్రక్రియ కావడంతో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ విధానం ద్వారా కోర్టు కేసులు త్వరగా ముగిసి, ప్రజల్లో పరస్పర సౌహార్ద వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని ప్రజలు తప్పకుండా వినియోగించు కోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. న్యాయం త్వరగా అందించడంలో లోక్ అదాలత్ ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేస్తూ, జిల్లా ప్రజలు ఈ రెండవ జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని తమ సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు.



" మహిళా రిజర్వేషన్ అమలుకు బీజేపీయే అతి పెద్ద అడ్డంకి. మహిళలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఆ పురోగతి రాజకీయ ప్రాతినిధ్యంలో ప్రతిబింబించటం లేదు. మహిళలు ప్రధానంగా ఇంటి బాధ్యతలకే పరిమితం కావాలనే భావజాలాన్ని బీజేపీఆర్ఎస్ఎస్ కూటమి ప్రోత్సహిస్తోంది. 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బీజేపీ మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయకుండా తొక్కిపట్టటం శోచనీయం. ఇతర వివాదాస్పద చట్టాలను మాత్రం ఎలాంటి చర్చలు లేకుండానే ఆమోదించుకుంటున్నారు. ఇది మరింత దారుణం... "

**-బృందా కరత్ ,సీపీఐ (ఎం) జాతీయ నేత**

## 'వేమన' పద్యం

**తప్పులెన్నువారు తండోపతండంబు**
**లుర్విజనులకెల్ల నుండు తప్పు**
**తప్పులెన్నువారు తనతప్పులెరుగరు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**



## సంపాదకీయం

# కనీస వేతనం అందని ద్రాక్షేనా..?

దేశానికి ఆదర్శవంతంగా ఉండేలా కార్మికులకు కనీస వేతనాల పెంపుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన బుట్టదాఖలైంది. అశాస్త్రీయమైన పద్ధతిలో వేతనాల్ని పెంచింది. దీన్ని సవరించాలన్న కార్మిక సంఘాల డిమాండ్ సహేతుకమైనది. దాదాపు పద్నాలుగు సంవత్సరాల తర్వాత కనీస వేతనాలను సర్కార్ సవరిస్తుందంటే కార్మికులు ఎంతగానో ఆశపడ్డారు. తమ కష్టానికి ఫలితం దక్కుతుందనుకున్నారు. కానీ, ఈ పెంపు పట్ల తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇది రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన కార్మికరంగాన్ని పాలకులు విస్మరించడమే తప్ప వేరే కాదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు పెంచిన విషయం తెలిసిందే. సహజంగానే ఈ నిర్ణయం స్వాగతించ దగినదే. కానీ, ప్రభుత్వం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, వేతనా లను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి కనీస వేతనాలను సవరించింది. పెరిగిన కనీస వేతనాలను జూన్ 1 నుంచి అన్ని సంస్థలకు అమలు చేస్తామని ప్రకటించ డంతో పాటు, ఇది అమలు జరిగేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్టు పేర్కొంది. అయితే, ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపు అసంబద్ధంగా, అన్యాయంగా ఉందనేది అర్థమవుతున్నది. 1948 నాటి కనీస వేతనాల చట్టం, కార్మిక సంఘాల డిమాండ్లు, 1991 నాటి సుప్రీంకోర్టు ఆదేశాలు, డాక్టర్ ఆండ్రాయిడ్ ఫార్ములా, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యవ సర సరుకుల ధరలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. సర్కార్ నిర్ణయంతో కనీస వేతనాల పెంపు వల్ల రాష్ట్రంలోని అన్ని రంగాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు లాభం చేకూరకపోగా తీరం నష్టం చేస్తుందనేది వాస్తవం. కనీస వేతనాల పెంపులో కరువుభత్యం అంశాన్ని స్పష్టంగా ప్రస్తావించలేదు. ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. గ్యాస్ సిలిండర్ నుంచి కూరగాయల వరకు, అద్దె ఇండ్ల నుంచి పిల్లల విద్య వరకు ప్రతిదీ కార్మిక కుటుంబాలపై భారంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం వేతనాల సంఖ్య పెరిగిందని చెప్పడం ద్వారా కార్మికుల జీవితాల్లో సంతోషాన్ని నింపినట్టు కాదు. ప్రస్తుతం తెలంగాణ కాంట్రాక్ట్ లేబర్ జీవో నెంబర్ 11 ప్రకారం కార్మికులు రూ.13,098 నుంచి రూ.23,683 వరకు వేతనాలు పొందుతున్నారు. కొత్తగా ప్రకటించసి పెంపు ప్రకారం అన్‌స్కిల్డ్ వర్కర్లకు కొంత ప్రయోజనం కనిపించినప్పటికీ, మిగతా కేట గిరీల్లో మాత్రం పెద్దగా మార్పు లేదని స్పష్టమవుతోంది. కనీస వేతనాల సలహాల మండల సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. స్కిల్డ్ కార్మికుడికి గత జీవో ప్రకారం ఉన్న వేతనం కన్నా ఇప్పుడు ప్రకటించిన మొత్తం తక్కువగా ఉండటం ఆశ్చర్యకరం. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం కార్మికుడి వేతనం అతని కుటుంబ జీవన అవసరాలను తీర్చగలిగే స్థాయిలో ఉండాలి. సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో కూడా అదే స్పష్టం చేసింది. డాక్టర్ ఆక్రాయిడ్ ఫార్ములా ప్రకారం కుటుంబ పోషణ, ఆహారం, దుస్తులు, నివాసం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వేతనాలు నిర్ణయించాలి. ఈ ప్రమాణాలన్నింటినీ వర్తింపజేస్తే కనీస వేతనం రూ.32 వేల వరకు రావచ్చని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. కానీ, వారు ప్రస్తుతం కనీసం రూ.26 వేలైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ధరల పరిస్థితుల్లో ఇది కనీస అవసరమే. ఇటీవల అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధం తీవ్రత, ఇంధన ధరల పెరుగుదల కారణంగా ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కార్మికుల అసంతృప్తి ఎలా ఉద్రిక్తతలకు దారి తీసిందో పాలకులు గుర్తు పెట్టుకోవాలి. నోయిడా పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన కార్మిక ఆందోళనలు అందుకు ఉదాహరణ. హర్యానా ప్రభుత్వం వేతనాలు పెంచిన తర్వాత కూడా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం స్పందించకపోవడంతో అక్కడ కార్మికుల్లో తీవ్రమైన అసహనం పెరిగింది. చివరకు ఆగ్రహం వీధుల్లోకి వచ్చింది. అలాంటి పరిస్థితులు రాకముందే ప్రభుత్వాలు సమస్యను అర్థం చేసుకోవాలి. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం సంతృప్తికరమైన వేతనాలు పెంచింది. ప్రస్తుతం ప్రభుత్వాలు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లు, పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధి వంటి నినాదాలను ఎక్కువగా ప్రచారం చేస్తున్నాయి. కానీ ఆ పరిశ్రమలను నడిపిస్తున్న శ్రమజీవుల జీవన ప్రమాణాల గురించి ఎంతవరకు ఆలోచిస్తున్నాయి? కార్మికుడి శ్రమ లేకుండా ఉత్పత్తి లేదు. ఉత్పత్తి లేకుండా అభివృద్ధి లేదు. అలాంటప్పుడు కార్మికుడి కనీస జీవన హక్కును కూడా నిర్లక్ష్యం చేయడం ఏ విధమైన న్యాయం? కనీస వేతనం అనేది దానం కాదు. అది కార్మికుడి హక్కు. కనుక ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలకే పరిమితం కాకుండా.. ప్రకటించిన వేతనాల్లో ఉన్న లోపాలను వెంటనే సవరించాలి. లేదంటే ఉద్యమాల ద్వారానే కార్మికులు వేతనాలు సాధించుకోవాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఎల్.ఐ.సీ బీమా-అందరికీ ధీమా

భారతదేశంలో 'బీమా' అనే పదం వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఎల్ఐసీ. అది కేవలం ఒక బీమా సంస్థ కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచిన మహాసంస్థ, కోట్లాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసా, భారత అభివృద్ధి ప్రయాణంలో కీలక భాగస్వామి. ఏడు దశాబ్దాలుగా కోట్లాది పాలసీదారులు తమ కష్టార్జిత సొమ్మును ఎల్ఐసీపై నమ్మకంతో

**ఎల్ఐసీ ఆర్థిక బలం, పెట్టుబడి విధానం, చరిత్రను పరిశీలిస్తే పాలసీదారులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నాయి. దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థగా, సుమారు రూ.60 లక్షల కోట్లకు పైగా ఆస్తుల నిర్వహణ కలిగిన ఎల్ఐసీ, ఒకటి రెండు కంపెనీల్లో వచ్చే సమస్యల వల్ల కదిలిపోయే సంస్థ కాదు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలోనే ఒక స్థిరమైన ఆర్థిక శక్తి. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఎల్ఐసీకి సుమారు 10.8 శాతం వాటా ఉంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.330 నుంచి 335 కోట్లు. సాధార ణంగా ఈ మొత్తం పెద్దదిగా అనిపించినా, ఎల్ఐసీ మొత్తం ఆస్తుల విలు వతో పోలిస్తే ఇది చాలా స్వల్పం.**

**ఇక్కడ ప్రతి పాలసీదారు తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విష యం ఏమిటంటే, ఎల్ఐసీ పాలసీదారుల నుంచి సేకరించే ప్రీమియంలను కేవలం నిల్వ ఉంచదు. వాటిని దేశ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, మౌలిక వసతుల నిర్మాణానికి, ఆర్థిక పురోగతికి ఉపయోగపడే రంగాల్లో పెట్టుబడి పెడుతుంది. ఒక పాలసీదారు చెల్లించిన ప్రీమియం కేవలం ఎల్ఐసీ ఖాతాలో ఉండిపోదు. అది దేశ ఆర్థిక చక్రంలో భాగమై ప్రజలకు ఉపాధి కల్పిస్తుంది, మౌలిక వసతులను సృష్టిస్తుంది, పరిశ్రమలకు ఊతమి స్తుంది**

అప్పగిస్తున్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఆ సొమ్మును కేవలం లాభాల కోసమే కాకుండా దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం వినియోగించడం ఎల్ఐసీ ప్రత్యేకత.ఇటీవల రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ వివాదం నేపథ్యంలో ఎల్ఐసీ పెట్టుబడుల పై కొన్ని కథనాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు జరుగుతున్నాయి. అయితే వాస్తవ గణాంకాలు, ఎల్ఐసీ ఆర్థిక బలం, పెట్టుబడి విధానం, చరిత్రను పరిశీలిస్తే పాలసీదారులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నాయి. దేశంలోనే అతి పెద్ద జీవిత బీమా సంస్థగా, సుమారు రూ.60 లక్షల కోట్లకు పైగా ఆస్తుల నిర్వహణ కలిగిన ఎల్ఐసీ, ఒకటి రెండు కంపెనీల్లో వచ్చే సమస్యల వల్ల కదిలిపోయే సంస్థ కాదు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలోనే ఒక స్థిరమైన ఆర్థిక శక్తి. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఎల్ఐసీకి సుమారు 10.8 శాతం వాటా ఉంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.330 నుంచి 335 కోట్లు. సాధార ణంగా ఈ మొత్తం పెద్దదిగా అనిపించినా, ఎల్ఐసీ మొత్తం ఆస్తుల విలు వతో పోలిస్తే ఇది చాలా స్వల్పం.ఇక్కడ ప్రతి పాలసీదారు తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఎల్ఐసీ పాలసీదారుల నుంచి సేకరించే ప్రీమియంలను కేవలం నిల్వ ఉంచదు. వాటిని దేశ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, మౌలిక వసతుల నిర్మాణానికి, ఆర్థిక పురోగతికి ఉపయోగపడే రంగాల్లో పెట్టుబడి పెడుతుంది. ఒక పాలసీదారు చెల్లించిన ప్రీమియం కేవలం ఎల్ఐసీ ఖాతాలో ఉండిపోదు. అది దేశ ఆర్థిక చక్రంలో భాగమై ప్రజలకు ఉపాధి కల్పిస్తుంది, మౌలిక వసతులను సృష్టిస్తుంది, పరిశ్రమలకు ఊతమి స్తుంది. ఆ పెట్టుబడుల ద్వారా వచ్చే వడ్డీ, లాభాలు, డివిడెండ్లు తిరిగి పాలసీదారుల ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. అంటే ఎల్ఐసీ పెట్టుబడి తత్వం 'ప్రజల డబ్బును ప్రజల అభివృద్ధికే వినియోగించడం' అనే జాతీయ దృక్పథంతో సాగుతుంది. భారత దేశంలో నిర్మితమవుతున్న అనేక జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలు, రైల్వే ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, గృహ నిర్మాణ పథకాలు, నీటి పారుదల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎల్ఐసీ నిధులు చేరుతున్నాయి

దేశ నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్ఐసీ ఒక ఆర్థిక వెన్నెముకలా పనిచేస్తోంది.ఈ కారణం గానే ఎల్ఐసీని కేవలం బీమా సంస్థగా కాకుండా, దేశాభివృద్ధిలో భాగస్వామిగా ఆర్థిక నిపుణులు అభివర్ణిస్తుంటారు. ఎల్ఐసీ పెట్టుబడుల లో అత్యధిక భాగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బాండ్లు , సెక్యూరిటీలలోనే ఉంటుంది. మొత్తం పోర్ట్‌ఫోలియోలో దాదాపు అరవై నుంచి అరవై ఐదు శాతం వరకు ప్రభుత్వ సెక్యూరిటీల్లోనే పెట్టుబడులు ఉన్నాయి. ఇవి దేశంలోనే అత్యంత భద్రమైన పెట్టుబడులుగా పరిగణించ బడతాయి. దీనితో పాటు విద్యుత్, రవాణా, మౌలిక వసతులు, గృహ నిర్మాణం, బ్యాంకింగ్, తయారీ రంగాలు, అత్యుత్తమ రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలో కూడా పెట్టుబడులు ఉంటాయి. ఈ వైవిధ్యభరిత పెట్టుబడి విధానం వల్ల ఒక రంగంలో వచ్చే నష్టం మొత్తం సంస్థపై ప్రభావం చూపే అవకాశం ఉండదు. ఎల్ఐసీ భారతీయ షేర్ మార్కెట్‌లో అతిపెద్ద సంస్థాగత పెట్టుబడిదారు లలో ఒకటి. మార్కెట్ ఒడిదొడుకులను అవకాశాలుగా మలచడం సంస్థ ప్రత్యేకత. గత కొన్ని ఆర్థిక సంవత్సరాలలో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్ ద్వారా సాధించిన లాభాలు దీనికి నిదర్శనం. రిలయన్స్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ వంటి బ్లూచిప్ కంపెనీలలో ఎల్ఐసీకి ఉన్న పెట్టుబడులు ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల డివిడెండ్లు, మూలధన వృద్ధిని అందిస్తున్నాయి. మార్కెట్‌లో తాత్కాలిక ఒడిదొడుకులు వచ్చినా, దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహం వల్ల ఎల్ఐసీ స్థిరమైన లాభాలను నమోదు చేస్తోంది. సోషల్ మీడియా ప్రచారాలు, తాత్కాలిక మార్కెట్ వార్తలు, ఒకటి రెండు కంపెనీల వివాదాలు వచ్చి పోతుంటాయి. కానీ ఎల్ఐసీ వంటి మహాసంస్థల బలం వాటి వెనుక ఉన్న ఆస్తుల్లో మాత్రమే కాదు, కోట్లాది భారతీయులు దశాబ్దాలుగా ఉంచిన విశ్వాసంలో ఉంది.

# సీఎం నోట హిట్లర్ మాట

హిట్లర్ అనేవాడు ఒకప్పుడు జర్మనీలోనే ఉండే! కార్ల్‌మార్క్స్ అనే తత్వవేత్త కూడా అక్కడే ఉండే. వీళ్లిద్దరూ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆలోచనల్లో ప్రపంచ మంతా ఉన్నారు. కాకుంటే మంచిపని కంటే కాస్తా చెడ్డపనికే ప్రచారం ఎక్కువ. అది లోకం తీరని సరిపెట్టుకుందాం. ప్రచార సాధనాల నిండా హిట్లర్ అనబడే పేరు మార్మోగిపోతుంటే, ఈయన రూపం ఈ తరానికి ఎక్కడ చూపించాలి. ఈ తరం హిట్లర్లు మాస్క్ తగిలించుకొని ఉంటారు. ఆ మాస్క్ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావచ్చు, పక్క రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు కావచ్చు, మరి కాస్తా పైకెళితే ప్రధాని మోడీ కావచ్చును, ఇంకాస్తా పైకెళితే ప్రపంచ పోలీసు బాస్ ట్రంప్ కావచ్చును. వెనక్కు వెళితే కేసీఆర్,జగన్, దీదీ, కేజ్రీవాల్ ఎవరైనా కావచ్చును. మాస్క్ తొలగిస్తే కనపడే అంతర్ముఖం అధికారం. అది ముదిరితే అహంకారం, మరింత ముదిరితే దురహంకారం. అధికారం, దానిచుట్టూ పేరుకుపోయిన దురహంకారమే హిట్లర్. హిట్లర్ అనబడే పదం మానవరూపంతో పోల్చుకునే పదం కానేకాదు. ఇప్పుడు అది నియంతలకు, నియంతృత్వానికి పర్యాయపదం. ప్రజాస్వామ్యం పక్కనే నియంతృత్వం అనబడే వ్యతిరేక పదం ఉంటుంది.ఈ రెండుపదాలు అధికారం చుట్టూ పరిభ్రమించే కీలకమైన అర్థన్నిచ్చే అసాధారణ పదాలే. కాకుంటే ఇవి పదాలేకాదు చారిత్రికంగా పేరుకుపోయి స్థిరపడ్డ భావనలు. ఇప్పుడు ఇది అధికారానికి అటూ, ఇటూ బొమ్మ బొరుసు, లేదా చిత్తు బొత్తు! అధికారం అనబడే లక్ష్మణరేఖకు ఆవతలవైపు ప్రజాస్వామ్యం ఉంటే, ఇవతల వైపు నియంతృత్వం ఉంటుంది. అంటే నేతలు ఓటేయించుకునే వరకు ప్రజా స్వామ్య వాదులు గానే ఉంటారు. అధికారంలోకి వచ్చి పీఠాలు ఎక్కిన తర్వాతనే నియంతలుగా మారతారు. మనిషిని త్వరగా నియంతగా మార్చగల ముఖ్యమైన సాధనం రాజ్యాంగ యంత్రం. దాని పాలనా కేంద్రీ కరణ అభిముఖం! అక్కడేకొత్త మాస్క్ ముఖానికి తగిలించుకుని అధికారం అనే భావన మనిషిని 'హిట్లర్' రూపానికి దగ్గరగా తీసుకెళుతుంది. అధికారం ఎప్పుడూ దాన్ని



అనుభవించే వారికి దాహం లాంటిది, అది ఎంతకీ తీరేది కాదు? అది తనకే శాశ్వతం కావాలని ఎప్పటికప్పుడు కోరుకుం టుంది. దానిరుచి,వాసన వేరు.అందుకు ఎన్ని అష్టవంకర్లయినా అది తిరుగుతుంది. అధికారంలో ఉన్న ఎవరైనా, ఎంతగొప్పవారైనా ఏదో ఒక సందర్భం, ఎప్పుడో ఒకసారి వారితో అధికారం అనబడే మాస్క్ లోపల హిట్లర్ ముఖం కనిపిస్తుంది.

ప్రజాస్వామ్య వాదులు కాస్తా అధికారం రుచితో హిట్లర్లు అవుతారు. ఇదే ఇప్పుడు రాజకీయాల్లో సాధారణ సూత్రీకరణ. అంటే అధికారానికి ఈవల కనిపించే ముఖం ఏదైనా ఒక నిర్ణయం రూపం కావచ్చును, పూర్తి పాలనా స్వరూపం కావచ్చును. అది హిట్లర్ రూపమే! కాకుంటే తరతమ స్థాయిలే వేరు. అందులోనూ పోల్చుకునే సందర్భాన్ని బట్టి. అయితే హిట్లర్ చర్చ ఇప్పుడెందుకు వచ్చిందని కదా మీ ప్రశ్న. ఇటీవల ఓ పాత్రికేయుడితో జరిగిన ఇంటర్వ్యూలో తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుకోకుండా తనలో ఉన్న "హిట్లర్"అనబడే ముఖాన్ని బయట పెట్టుకున్నారు. తనకిష్టమైన ''హైడ్రా'' అనబడే పదం ఒక నాటి జర్మనీ నియంత హిట్లర్ అనబడే వ్యక్తి కూల్చివేత డిక్షనరీ లోంచి అరువు తెచ్చామని ప్రకటించారు.ఆయన చెప్పడంలో బోళాతనం, నిజాయితీని ఎవరూ శంఖించాలసిన పనిలేదు. కాకుంటే హిట్లర్ అంటే నాకిష్టం అని పరోక్షంగా అనడం, హిట్లర్ హిస్టరీ గురించి లోతుగా అధ్యయనం లేకపోవడం రేవంత్ రెడ్డిలో బయటపడ్డ జ్ఞాన సంకుచితం తప్ప మరొకటి కాదు. రేవంత్ రెడ్డి తెలంగాణాలో అధికారంలోకి రాగానే రాష్ట్ర రాజధానిలో వేసిన పాలనా ముద్ర లేదా ఓ సరికొత్త వ్యవస్థాగత నిర్మాణం "హైడ్రా" ఏర్పాటు. దాని ఉద్దేశ్యం మంచిదే కావచ్చును. నాళాలు, చెరువుల ఆక్రమణలు తొలగింపు, అన్యోపదేశంగా అక్రమ నిర్మాణాలు తొలగింపు... ఈ అనధికార కట్టడాలు అనే పదానికి పునాదులు వేసింది, అనుమతు లిచ్చింది గత పాలకులే! అంటే అది కేసీఆర్, వైఎస్సార్, చంద్రబాబు మరెవరైనా కావచ్చును. లేదా వారి పాలనలో అధికారులైనా కావచ్చును. వీరంతా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏదో ఒక స్థాయిలో ఆదర్శ ప్రాయులు, ప్రీతిపాత్రులు,అనుసరణీయులే! కనుక ఆక్రమణ క్రమాన్ని అనుమతించిన వారు కనుకనే అక్కడ నివాసాలు ఏర్పరచుకున్నారు. ఇన్నేండ్ల తర్వాత అధికారం తిరిగొచ్చి అది అక్రమం ఇల్లు కూలగొడతా, బుల్డోజర్ నడుపుతా అంటే అధికా రాల నడుమ గూడు, కూడు, నీడ కోల్పోయే సామాన్య ప్రజలకు పాలకులు 'హిట్లర్' లాగానే కాదు, ఆయన అయ్య లాగానే కనిపిస్తారు. అందులో మినహాయింపు లేదు. ముఖ్యమంత్రి హైడ్రా ఏర్పాటు విషయంలో మంచి,చెడు రెండు అంశాలు దానిలో మిళితమై ఉండొచ్చును. కానీ పాలకులు, ప్రజల్ని చూసే వైఖరిలోనే భిన్నత్వం కనబడుతుంది. రేవంత్ రెడ్డి చాలాసార్లు చాలా బోలాగా మాట్లాడుతారు.

అనుభవరాహిత్యమా? లేక ఉద్దేశపూర్వకమా? అనేది పక్కన పెడితే, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కార్మిక నాయకుడు టంగుటూరి అంజయ్య తర్వాత, ఆ స్థాయిలో ఓ ముఖ్యమంత్రి మాటలపై చర్చ జరిగింది మాత్రం ఇప్పటి రేవంత్ మాటలకు మాత్రమే! ఇప్పుడే కాదు, ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఏదోఒక మాట తూలుతూనే ఉన్నారు. చర్చలో భాగమవుతూనే ఉన్నారు. కీలకమైన స్థానంలో ఉన్న వారినే కాదు,వారి మాటలనీ సమాజం పరిశీలనలో ఉంచుకుంటుంది. అందులో మినహాయింపు లేదు. అదే సందర్భంగా 'డిమాలిటైజేషన్'అనే పదానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన పోలిక కూడా అర్థరహితం అయినది. హైడ్రాబాద్ హైడ్రా కూల్చివేతలను ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధ విధ్వంసంతో పోల్చి చూడమనడం కచ్చితంగా అనుభవరాహిత్యం, జ్ఞాన రాహిత్యం కిందకే వస్తుంది. విచక్షణ తో కూడిన ఒక పాలనా చర్యను, పరస్పర విచక్షణ కోల్పోయి చేసుకునే ప్రతీకార దాడులు, విధ్వంస చర్యను ఒకే విధంగా పోల్చడం ఎంతమాత్రం సరైనది కాదు. ఉన్నత అధికార స్థానంలో ఉన్న వారు ఆచితూచి మాట్లాడాల్సి ఉంటుంది. ఎందుకంటే రేవంత్ రెడ్డి ఎన్నికల సభల్లో మాట్లాడినా, ప్రతి పక్షాలపై విమర్శలు చేసినా ఆయనకు ఆయనే జవాబుదారీ? కానీ, ఒక రాష్ట్ర పరిపాలకుడిగా ఉన్నతమైన స్థానం నుండి మాట్లాడే మాటకు కొంత సార్వజనీనత అవసరం. ఔన్నత్యం ఉండితీరాలి. ఎందుకంటే రేవంత్ రెడ్డిని వ్యక్తిగా కాకుండా సభ్యసమాజం తెలంగాణా ముఖ్యమంత్రి అనే భావన నుంచి చూస్తుంది, అదేస్థాయిలో అంచనా వేస్తుంది. కనుక ఆస్థానంలో ఎవరున్నా,చేతలే కాదు! మాటల పట్టింపు సహజంగా ఉంటుంది. కనుక రేవంత్ రెడ్డి మాట ముక్కోటి తెలంగాణా ప్రజల అధికార వాణి. ఆయన మాటలో సౌశీల్యం, అణుకువ, నిజాయితీ కనపడినపుడే అది తెలంగాణా సౌశీల్యత, సంపూర్ణత నింపుకుం టుంది. కనుక రేవంత్ రెడ్డినే కాదు పాలకులు ఎవరికైనా మెలుకువతో కూడిన అణుకువ నూటికి నూరు శాతం అవశ్యకమే! సందేహం ఉండాల్సిన అవసరమే లేదు, రాదు. ఈ విషయాన్ని గమనిస్తే మంచిది.

# జలచరాల రారాజులకు సంక్షోభం

## మొసళ్ల మనుగడను కాపాడుకుందామా

మొసళ్లు జీవించి ఉన్న సరీసృపాల్లో అతి పెద్దవిగా వర్గీకరించబడ్డాయి. అంతరించిపోతున్న మొసళ్లు, ఎల్లీగేటర్ల సంరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి ప్రతి ఏటా 17 జూన్ రోజు "ప్రపంచ మొసలి దినోత్సవం (వరల్డ్ క్రొకడైల్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన మొసళ్ల పట్ల అవగాహనలో భాగంగా జూ పార్కులు, వన్యప్రాణి సంరక్షణ సంస్థలు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తాయి. మొసళ్లను పెంచడం, విడుదల చేయడం అనే పద్ధతినా అవలంభించి వాటి సంరక్షించే ఆవాసాలను సృష్టించి, బందీగా ఉంచి సంతానోత్పత్తిని, అవగాహనను పెంచడం జరుగుతుంది. ప్రపంచ మొసలి దినోత్సవం2026 ఇతివృత్తంగా "ప్రతి పొలుసులో ఒక వారసత్వం (లెగసీ ఇన్ ఎవ్రీ స్కేల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారతదేశంలో మొసళ్ల జనాభా, వాటి ఆవాస కేంద్రాలు: 1975లో భారత్‌లో ఒడిసా భితార్కనికా జాతీయ ఉద్యాన వనంలో "క్రొకడైల్ కన్జర్వేటరీ ప్రాజెక్ట్" ప్రారంభించారు. మంచినీటి చిత్తడి నేలలు, సరస్సులు, నదుల్లో ఇవి జీవిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మొసళ్లు, ఎలిగేటర్లు, కైమన్లు, ఘరియల్ అనే రకాలు ఉన్నాయి. శీతల రక్త జంతువులుగా మొసళ్లు నిశాచర జీవులు.ప్రపంచంలోని అడవి ఘరియాల్‌లో జనాభాలో 80 శాతం భారతదేశంలోనే ఉన్నాయి. నేషనల్ చంబల్ అభయారణ్యం, కటార్నియా ఘాట్, సోన్ ఘరియాల్ అభయారణ్యం వంటి ప్రదేశాల్లో సుమారు 3,000 వరకు ఉన్నాయి. భారతంలో ఉప్పునీటి మొసళ్ల జనాభా 2,500 వరకు పునరుద్ధరించబడింది. నేటికి మొసళ్ల సంరక్షణకు 50 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా మరింత చొరవ తీసుకొని మొసళ్లను కాపాడుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారతంలో ఘరియల్, మగ్గర్, ఉప్పునీటి మొసలి అనబడే మూడు ప్రధాన జాతులు ఉన్నాయి. మొసళ్ల ఆవాసాల నష్టం, అక్రమ వేటగాళ్లు, గుడ్లను వేటాడడం, కాలుష్యం, నదీతీర వ్యవసాయం, కృత్రిమ కట్టలు, బ్యారేజ్‌లు, ఆనకట్టల నిర్మాణాలు, అక్రమ ఇసుక తవ్వకాలు లాంటి కారణాలతో మొసలి జాతి తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నది. తెలంగాణలో మంచిర్యాల జిల్లాలోని 'శివ్వారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం", సంగారెడ్డి జిల్లాలో "మంజీరా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం" ఉన్నాయి. అదే విధంగా మెదక్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో కూడా ఇవి కనుపిస్తాయి. మాంసాహార మొసళ్లు జలాల్లోని చేపలు, ఇతర జంతువులను నీటిలోకి లాగి తింటాయి. మొసలి జాతి 5 నుంచి 20 అడుగుల పొడవు వరకు ఉంటాయి. మొసళ్ల జనాభాను పెంచడానికి వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, ఇసుక తవ్వకాలు తగ్గించడం, అక్రమ వేటగాళ్ల చేతులకు బేడీలు వేయడం, జల కాలుష్యాన్ని తగ్గించడం లాంటి పలు చర్యలకు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఆచరించాలి. ప్రకృతిలోని ప్రతి ప్రాణిని కాపాడుకుంటేనే జీవ వైవిధ్యం పరిరక్షించబడుతుందని గమనించి తగు సంరక్షణ చర్యలు తీసుకుందాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# స్వాతంత్ర్య సమరంలో చెరగని ముద్ర



**లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహా ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు.హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు.**

ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.

1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి విస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు.

ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది.1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది.ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు 19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహా ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు.హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపెనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది.గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం





## ఎంఐఎం పొత్తుపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ భిన్నమైన వైఖరులు

- ఇండియా కూటమిలో చేర్చుకోవటంలో డైలమా
- బీజేపీని ఓడించేందుకు సిద్ధం: అసదుద్దీన్

**లక్నో, జూన్ 16:** వచ్చే ఏడాది ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎంతో పొత్తు అవకాశాలపై కాంగ్రెస్ , సమాజ్‌వాదీ పార్టీలు భిన్నమైన వైఖరిని ప్రదర్శించాయి. ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత బలోపేతానికి ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష ఇండియా కూటమిలోని అంతర్గత విబేధాలను ఇది మరోసారి బహిర్గతం చేసింది. ఇండియా కూటమిలో ఎంఐఎంను చేర్చుకునే విషయంపై ఏ నిర్ణయమైనా పార్టీ అధినాయకత్వమే తీసుకుంటుందని, అయితే మతోన్మాదం విషయంలో ఎటువంటి రాజీ ఉండదని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ స్పష్టం చేశారు.

"ఒకవైపు మతతత్వాన్ని వ్యతిరేకిస్తూ, మరోవైపు దానిని బలోపేతం చేయడం సాధ్యం కాదు. ఈ పోరాటం మోదీ, రాహుల్ గాంధీల మధ్య జరుగుతోంది. మధ్యేమార్గం లేదు. బీజేపీని ఓడించే శక్తి రాహుల్ గాంధీకి మాత్రమే ఉంది.. అందువల్ల, బీజేపీని ఓడించాలనుకునే వారు రాహుల్ గాంధీతో చేరి ఆయనకు మద్దతు ఇవ్వాలి" అని ఆయన ఉద్ఘాటించారు. గతేడాది ఏడాది కాలంలో ఢిల్లీ, బిహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయాల తర్వాత తమ వ్యూహాలను ప్రతిపక్ష కూటమి సమీక్షించుకుంటున్న తరుణంలో మసూద్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఢిల్లీ, బెంగాల్‌లలో 'ఇండియా' కూటమిలోని ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్‌లు భారీ పరాజయాన్ని చవిచూడగా... బిహార్‌లో బీజేపీ, దాని మిత్రపక్షం జేడీ (యూ) ఘనవిజయం సాధించాయి. గతవారం ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఎదురుదెబ్బలు తగిలినా భాగస్వాములు ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు కలిసికట్టుగా నిలబడితే బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని ఆయన పేర్కొన్నారు. సాంప్రదాయ రాజకీయ వ్యూహాలు, ప్రచార పద్ధతులు ఇకపై ప్రభావం చూపకపోవచ్చని టీఎంసీ ఆర్జేడీ, ఎస్పీ సహా వివిధ పార్టీలతో సహా కూటమి భాగస్వాములను రాహుల్ గాంధీ హెచ్చరించారు. 'వ్యవస్థలు నిష్పక్షపాతంగా ఉన్నప్పుడే ఇవి పనిచేసేవని... ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాత్రను పునరుద్ఘాటిస్తూ... బీజేపీ చిమ్ముతున్న 'విషాన్నంతటినీ మింగేందుకు' తమ పార్టీ సిద్ధంగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కాగా, ఇండియా కూటమిలో కొందరు నేతల్లో మాత్రం దీనికి భిన్నమైన వైఖరి వ్యక్తమవుతోంది. బీజేపీని కట్టడి చేయాలంటే ఒవైసీకి చెందిన ఎంఐఎంను కూడా కలుపుకుని, మరింత విస్తృతమైన విపక్ష కూటమిని ఏర్పాటు చేయాలని వారు భావిస్తున్నారు. సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ... బీజేపీని ఓడించడానికి ఏ రాజకీయ శక్తినైనా తాము స్వాగతిస్తామని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో ఎంఐఎంతో పొత్తు అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు . "బీజేపీని ఓడించే వారు ఎవరైనా సరే, వారికి స్వాగతం" అని ఆయన బదులిచ్చారు. మరోవైపు, యూపీలో బీజేపీ తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ఇతర ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఒవైసీ స్పష్టం చేశారు. గత యూపీ ఎన్నికల్లో చిన్న పార్టీలతో కలిసి 'భాగీదారీ పరివర్తన్ మోర్చా' పేరిట ఎంఐఎం కూటమిగా ఏర్పడి పోటీ చేసింది.

ఆ ఎన్నికల్లో 94 స్థానాల్లో ఆ కూటమి పోటీ చేసినప్పటికీ, కేవలం 0.49 శాతం ఓట్లను మాత్రమే సాధించి, ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది.

## కార్పొరేట్ కంపెనీలకే ఎర్ర తివాచీ

## విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పచ్చజెండా

- ఎఫ్‌డీఐల కోసం కేంద్రం మరిన్ని చర్యలు

**న్యూఢిల్లీ, జూన్ 15 ,(ఎ.ఎం.ఎస్):** విదేశీ పెట్టుబడిదారుల కోసం విస్తృత సంస్కరణలు చేపడుతామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు.. దేశీయంగా విదేశీ మూలధన ప్రవాహాన్ని వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సంయుక్తంగా కీలక చర్యలు ప్రారంభించాయన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన 'మైండ్ మైన్ సమ్మిట్ 2026'లో మంత్రి మాట్లాడుతూ.. విదేశీ నిధులను తిరిగి భారత మార్కెట్ వైపు ఆకర్షించేందుకు తీసుకుంటున్న ఈ చర్యల్లో ఇది మొదటి అడుగని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు ఉంటాయని స్పష్టం చేశారు. బాండ్ మార్కెట్ కోసం ఇటీవల ప్రకటించిన రాయితీలు కేవలం ఆరంభం మాత్రమేనని, విదేశీ పెట్టుబడులను పెంచేందుకు మరిన్ని విస్తృత ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. దేశ ఆర్థిక వృద్ధికి విదేశీ పెట్టుబడుల అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్కెట్లకు అవసరమైన పెట్టుబడులు అందేలా ఆర్బీఐ కలిసి పని చేస్తున్నామని వెల్లడించారు. 'మన దేశంలోకి మరింత విదేశీ మూలధనం రావాల్సిన అవసరం ఉందని మేము గుర్తిస్తున్నాం. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు విదేశాల నుండి నిధులను సేకరించడానికి ఆర్‌బిఐ అనుమతించింది. అయితే ఇది ఇక్కడితో ముగిసిపోయే ప్రక్రియ కాదు. భవిష్యత్తులో మరిన్ని చర్యలు తీసుకోబోతున్నాం.' అని



మంత్రి సీతారామన్ అన్నారు.

బాండ్ మార్కెట్‌ను బలోపేతం చేసేందుకు ఫుల్లీ యాక్సెసిబుల్ రూట్ (ఎఫ్ఏఆర్)తో అనుకూలమైన విత్‌హోల్డింగ్ టాక్స్ విధానం ద్వారా విదేశీ ఇన్వెస్టర్లకు భారతీయ బాండ్లను మరింత ఆకర్షణీయంగా మార్చామని ఆమె వివరించారు. అంతేకాకుండా పీఎస్‌యూలు, బ్యాంకులు విదేశాల్లో నిధులు సేకరించేటప్పుడు ఎదురయ్యే కరెన్సీ హెడ్జింగ్ రిస్క్ (విదేశీ మారక ద్రవ్య హెచ్చుతగ్గుల నష్టం) భారాన్ని ఆర్‌బిఐ భరించేలా ఒక ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించినట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్త వ్యాపారాల తరహాలోనే భారత్ కూడా తన నియంత్రణలో లేని పలు అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్థిక మంత్రి తెలిపారు.

అంతర్జాతీయ సుంకాలు, కమొడిటీ ధరలలో హెచ్చుతగ్గులు, గ్లోబల్ సప్లై చైన్‌లో ఏర్పడుతున్న అంతరాయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయన్నారు. భారతదేశానికి ఉన్న భారీ దేశీయ మార్కెట్ రక్షణ కవచంగా నిలుస్తున్నప్పటికీ.. కీలకమైన ముడిసరుకులు, ఇంటర్మీడియట్ వస్తువుల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోందని మంత్రి తెలిపారు. దీనివల్ల బాహ్య ఒడిదుడుకుల ప్రభావం దేశంపై పడుతోందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా ముడిచమురు ధరల పెరుగుదల, రవాణా బీమా ఖర్చులు, షిప్పింగ్ రిస్క్‌లు దేశ దిగుమతి బిల్లును, విదేశీ మారక నిల్వల అవసరాలను పెంచుతున్నాయన్నారు. ముఖ్యంగా ఎల్ నినో పరిస్థితుల వల్ల వాతావరణంలో మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఆహార కొరత రాకుండా సరిపడా సరిపడ నిల్వలు ఉన్నప్పటికీ, వర్షపాతం తగ్గితే రైతుల ఆదాయంపై ఒత్తిడి పడే అవకాశం ఉందన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుండి అంతర్జాతీయ ఎరువుల మార్కెట్ సరఫరా పరిస్థితులు అనేకసార్లు మారాయని మంత్రి తెలిపారు. కొన్ని సాంప్రదాయ సరఫరా దేశాలు తమ దేశీయ అవసరాల కోసం ఎగుమతులను తగ్గించుకోవడంతో కొరత ఏర్పడుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయని.. అయితే దాదాపు ఏడాది తర్వాత చైనా తిరిగి ఎగుమతుల మార్కెట్లోకి ప్రవేశించడంతో ఆ భయాలు కొంతవరకు తొలగిపోయాయని మంత్రి పేర్కొన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ కంపెనీలు జీసీసీలను విస్తరించడానికి ఆసక్తిని కనబర్చుతున్నాయన్నారు.

## నీట్‌పై కీలక ప్రకటన

- పరీక్ష ఫీజు రీఫండ్ ప్రక్రియ మరింత సులభతరం
- ఎన్‌టీఏ ఎక్స్ ఖాతాలో వెల్లడి

**న్యూఢిల్లీ,(ఎ.ఎం.ఎస్):** నీట్ యూజీ 2026 అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఒక అత్యంత ముఖ్యమైన ప్రకటన చేసింది. ఈ ఏడాదికి సంబంధించిన నీట్ యూజీ పరీక్ష ఫీజు రీఫండ్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ.. అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలకే నేరుగా నగదును బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది. అభ్యర్థులు అధికారిక పోర్టల్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగానే ఈ రీఫండ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. అయితే ఈ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా డబ్బులు ఖాతాల్లో పడాలంటే.. తమ బ్యాంక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. ఈ సమాచారాన్ని ఎన్‌టీఏ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా పంచుకుంది. అభ్యర్థులందరూ తాము అధికారిక పోర్టల్‌లో సమర్పించిన బ్యాంక్ ఖాతా లేదా రీఫండ్ వివరాలను ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే పొరపాటున తప్పుడు వివరాలు నమోదు చేసినా లేదా బ్యాంక్ వివరాలను అప్‌డేట్ చేయడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. అలాంటి వారికి పరీక్ష ముగిసిన తర్వాత తమ సరైన వివరాలను నమోదు చేసుకోవడానికి మరొక అదనపు అవకాశం కల్పిస్తామని పరీక్షల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. మరోవైపు నీట్ యూజీ పునఃపరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డ్‌లను ఎన్‌టీఏ జూన్ 14న అధికారికంగా విడుదల చేసింది. అయితే ఇక్కడే ఎన్‌టీఏ ఒక నిబంధనను పెట్టింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే ముందే.. రీఫండ్‌కు సంబంధించిన బ్యాంక్ వివరాలను వెరిఫై (ధ్రువీకరించుకోవడం) చేయడం తప్పనిసరి అని పేర్కొంది. అంతే కాకుండా బ్యాంక్ వివరాలు వెరిఫై చేసుకునే విధానాన్ని కూడా తెలిపింది. మొదట నీట్ అధికారిక వెబ్‌సైట్ neet.nta.nic.in ను సందర్శించాలి. ఆపై అభ్యర్థి అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి లాగిన్ అవ్వాలి. స్క్రీన్‌పై కనిపించే 'Bank Account Verification' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ మీ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఖాతాదారుడి పేరు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. వివరాలన్నీ కరెక్ట్‌గా ఉన్నాయని నిర్ధారించుకున్నాక.. 'Confirm and Save' పై క్లిక్ చేసి సబ్మిట్ చేయాలి. ఆ తర్వాతే అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ అవుతుంది. అడ్మిట్ కార్డ్స్ విడుదలై 24 గంటలు కూడా గడవక ముందే దాదాపు 4 లక్షల మందికి పైగా అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అయితే ఒకేసారి భారీ సంఖ్యలో అభ్యర్థులు వెబ్‌సైట్‌ను సందర్శించడంతో సర్వర్ డౌన్ అవ్వడం, సాంకేతిక లోపాలు తలెత్తడం వంటి సమస్యలు వస్తున్నట్లు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఎన్‌టీఏ సానుకూలంగా స్పందించింది. "అడ్మిట్ కార్డ్‌లను యాక్సెస్ చేయడంలో కొంతమంది అభ్యర్థులు సర్వర్ సమస్యలను ఎదుర్కొంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. మా సాంకేతిక బృందాలు ఈ లోపాలను సరి చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నాయి. త్వరలోనే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి" అని ఎన్‌టీఏ అభ్యర్థులకు భరోసా ఇచ్చింది.



## ట్రంప్‌నకు సైకోపాథిక్ లక్షణాలు

- వెల్లడించిన ఇరాన్ అధికారి
- అంతర్జాతీయంగా తీవ్ర చర్చ

**న్యూయార్క్, జూన్ 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో సైకోపాథిక్ లక్షణాలు ఉన్నట్లు తాము గమనించినట్లు ఇరాన్‌కి చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. ఈ విషయాన్ని డ్రాప్ సైట్ ప్రచురించడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఇస్లామాబాద్‌లో అమెరికా ఇరాన్ మొదటి దఫా చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాత ఇరాన్ ట్రంప్‌ను అంచనా వేసేందుకు ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను తాజాగా జరిగిన శాంతి చర్చల బృందంలో చేర్చినట్లు వెలువడిన వార్తలు ఆసక్తిరేపుతున్నాయి. శాంతి ఒప్పంద సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన పరోక్ష చర్చల్లో సైకాలజిస్టులను ఇరాన్ తీసుకొచ్చిందనే వార్తలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. డ్రాప్ సైట్ ప్రచురించిన కథనం ప్రకారం.. అమెరికా ఇరాన్ మధ్య ఉద్రికత్తలను తగ్గించే లక్ష్యంతో ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి. ఆ సమయంలో ట్రంప్ ప్రవర్తనను విశ్లేషించేందుకు ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను సంప్రదింపుల బృందానికి సలహాదారులుగా చేర్చుకుంది.

ఏప్రిల్‌లో ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఇరాన్ మధ్య తొలి దఫా చర్చలు జరిగాయి. ఆ సమయంలో ట్రంప్ వ్యవహరించిన తీరుతోనే రెండో దఫా చర్చలకు సైకాలజిస్టులను ఇరాన్ తీసుకురావాల్సి వచ్చింది. "ట్రంప్‌లో మేము సైకోపాథిక్ ప్రవర్తన లక్షణాలు ఉన్నాయని భావిస్తున్నాం. ఆ కోణంలోనే ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను సంప్రదింపుల బృందంలో చేర్చాం" అని పేర్కొన్నట్లు డ్రాప్ సైట్ నివేదిక పేర్కొంది. ఈ సైకాలజిస్టుల ప్రధాన పని ట్రంప్ ప్రవర్తనను విశ్లేషించడమే. ట్రంప్ ప్రవర్తనను విశ్లేషించి, ప్రాంతీయ మధ్యవర్తుల ద్వారా ఆయనకు చేరే సందేశాలను ఎలా రూపొందించాలి అనే దానిపై సూచనలు ఇవ్వడమే. సైకాలజిస్టుల సూచనలను లిఖితపూర్వకంగా సందేశాల్లో చేర్చిన తర్వాత ట్రంప్ స్పందనలో మార్పు కనిపించిందని ఆ అధికారి పేర్కొన్నట్లు నివేదిక వెల్లడించింది."మా సలహాదారుల సూచనలను సందేశాల్లో అమలు చేయడం ప్రారంభించిన తర్వాత ట్రంప్ ప్రతిస్పందనలు మరింత సానుకూలంగా మారాయి" అని ఓ అధికారి పేర్కొన్నట్లు తమ కథనంలో రాసుకొచ్చారు. ఇదే సమయంలో ట్రంప్ ఆరోగ్యంపై అమెరికాలో కూడా చర్చ జరుగుతోంది. వాషింగ్టన్ పోస్ట్ కథనం మేరకు.. ట్రంప్ తాజా వైద్య పరీక్షల్లో 22 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడి ఒకే వైద్య పరీక్షల్లో ఇంత పెద్ద సంఖ్యలో నిపుణులు పాల్గొనడం ఇదే తొలిసారి అని ఆ కథనం పేర్కొంది. ఇక అమెరికా ఇరాన్ మధ్య యుద్ధ భేరీ దాదాపు ముగిసినట్టే అని చెప్పొచ్చు. ట్రంప్ కూడా యుద్ధం ఆగిపోయిందని ప్రకటించారు. శాంతి ఒప్పందాలపై ఇరు దేశాలు జూన్ 19న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అధికారికంగా సంతకాలు చేయనున్నట్లు సమాచారం.

> ఇస్లామాబాద్‌లో అమెరికా - ఇరాన్ మొదటి దఫా చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాత ఇరాన్ ట్రంప్‌ను అంచనా వేసేందుకు ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను తాజాగా జరిగిన శాంతి చర్చల బృందంలో చేర్చినట్లు వెలువడిన వార్తలు ఆసక్తిరేపుతున్నాయి. శాంతి ఒప్పంద సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన పరోక్ష చర్చల్లో సైకాలజిస్టులను ఇరాన్ తీసుకొచ్చిందనే వార్తలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. లక్ష్యంతో ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి.





## టెలిగ్రామ్ యాప్‌పై 22 వరకు నిషేధం కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 16(ఎ.ఎం.ఎస్):** టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం తాత్కాలిక నిషేధం విధిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 22వ తేదీ వరకు బ్యాన్ వర్తిస్తుందని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21 నుంచి జరగనున్న నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే యాప్‌లో మెసేజ్ ఎడిట్ ఆప్షన్ జూన్ 30 వరకు డిసేబుల్ చేస్తున్నట్లు వెల్లడించింది.

## పబ్‌లో మంటలు



### మైసూర్‌లో ఇద్దరు కార్మికుల దుర్మరణం

**బెంగళూరు, జూన్ 16(ఎ.ఎం.ఎస్):** కర్నాటకలోని మైసూరు ఆర్‌టీనగరలో ఉన్న 'ఫాక్స్ జెన్ పబ్'లో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సాహిన్, ప్రకాశ్ అనే ఇద్దరు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి సరైన ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం, పైకప్పు రెల్లు గడ్డితో కప్పి ఉండటం, మద్యం సీసాలు పగిలి మంటలు వేగంగా వ్యాపించడం వంటి కారణాలతో ప్రమాద తీవ్రత పెరిగిందని అగ్నిమాపక దళ అధికారి రంగనాథ్ తెలిపారు.

## భారత్‌బంగ్లా మధ్య తీవ్ర వివాదం

- తారిఖ్ రెహమాన్ ను నిలిపేసిన ఢిల్లీ అధికారులు
- అత్యవసర సమన్లు జారీ చేసిన బంగ్లాదేశ్

**ఢాకా, జూన్ 16:** భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి తారిఖ్ రెహమాన్ అగ్రశ్రేణి సలహాదారు జహీద్ ఉర్ రెహమాన్‌ను ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత ఇమ్మిగ్రేషన్ అధికారులు కొన్ని గంటల పాటు నిలిపి వేసి, విచారించడం ఇరుదేశాల మధ్య తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ ఘటనపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ దేశ అగ్రనేతకు జరిగిన అవమానానికి గానూ తీవ్ర నిరసన తెలియజేస్తూ.. ఢాకాలోని భారత డిప్యూటీ హైకమిషనర్ పవన్ బాధేకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ అత్యవసర సమన్లు జారీ చేసి వివరణ కోరింది.

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఆధ్వర్యంలో జరగనున్న ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్ (ఐఓఆర్ఏ) సీనియర్ అధికారుల 28వ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు జహీద్ ఉర్ రెహమాన్ భారత్ ప్రభుత్వ అధికారిక ఆహ్వానంపై ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. అయితే ఇమ్మిగ్రేషన్ తనిఖీల సమయంలో రొటీన్ సెక్యూరిటీ అలర్ట్ కింద ఆయన పేరు రావడంతో.. అధికారులు ఆయనను పక్కకు పిలిచారు. బంగ్లాదేశ్ అధికారిక వార్తా సంస్థ బీ



ఎస్ఎస్ కథనం ప్రకారం.. దాదాపు రెండున్నర గంటల పాటు ఆయనను ఇమ్మిగ్రేషన్ విభాగంలోనే ఉంచి అధికారులు రకరకాల ప్రశ్నలు వేశారు.

జహీద్ ఉర్ రెహమాన్ సాధారణ బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్‌పై సార్క్ వీసాతో ప్రయాణిస్తున్నారని, ఆయన వద్ద దౌత్యపరమైన పాస్‌పోర్ట్ లేదని బంగ్లాదేశ్ మీడియా వెల్లడించింది. కాగా జహీద్ పొలిటికల్ కామెంటేటర్‌గా, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వానికి తీవ్ర విమర్శకుడిగా గుర్తింపు పొందారు. సుదీర్ఘ నిరీక్షణ, విచారణ అనంతరం భారత అధికారులు ఆయనకు దేశంలోకి ప్రవేశించడానికి అనుమతి ఇచ్చినప్పటికీ.. జరిగిన అవమానంతో నొచ్చుకున్న జహీద్ తన పర్యటనను రద్దు చేసుకుని తక్షణమే స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. ఈ ఘటనపై బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఖలీలూర్ రెహమాన్ స్పందిస్తూ.. ఇది ఎంతమాత్రం ఊహించని, అత్యంత దురదృష్టకరమైన సంఘటన అని అభివర్ణించారు. ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, దౌత్యపరంగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే భారత దౌత్యాధికారిని పిలిపించి ఢాకా తన తీవ్ర నిరాశ, అసంతృప్తిని అధికారికంగా వ్యక్తం చేసింది. అయితే ఈ మొత్తం వ్యవహారంపై న్యూఢిల్లీ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు.

2024లో బంగ్లాదేశ్‌లో చెలరేగిన ప్రజా తిరుగుబాటు కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం పతనమైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. హసీనా పతనం తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం స్థానంలో.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించడంతో సంబంధాలు తిరిగి మెరుగుపడతాయని అంతా భావించారు. కానీ గత కొద్ది రోజులుగా అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అక్రమ వలసదారులని పేర్కొంటూ భారత్ కొందరిని తిరిగి బంగ్లాదేశ్‌కు పంపించి వేయడంపై ఇరుదేశాల మధ్య ఇప్పటికే అంతర్గత ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇప్పుడు పీఎం సలహాదారుడి ఎయిర్‌పోర్ట్ ఘటన ఈ ఉద్రిక్తతలకు మరింత పెంచినట్లు అయింది.

## కేరళ మంత్రి నెత్తిమీద పాయసం

- ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సంలో ఘటన

**తిరువునంతపురం ,జూన్ 16(ఎ.ఎం.ఎస్):** కేరళలో సరికొత్తగా ప్రవేశ పెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం 'ప్రియదర్శిని' ప్రారంభోత్సవ వేళ ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి బిందు కృష్ణకు ఒక రద్దీగా ఉన్న బస్సు ప్రయాణంలో ఊహించని అనుభవం ఎదురైంది. పథకం ప్రారంభోత్సవంలో భాగంగా ఆమె బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో.. ప్రమాదవశాత్తూ ఆమె తలపై, దుస్తులపై పాయసం ఒలికిపోయింది. ఈ అనూహ్య ఘటనతో కాసేపు అక్కడ గందరగోళం నెలకొన్నప్పటికీ.. మంత్రి ఏమాత్రం అసహనంప్రదర్శించకుండా తన కార్యక్రమాన్ని అలాగే కొనసాగించడం విశేషం. కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ)





సాధారణ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించే ఈ 'ప్రియదర్శిని' పథకం ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి బిందు కృష్ణ స్వయంగా బస్సు ఎక్కి ప్రయాణించారు. కొత్త పథకం విజయవంతం కావడంపై మంత్రికి శుభాకాంక్షలు తెలపడానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,

మద్దతుదారులు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఆ బస్సులోకి దూసుకువచ్చారు. దీంతో బస్సు లోపల విపరీతమైన రద్దీ ఏర్పడింది.



## జీ-7 కీలక సదస్సు

- హాజరైన ట్రంప్, కీర్ స్టార్మర్
- ట్రంప్‌తో భేటీ కానున్న మోడీ

**పారిస్, జూన్ 16:** మంగళవారం ఫ్రాన్స్ అధ్యక్షతన జి7 సదస్సు జరగనుంది. ఈ శిఖరాగ్ర సమావేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్లు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశం జూన్ 15 17 వరకు జరగనుంది. ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లెస్ బైన్స్ అనే స్పా పట్టణంలో మంగళవారం పశ్చిమాసియా ఘర్షణలు, రష్యా - ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ చర్చల్లో ఈజిప్ట్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులు పాల్గొననున్నారు. ప్రధాని మోడీ కూడా ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎవియాన్ నగరానికి చేరుకున్నారు. ఈ జి7 సదస్సు సందర్భంగా మోడీ ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశం ఉంది.

## ఆ డీల్‌లో ఏముంది..? అందరి దృష్టీ దానిపైన్నే

- ..ఇరాన్‌లో కొన్ని ఆంక్షలు
- వాణిజ్య నౌకల ప్రయాణానికి అవకాశం

**టెహ్రాన్, జూన్ 16:** ప్రపంచ దేశాల ఇబ్బంది పెట్టిన అమెరికా ఇరాన్ యుద్ధం ఎట్టకేలకు ముగిసింది. యుద్ధం ముగిసిందనే వార్తలు రాగానే అందరికీ ఇప్పుడు హోర్ముజ్ జలసంధి ఎప్పుడు తిరిగి ప్రారంభం అవుతుందనే ప్రశ్నలు మొదలయ్యాయి. ట్రంప్ మాత్రం ఇప్పటి నుంచే వ్యాపారాలు చేసుకోవచ్చని ప్రకటించారు. కానీ, ఇరాన్ మాత్రం కొన్ని ఆంక్షలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. దాంతో పాటు నౌకల భద్రతలపై హామీ ఇచ్చాక మాత్రమే వాణిజ్య నౌకలు ప్రయాణం సాగించే అవకాశం ఉంది. అమెరికా ఇరాన్ మధ్య వంద రోజులుగా సాగుతున్న యుద్ధానికి ఎట్టకేలకు తెరపడింది. ఎన్నోసార్లు వాయిదా పడిన శాంతి ఒప్పందం మొత్తానికి కుదిరింది. ఫిబ్రవరి 28 నుంచి సాగుతున్న యుద్ధం ముగిసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. డీల్ ప్రకటన చేసే సమయంలో 'ప్రపంచ నౌకలారా.. మీ ఇంజిన్లు స్టార్ట్ చేయండి.. చమురును పారించండి' అంటూ పిలుపునిచ్చాడు. అయితే, హోర్ముజ్ జలసంధిలో అప్పటి లాగా నౌకల ప్రయాణం ఇప్పటికిప్పుడు సాధ్యమవుతుందా? అనేది పెద్ద ప్రశ్నగా



మారింది.

అమెరికా ఇరాన్ మధ్య తాజాగా కుదిరిన శాంతి ఒప్పందంలో అత్యంత కీలకమైనది హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడమే. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన మార్గం ఈ హోర్ముజ్ జలసంధి. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం, ఎక్కువ భాగం సహజ వాయువు ఎగుమతులు ఈ జలమార్గం ద్వారానే జరుగుతాయి. అమెరికా అధ్యక్షుడు ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి అనుమతి ఇచ్చారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది. హోర్ముజ్ జలసంధిని తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడానికి నేను పూర్తిగా అనుమతి ఇస్తున్నాను. ప్రపంచ నౌకలారా.. మీ ఇంజిన్లు స్టార్ట్ చేయండి.. చమురును పారించండి" అంటూ ట్రంప్ పిలుపునిచ్చారు. ఇక్కడ ట్రంప్ ప్రకటన చేసిన వెంటనే హోర్ముజ్ జలసంధి రవాణా వెంటనే ప్రారంభం అవుతుందా? అంటే కాదనే చెప్పాలి. అమెరికా ఆంక్షలు ఎత్తివేసినప్పటికీ.. ఇరాన్ ఇంకా కొన్ని పరిమితులు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధికారులు చెప్పిన దాని ప్రకారం.. ఇరాన్ జలసంధి పరిసరాల్లో సముద్ర మైన్‌లు ఏర్పాటు చేసినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అంటే ఈ హోర్ముజ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే ముందుగా ఇరాన్ ఏర్పాటు చేసిన మైన్‌లు తొలగించాలి. ఆ తర్వాత దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు తిరిగి మరమ్మతులు చేయాలి.. చివరగా నౌకల భద్రతలపై హామీలు రావాలి. ఆ తర్వాత మాత్రమే పూర్తి స్థాయిలో వాణిజ్య నౌకలు పునరుద్ధరించే అవకాశం ఉంటుంది.

## ఇండోనేషియాలో భూకంపం



- రిక్టర్ స్కేల్‌పై 6.7 తీవ్రత

**జకార్తా, జూన్ 16:** ఇండోనేసియాలో రిక్టర్ స్కేల్‌పై 6.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం కారణంగా భారీ నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు తెలుపుతున్నాయి. భూకంపం వల్ల భవనాలు కుప్పకూలి, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం ఎంత లోతులో సంభవించిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఓటు సామాన్యుడి వజ్రాయుధం:

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**చండూరు - మునుగోడు,జూన్ 16 (వుదయం):**

మునుగోడు నియోజకవర్గంలో ఓటు విలువ దేశవ్యాప్తంగా పెరిగిందని, ఇతర ప్రాంతాలలో ఓట్లు ఉన్నవారు సైతం మునుగోడులోనే తమ ఓటును ఉంచుకునేలా ఇక్కడొక ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ అయిందని మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఓటు అనేది సామాన్యుడి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన వజ్రాయుధమని ఆయన అభివర్ణించారు. ఈనెల 25 నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (S.I.R) ప్రక్రియను పురస్కరించుకుని.. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్ఏ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి జరగాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండటం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో బీఎల్ఏలు ఎవరూ కూడా బాధ్యతారాహిత్యంగా ఉండొద్దని, అర్హులైన ఒక్క ఓటు కూడా పోకుండా సీరియస్‌గా పనిచేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పీసీసీ నియమించిన మాస్టర్ ట్రైనర్ సుమాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బీఎల్ఏలకు క్షేత్రస్థాయి విధులను వివరించారు. నియోజకవర్గంలో మ్యాపింగ్ అయిన ఓటర్లు, అన్-మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలు, అర్హులైన వారి ఓట్లు తొలగించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కొత్త ఓటర్ల నమోదు, ఇతర ప్రాంతాల నుంచి ఓట్ల బదిలీ వంటి అంశాలపై బీఎల్ఏలు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐసీసీ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గవ్యాప్తంగా అన్-మ్యాపింగ్ ఓట్లతో కలుపుకుని మార్పులు, చేర్పులు, తప్పులు ఉన్న ఓటర్ల సంఖ్య దాదాపు 91 వేల వరకు ఉందని వెల్లడించారు. ఈ విషయాన్ని బీఎల్ఏలు అత్యంత సీరియస్‌గా తీసుకుని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఈ విస్తృతత స్థాయి శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న బీఎల్ఏలతో పాటు స్థానిక చండూరు మున్సిపాలిటీల చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు , మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో జిల్లా ముందంజ: మంత్రి సీతక్క

**పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం**

**ప్రతిభావంతులైన విద్యార్థులకు కలెక్టరేట్‌లో 50 సైకిళ్ల పంపిణీ**



**ములుగు, జూన్ 16 (వుదయం ప్రతినిధి):**

వెనుకబడిన, అటవీ ప్రాంత జిల్లాగా పేరుగాంచిన ములుగు జిల్లా నేడు విద్యా రంగంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో టెన్త్, ఇంటర్మీడియట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి 50 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి వల్ల ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానం, ఇంటర్ ఫలితాల్లో రెండో స్థానం సాధించడం గర్వకారణమన్నారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని, స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. 'అమ్మకు అక్షరమాల'తో మహిళా చైతన్యం:రాష్ట్రంలో నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం అద్భుత ఫలితాలిస్తోందని మంత్రి పేర్కొన్నారు. చదువురాని 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులను గుర్తించి, మొదటి విడతగా 6 లక్షల మందికి పరీక్షలు నిర్వహించగా 83.33 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. భవిష్యత్తులో వీరిని పదో తరగతి పరీక్షలకు సైతం సిద్ధం చేస్తామన్నారు.జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. విద్యార్థులకు అండగా నిలిచిన రోటరీ క్లబ్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, డీఐఈఓ వీరేంద్ర కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో సహజ విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి..

### వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్ జిల్లా వుదయ ప్రతినిధి జూన్ 16**

వర్షాకాలంలో సంభవించే సహజ విపత్తులు, వరదల నివారణకు సంబంధించి అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తం గా ఉండాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గృహాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావును సూచించారు. గ్రామాలలో నాలుగు రకాల చెత్తలను సేకరించుటలో ఏదో ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి గ్రామాలలో నాలుగు రకాల చెత్త సేకరణ చేపట్టాలని అన్నారు. ఎలక్ట్రికల్ శాఖ ఆధ్వర్యంలో రానున్న ప్రకృతి వైపరీత్యాల వలన ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎలక్ట్రిసిని ఎస్సీ ఆనందం కు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి

### జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

**నల్గొండ, జూన్ 16**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా రేషన్ షాపుల్లో 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ)కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రజల ఆహార భద్రతకు ప్రజా పంపిణీ వ్యవస్థ కీలకమని పేర్కొన్నారు.రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు పప్పులు,




వంటనూనె, చక్కెర, ఉప్పు, గోధుమలు, సజ్జలు, జొన్నలు, రాగులు, కందిపప్పు, మినపప్పు, శనగపప్పు, కారం పొడి, పసుపు తదితర మొత్తం 14 రకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా పరిమిత సరుకులు మాత్రమే అందుతుండటంతో పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్ది, ప్రతి అర్హ కుటుంబానికి నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రేషన్ షాపులను ప్రజలకు మరింత ఉపయోగకరంగా మార్చేందుకు 14 రకాల నిత్యావసర వస్తువుల సరఫరాను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మహిళలు, పేద కుటుంబాల జీవన వ్యయం రోజురోజుకు పెరుగుతోందని, రేషన్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు.ఈ ధర్నాలో మహిళా సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువుల సరఫరాను అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిట్ట సరోజ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జిల్లా సహాయ కార్యదర్శులు చానబోయిన నాగమణి, ఎస్కే సుల్తానా, నాయకులు కారంపొడి ధనలక్ష్మి , గోలి వెంకటమ్మ, భావురోజు ఇందిరా, కౌసల్య, ఫాతిమా, సైదమ్మ, భాగ్య, అలివేలు, శశికళ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి... జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

**బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి**

**నాణ్యమైన బోధనతో విద్యార్థులు డ్రాపౌట్స్ లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి**

**సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం వుదయం బ్యూరో సింగరేణి, జూన్ - 16 :**

పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.మంగళవారం సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ప్రక్రియను సమీక్షించి, ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాల వయస్సు గల ప్రతి



చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయాలని తెలిపారు. ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అన్నారు.పాఠశాల వంటగది, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సేవల అమలుపై ఆరా తీశారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, పిల్లలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో అవసరమని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సింగరేణి మండల తహసీల్దారు వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 16 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించినభూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, భూసేకరణ శాఖల అధికారులతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ,పెండింగ్ అనుమతులు, సమస్య లపై పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలాల వారీగా భూసేకరణ పురోగతి, భూ సర్వే పనులు, వివిధ ప్యాకేజీల




వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలు, కోర్టు కేసులు, అనుమతుల స్థితిగతులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమగ్రంగా చర్చించి, పనులు వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.భూ సర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూసేకరణకు సంబంధించిన పెండింగ్ కోర్టు కేసులు, వివిధ అనుమతుల అంశాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, భూసేకరణ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల అమలుకు అవసరమైన భూమి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రాజెక్టుల పురోగతి జిల్లాలో అభివృద్ధికి కీలకమని, అందుకే ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, డి ఆర్ ఓ పద్మావతి, ఆర్ డి ఓమధు,సంబంధిత మండలాల తాసిల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, భూ సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తహసిల్దార్లు, సూపర్వైజర్లు, టెక్నికల్ సిబ్బందితో శిక్షణ కార్యక్రమం

**సూర్యాపేట జూన్: 16వుదయం ప్రతినిధి**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు మరియు నకిలీ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా దాదాపు 24 సంవత్సరాల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, నెల రోజుల పాటు నిర్వహించే ఓటరు ప్రత్యేక సవరణ డ్రైవ్‌కు సంబంధించిన విధి విధానాలను వివరించారు. జూన్ 25 నుండి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై, జూలై 24 వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి 'హౌస్ టు హౌస్' సర్వే నిర్వహిస్తారని ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను అందిస్తా




రని వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షేత్రస్థాయిలోనే 'బిఎల్ఓ యాప్' ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు.ఈ సర్వేలో ప్రధానంగా 2002 నాటికి ఓటరుగా నమోదై,ప్రస్తుతం ఉన్న వారి వివరాలను ధృవీకరిస్తారని, ఒకవేళ 2025 నాటికి ఓటరు జాబితాలో పేరు లేకపోతే, వారిని తల్లి లేదా తండ్రి వివరాలతో మ్యాపింగ్ చేస్తారని స్పష్టం చేశారు. ఓటరు పేరు, తండ్రి పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఈ సవరణల ప్రకారం వాటిని సరిచేస్తారన్నారు. చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తారని, నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సరైన సమాధానం లేదా ఆధారాలు ఇవ్వకపోతే ఓటును తొలగిస్తారని చెప్పారు. తుది డ్రాఫ్ట్ జాబితాలో పేరు నమోదైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామని, ఇందులో ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత ఆర్డీఓలు నోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి లేదా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చిన వారు తమ అడ్రస్ మార్చుకోవడానికి ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డులను ఆధారాలుగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటించే నాటికి ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితా తయారీకి బిఎల్ఓలు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవోలు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ వేణు మాధవ రావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ వి రమేష్, పి వెంకటేశ్వర్లు తహసీల్దార్లు ఏఎల్ఎంటి లు సూపర్వైజర్లు, టెక్నికల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

**మర్కజి ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**విద్యార్థులతో మమేకమై విద్యాభ్యాసం, వేసవి సెలవుల అనుభవాలపై ఆరా**



**హనుమకొండ, జూన్ 16 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. పాఠశాలలో విద్యా బోధన, హాజరు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) విధానంలో హాజరు నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు.పూర్వ ప్రాథమిక తరగతిని సందర్శించిన కలెక్టర్, చిన్నారులు ఏమి నేర్చుకుంటున్నారో తెలుసుకున్నారు.
రాగి జావా తీసుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కున్నారా అని అడిగారు. .అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వేసవి సెలవులను ఎలా గడిపారు, ఏవైనా క్రీడలను అభ్యసించారా అని ప్రశ్నించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమైన తర్వాత ఎలా అనిపిస్తోందని విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.పాఠశాలలో విద్యా బోధనకు ఉపయోగించే పాఠ్య సామగ్రిని జాగ్రత్తగా సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఖాన్ అకాడమీ పాఠాలను క్రమం తప్పకుండా వినాలని, వాటిని విద్యాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలలో నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్ పనుల పురోగతిని సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విజయవంతం చేయాలి:

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, జూన్ 16 (వుదయం ప్రతినిధి) :**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవల్ అధికారుల (BLO) పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు, బీఎల్ఓలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 25 నుంచి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. మరణించిన వారిని, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని, డూప్లికేట్ ఓట్లను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు.కీలకమైన షెడ్యూల్ వివరాలు:జూన్ 25 – జూలై 24 బీఎల్ఓల ద్వారా ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ.జూలై 31 ముసాయిదా (Draft) ఓటర్ల జాబితా ప్రదర్శన.జూలై 31 – ఆగస్టు 30 ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సవరణలు, తొలగింపులకు దరఖాస్తుల స్వీకరణ.అక్టోబర్ 1, 2026 ఓటర్ల తుది జాబితా ప్రకటన.కలెక్టర్ ఆదేశాలు "ఎన్నికల సంఘం జారీ చేసిన డిక్లరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు అందజేసి, అక్నాలెడ్జ్‌మెంట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకూడదు. బీఎల్ఓ యాప్‌పై పూర్తి అవగాహనతో, ఎలాంటి తప్పులు లేకుండా ప్రక్రియను పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి."అంతకుముందు మాస్టర్ ట్రైనర్లు (రఘునాథపల్లి, చిల్పూర్ తహసీల్దార్లు) ఎన్యూమరేషన్ దశలు, బీఎల్ఓ యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు 'ఎస్ఐఆర్' గోడ పత్రికలను ఆవిష్కరించి, ఏఈఆర్ఓలకు మెటీరియల్ బ్యాగులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓలు గోపిరాం, కిరణ్ ప్రకాష్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, అన్ని మండలాల తహసీల్దార్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలు,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం



**మహబూబాబాద్, వుదయం ప్రతినిధి,జూన్ 16**

మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అభివృద్ధి,వానాకాలం సీజన్, సంక్షేమ పథకాల అమలు,జిల్లా ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు.వానాకాల వ్యవసాయ సన్నాహక మరియు అభివృద్ధి పథకాలు తదితరాంశాలు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నేడు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ వానాకాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల స్టాక్, సరఫరా, నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.చెరువులు, కాలువలు, మిషన్ కాకతీయ పనుల పురోగతి.చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు వాతావరణ సమాచారం, సాగు సలహాలు ఎస్ఎంఎస్,వాట్సాప్ ద్వారా పంపే ఏర్పాట్లు చేయాలని అన్నారు.మండల స్థాయి రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించి అధిక లాభాలు కలిగిన పంటలు పండించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి పనులు, కొత్త మెడికల్ కాలేజీ నిర్మాణం, ఓపి విభాగాల పనితీరుపై వైద్య ఆరోగ్య శాఖ పై వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రుల్లో కొత్త వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల పనుల పురోగతి పరిశీలన. నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉన్న కొత్త మెడికల్ కాలేజీ భవనాలు, హాస్టళ్లు, ల్యాబ్‌ల పనులను వచ్చే అకడమిక్ ఇయర్‌లోగా పనులు పూర్తి చేయాలని అన్నారు. ఔట్‌పేషెంట్ విభాగాల్లో రోగులకు వేచి ఉండే సమయం తగ్గించడం, డాక్టర్ల హాజరు, మందుల స్టాక్‌పై చర్చ.

# ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ కల సాకారం

**భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం: జిల్లా కలెక్టర్**

**డిఫెన్స్‌కు 1,500 ఎకరాలు..**

**రన్‌వే విస్తరణకు మరో 80 ఎకరాలు**

**ఎంపీ, ఎమ్మెల్యే, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష**



**ఆదిలాబాద్, వుదయం :**

ఆదిలాబాద్ జాయింట్ యూజర్ (డిఫెన్స్-సివిల్) ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బెంగళూరుకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన, మైక్రో లెవెల్ సర్వే నిర్వహించి, రన్‌వే విస్తరణతో పాటు సాంకేతిక అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అదనంగా డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) కోసం 1,500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందని వివరించారు.జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేసిన కలెక్టర్, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీకి భూములను అప్పగిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు సివిల్ ఏవియేషన్‌తో పాటు డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావడం ప్రజలకు ఒక చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు. ఢిల్లీ స్థాయిలో ఇప్పటికే చర్చలు: ఎంపీ గోడం నగేష్ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన లొకేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించామని, మే 15న కేంద్ర ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. రక్షణ శాఖ కోరిన 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లా అధికారులతో కలిసి మ్యాప్‌ల ఆధారంగా మైక్రో లెవెల్ సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు వేగవంతానికి నేటి సమావేశం కీలక ముందడుగు అని పేర్కొన్నారు. దశాబ్దాలకల నెరవేరబోతోంది: ఎమ్మెల్యే పాయల శంకర్జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణపై నేటి సమావేశంతో స్పష్టత వచ్చిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి మొత్తం 1,840 ఎకరాలు అవసరమవుతాయని, ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. ఇప్పటికే 360 ఎకరాలు రక్షణ శాఖ పరిధిలో ఉండగా, రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు. గతంలో జారీ చేసిన 700 ఎకరాల జీవో ప్రకారం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 800 ఎకరాల అనుమతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చెప్పారు. తదుపరి విధానపరమైన నిర్ణయాల కోసం త్వరలో ఎంపీ నేతృత్వంలో ఢిల్లీలో ఉమ్మడి సమావేశం జరగనుందని, ఇందులో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్‌లతో చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఆదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోందని, జిల్లా అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకోనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు జేపీ సబర్వాల్, ఎస్.జి. హెగ్డే, ఎస్.కె. రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 30లోపు అందుబాటులో ఉన్న నరేగా నిధులు పూర్తిగా వినియోగించాలి : జిల్లా కలెక్టర్

**ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రణాళిక చేసిన అన్ని పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలి**

**సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి**

**జిల్లాకు కేటాయించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలి**

**పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, జూన్-16 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న నిధులను జూన్ 30 లోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాకు ప్రస్తుతం ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.19 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధులను జూన్ 30 లోపు పూర్తిగా ఖర్చు చేయడం లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రణాళిక చేసిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు అవసరమైన కొత్త పనులను కూడా వెంటనే ప్రారంభించాలనిఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, కల్వర్టులు తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు.జిల్లాకు కేటాయించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించి, నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఎంఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టే పనులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి పనిని లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసి నిధుల వినియోగంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య , డి.ఈ.లు, ఏఈ లు,ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను వంద శాతం సాధించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాదు, వుదయం :**

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టి, వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల సంయుక్త కృషితో 2026-27 సంవత్సరానికి నిర్దేశించుకున్న సాగు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపు, రైతు వేదికల ద్వారా ఎరువుల పంపిణీ ఏర్పాట్లపై ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సంయుక్త సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అత్యంత లాభదాయకమైన పంట అని, దీనిపై ఉద్యానవన శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ ఏడాది ఏమాత్రం అలసత్వం వహించకుండా మండల వ్యవసాయ అధికారుల వారీగా ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించి పర్యవేక్షించాలన్నారు. నీటి వసతి ఉండి ఆసక్తి చూపే రైతులను గుర్తించి, వారి దరఖాస్తులను స్వీకరించి ఉద్యానవన శాఖకు సమర్పించాలని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలు, నాణ్యమైన ఆయిల్ పామ్ మెటీరియల్స్ సకాలంలో అందేలా చూడాలని ప్రియునిక్ ఇండియా ప్రతినిధులను, అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని సొసైటీలు, పిఏసిఎస్ కేంద్రాల ద్వారా రైతు వేదికలలో యూరియా, ఇతర ఎరువులను పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాబోయే వారం లేదా పక్షం రోజుల్లోగా మారుమూల ప్రాంతాల రైతులకు సైతం సకాలంలో ఎరువులు అందేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సొసైటీల ద్వారా సాగుతున్న సరఫరాలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా, సమయానికే ఎరువుల కేటాయింపులను తీసుకుని డిజిటల్ యాప్ ద్వారా రైతులకు విజయవంతంగా అందించాలన్నారు. ఎరువుల ఇండెంట్, ప్లేస్‌మెంట్ లేదా డిస్ట్రిబ్యూషన్‌లో ఎలాంటి లోపాలు తలెత్తినా, రైతులకు ఇబ్బంది కలిగించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫార్మర్ రిజిస్ట్రీ'లో జిల్లాలోని ప్రతి రైతు వివరాలను ఎలాంటి తప్పుల్లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో సోయాబీన్, పత్తి విత్తనాలు రైతుల అవసరాలకు సరిపడా విరివిగా అందుబాటులో ఉన్నాయని, విత్తన పంపిణీ సజావుగా సాగాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సోయాబీన్, కంది వంటి ప్రత్యామ్నాయ పంటలపై సైతం రైతులు దృష్టి సారించేలా చూడాలని, అందుకు అవసరమైన విత్తన ప్రణాళికలను ముందే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

# జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా 16 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యానికి మించి ఉద్యానవన పంటలను రైతులు సాగు చేసేలా అధికారులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం వల్ల రైతులు లాభాలు పొందగలుగుతారని వివరించారు. ప్రస్తుతం విపణిలో ఉద్యానవన పంటలకు డిమాండ్ ఉన్నదని, దీనికి అనుగుణంగా రైతులు ఉద్యానవన పంటల సాగు వైపు మల్లాలని సూచించారు. తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలు కలుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తదనుగుణంగా రైతులకు క్షేత్రస్థాయిలో ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "రైతులకు విరివిగా పంట రుణాలు ఇవ్వాలి":

**బ్యాంకర్లను కోరిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**




**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్‌బాబు గారు మాట్లాడుతూ రైతులకు విరివిగా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. గిరిజనులకు ట్రైకార్ లోన్లు, ఎస్సీ కార్పొరేషన్ లోన్ల విషయంలో పట్టువిడుపులకు అవకాశం ఇవ్వాలని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కోసం పీఎంఈజీపి, పీఎం స్వనిధి మరియు పీఎం ముద్ర లోన్లను ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్, జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్ జూన్ 16 (వుదయం ప్రతినిధి):**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రత నడుమ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య , ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి పరీక్షకు 15 నిమిషాలు ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అభ్యర్థులు పాస్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆభరణాలు, షూలు ధరించి రావద్దని.. నిబంధనలు విధిగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను పరీక్ష కేంద్రం వద్ద మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షకు రెండు రోజుల ముందే అధికారులు.. పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు బృందంగా ఏర్పడి పరీక్ష నిర్వహణను విజయవంతం చేయాలన్నారు.

# స్టాప్ డైయేరియా కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి

**ఆరోగ్యమహిళా కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో డా.జి.అంజెల అల్ఫ్రెడ్**



**రాజన్న సిరిసిల్ల, జూన్ 16 వుదయం :**

జిల్లాలో జూన్ 16 నుంచి జూలై 31, 2026 వరకు నిర్వహించనున్న "స్టాప్ డైయేరియా" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ జి. అంజెల అల్ఫ్రెడ్ ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన పర్యటనలో భాగంగా ఆమె యూపీహెచ్‌సీ పీఎస్ నగర్, పీహెచ్‌సీ చీర్లవంచ, బస్తీ దవాఖానా రాజీవ్ నగర్ కేంద్రాలను సందర్శించి ఆరోగ్య మహిళా కార్యక్రమం అమలును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు తగినంత నిల్వలో ఉంచాలని సూచించారు. ముఖ్యంగా కష్టతరమైన ప్రాంతాల్లోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, డైయేరియా నివారణ చర్యలు, పరిశుభ్రత, ఓఆర్ ఎస్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

# విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల/జూన్ 16 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలో విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల-కళాశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన అనంతరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్రం భవన నిర్మాణా న్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలో వి.ఓ. భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి ప్రభుత్వ భూముల ఆక్రమణపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమీక్షించారు. మండలంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించి పను లు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కామారెడ్డి, జూన్ 16 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మంగళవారం భిక్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పని తీరును పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై రోల్ కాల్ ప్రాముఖ్యతను వివరించి, వారు నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన ఆర్థిక నేరాలు, దొంగతనాలు, ఇతర కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు పగలు, రాత్రి గస్తీని పెంచాలని సూచించారు. తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీలు నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, కేడీలు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భిక్నూర్ ఎస్‌హెచ్‌వోకు సూచించారు. గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో మమేకమవుతూ పోలీసులపై విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు.సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, వృత్తి నైపుణ్యంతో పని చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..

**మెట్ పెల్లి తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ..జిల్లా కలెక్టర్**



**మెట్ పల్లి జూన్ 16 (వుదయం విలేకరి )**

జగిత్యాల జిల్లా మెట్ పెల్లి మండల తహసిల్దార్ కార్యాలయంను మంగళవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు ఓటరు జాబితా సవరణ సాధాబైనామకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు ఎస్ఐఆర్ లో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించాలని తెలిపారు నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు తహసీల్దార్ నీత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్య మిత్రుని కుమారునికి ఆర్థిక సహాయం



**ధర్మపురి జూన్ 16(వుదయం ప్రతినిధి):**

అంతుచిక్కని వ్యాధితో బాధపడుతు న్న బాల్య మిత్రుని కుమా రుడి వైద్య ఖర్చుల నిమిత్తం సహపాఠశాల మిత్రు లు తమ ఉదారతను చాటుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత విద్యార్థుల బృందం మానవతా దృక్ప థంతో స్పందించింది.తమ బాల్య మిత్రు డు రాంపల్లి రమేష్ కుమారుడు రాజా రం కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాజారం చికిత్స ఖర్చుల నిమిత్తం మిత్రులంతా కలిసి తమ వంతు సహాయంగా రూ.9వేలు నగదును బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ ఆపత్కాలంలో స్పందించి,తమ మిత్రుని కుటుంబానికి అండగా నిలిచేందుకు ఆర్థిక సహాయం అందజేసిన బాల్య మిత్రులందరికీ రాజారం పాఠశాల మిత్రుల బృందం సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లా విద్యాధికారికి సన్మానం



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయలసంఘం. ఆధ్వర్యంలో నూతన కొమురం భీం జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ సచ్చిదానంద చారి ని తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు పర్ష చంద్ర శేఖర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలు ప్రధానోపాధ్యాయుల సమస్యలను డిఇఓ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఏ ఓ జాడిదేవాజీ, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు మధుకర్, శివ చరణ్ ,ఎస్ వెంకట్రాజయ్య ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్



- బాధిత కుటుంబాలకు CMRF చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి
- ప్రభుత్వ పథకాలు పేదల భరోసా - క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉద్ఘాటన

నాగర్ కర్నూల్, జూన్ 16 (వుదయం ప్రతినిధి)

"అనారోగ్యం, ఆపద వస్తే పేదలు అప్పులపాలు కాకూడదు. ప్రభుత్వమే వారికి అండగా నిలవాలి" అని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్‌కర్నూల్ పట్టణ, మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కష్టకాలంలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి లక్ష్యం. ఆస్పత్రి ఖర్చుల భారంతో కుంగిపోయిన కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఒక సంజీవని. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వివరించాలని సూచించారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. "ఆస్పత్రిలో లక్షల బిల్లు కట్టలేక దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకు ఎమ్మెల్యే,సీఎం దేవుడిలా ఆదుకున్నారు" అంటూ ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు , మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజ్ కుమార్ రెడ్డి డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాధవ్ రెడ్డి,డిసిసి కార్యదర్శి కొత్త శ్రీనివాసులు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, స్థానిక కౌన్సిలర్లు కూచకుల సింధు, నిజాముద్దీన్, సర్పంచులు, మండల, పట్టణ, గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన, మహిళా నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ప్రాజెక్టు అసోసియేట్ అవకాశం

- పరిశోధనా ప్రాజెక్టు కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రధాన పరిశోధకురాలు

పటాన్చెరు (వుదయం):



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ సైన్స్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) వారి అడ్వాన్స్డ్ రీసెర్చ్ గ్రాంట్ (ఏఆర్జీ) పథకం ద్వారా నిధులు సమకూర్చే ఒక ప్రతిష్టాత్మక పరిశోధన ప్రాజెక్టు కింద ప్రాజెక్ట్ అసోసియేట్ పదవికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.'టమాటా మొక్కల వ్యాధికారకాలను ఎదుర్కోవడానికి నియంత్రిత శిలీంధ్రనాశక పంపిణీ కొరకు ప్రేరకప్రతిస్పందన జీవఅనుకరణ సిలికాచిటోసాన్ నానో వాహకాలు' అనే శీర్షికతో ఈ పరిశోధన ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. అధునాతన నానోటెక్నాలజీ ఆధారిత పరిష్కారాల ద్వారా మొక్కల వ్యాధుల నిర్వహణ కోసం వినూత్నమైన, సుస్థిరమైన పద్ధతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలియజేశారు. ఈ పరిశోధన ప్రాజెక్టు గీతం హైదరాబాదు ప్రాంగణంలో, ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ టి.స్వరూప రాణి, సహప్రధాన పరిశోధకురాలు డాక్టర్ గౌసియా బేగం పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, వ్యవసాయ శాస్త్రాలు, బయోకెమిస్ట్రీ, నానోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ లేదా సంబంధిత విభాగాలలో ఎమ్మెస్సీ డిగ్రీ ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. మొక్కల శిలీంధ్ర వ్యాధికారకాలను నిర్వహించడం, నానోమెటీరియల్ సంశ్లేషణ, లక్షణాల నిర్ధారణ, గ్రీన్ హౌస్ ప్రయోగాలు, మాలిక్యులర్ బయాలజీ టెక్నిక్‌లలో అనుభవం ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ఈ నియామకం ప్రారంభంలో ఒక ఏడాదికి ఉంటుందని, సంతృప్తికరమైన పనితీరు,ప్రాజెక్టు అవసరాలకు లోబడి, గరిష్ఠంగా మూడేళ్ల వరకు పొడిగించబడుతుందని స్పష్టీకరించారు. ఎంపికైన అభ్యర్థికి, తొలి ఏడాది నెలకు 30 వేల రూపాయల ఫెలోషిప్ తో పాటు ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) లభిస్తుందన్నారు.సిలికా చిటోసాన్ ఆధారిత నానో క్యారియర్ల అభివృద్ధి, లక్షణాల నిర్ధారణ, శిలీంధ్రనాశక ఫార్ములేషన్ అధ్యయనాలు, శిలీంధ్రనాశక సామర్థ్య మదింపు, వ్యాధికారక సంబంధిత పరిశోధనలు, వ్యాధి నియంత్రణ వ్యూహాల గ్రీన్ హౌస్ మూల్యాంకనంలో ప్రాజెక్టు అసోసియేట్ చురుకుగా పాల్గొనాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఆసక్తిగల అభ్యర్థులు ఇటీవలి బయోటా, వారి పరిశోధనా ఆసక్తులు, సంబంధిత అనుభవాన్ని వివరిస్తూ ఒక సంక్షిప్త లేఖతో పాటు విద్యా సర్టిఫికెట్ల నకళ్లను డాక్టర్ స్వరూప రాణి ఈమెయిల్ stirupaa@gitam.eduకు, ఈనెల 22వ తేదీలోగా పంపాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా తెలియజేసి, ఆన్ లైన్ ఇంటర్వ్యూకు పిలుస్తారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ప్రధాన పరిశోధకురాలిని సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం..



మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి

నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గుజ్జ నరసయ్య, ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కేజీల బియ్యం రూ.5వేల రూపాయలఆర్థిక సాయాన్ని అందించడం జరిగింది .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,పట్టణ అధ్యక్షుడు కొమ్మట బాబు, సీనియర్ నాయకులు నసీరుద్దీన్,వై వెంకటేశం, మాజీ సర్పంచ్ కొమ్మట సత్యనారాయణ, పంజా మహేందర్, పంజా బాబు, రాజిరెడ్డి,సుధాకర్,సురేష్ నాయక్,గుజ్జ నవీన్, బాలకృష్ణ, లు ఉన్నారు.

## ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి



- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట జూన్16 (వుదయం ప్రతినిధి)

విద్యార్థులు ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలం లోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు వచ్చానని, ఈ పాఠశాల వచ్చే సంవత్సరం పదో తరగతి లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలన్నారు. ఈ జిల్లా నుంచి గతంలో బాసర త్రిపుల్ ఐ టి కి ఎంపిక అయ్యారని ఆమె గుర్తు చేశారు. జాజాపూర్ పాఠశాల నుంచి కూడా త్రిపుల్ ఐ టి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇష్టంతో చదవాలన్నారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలకాలన్నారు. లెక్కలను సులువుగా ఎలా చేయాలో విద్యార్థులకు ఆమె ప్రాక్టికల్ గా చేసి చూపించారు. విద్యార్థులకు పదో తరగతే పునాది లాంటిది అన్నారు. రాబోయే పదేళ్ల లో మీరు ఎలా ఉండాలో నోట్ బుక్ లో రాసుకుని, రోజూ దానిని చూస్తూ, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సాధన చేయాలని సలహా ఇచ్చారు. పదో తరగతిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్రం కావాలన్నారు. వచ్చే సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో టాపర్ గా నిలిచిన వారికి తన తరపున ప్రత్యేక బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వచ్చే సంవత్సరం టాపర్ ను తప్పని సరిగా తన వద్దకు తీసుకు రావాలని హెచ్ ఎం కు సూచించారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రయోగ శాల, గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్ జాజాపూర్ అంగన్ వాడిలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో చేరిన (అంగన్ వాడీ)చిన్నారులకు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతీ మాత చిత్రపటానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజు, మండల విద్యా శాఖ అధికారి బాలాజీ, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలులో జోగులాంబ గద్వాల జిల్లా ముందంజ

- నిరంతర పర్యవేక్షణతో కొనుగోలు ప్రక్రియ విజయవంతం
- వంద శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 16 (వుదయం కరస్పాండెంట్)



జోగులాంబ గద్వాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు, వంద శాతం కొనుగోలుతో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికార యంత్రాంగం ఆయా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేశామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 76 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రబీ సీజన్లో జిల్లావ్యాప్తంగా దొడ్డు రకం వరి 731 హెక్టార్లలో సాగు చేయగా 5487 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. అలాగే సన్నరకం వరి 30,576 హెక్టార్లలో రైతులు సాగు చేయగా 2,29,323 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు చెప్పారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు మొత్తం రూ.121.18 కోట్ల విలువైన 50,725 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని చెప్పారు. రైతులకు ఇప్పటికే ఈ డబ్బులను చెల్లించడం జరిగిందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ లు, తేమ కొలిచే మీటర్స్, ఎలక్ట్రానిక్ తూకాలు, ప్యాడి క్లీనర్స్, తదితర కొరత లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. తరగు, తాలు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరించకుండా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యమును కూడా కొనుగోలు చేశామని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు విషయంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి విషయాన్ని తెలుసుకుని, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేసిన సంబంధిత అధికార యంత్రాంగానికి, సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి



వనపర్తి జూన్ 16 (వుదయం ప్రతినిధి)

విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరుగుతున్న నూతన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పంపిణీ చేయుటకు అందిన కొత్త పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేసి, కొందరు విద్యార్థులకు స్వయంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాలపై కలెక్టర్ ఆరా తీయగా, ప్రస్తుతం 702 మంది విద్యార్థులు ఉన్నారని, నిన్న పాఠశాల పునః ప్రారంభం కాగా ఇప్పటివరకు 65 మంది విద్యార్థులు కొత్తగా చేరారని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటుతుందని భావిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, ఈ విద్యా సంవత్సరంలో ఈ సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రవేశ సమయంలోనే అపార్ (APAAR) ఐడీలను రూపొందించాలని, యూడైస్ (UDISE) పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను సకాలంలో నమోదు చేసి నవీకరించాలని సూచించారు. పాఠశాలలకు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు లేదా ఇతర మౌలిక వసతులు అవసరమైతే జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వాటికి అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే విద్యార్థుల డ్రాప్‌బాక్స్‌లో ఎలాంటి పెండింగ్ అంశాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో, ఇంచార్జ్ డిఇఓ యాదయ్య, ప్రిన్సిపల్స్ ఉమాదేవి, చంద్రశేఖర్, ఇతర విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ జూన్16 (వుదయం ప్రతినిధి)



జిల్లాలో చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు, వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బూత్ లెవల్ సూపర్వైజర్లు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు , ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు తప్పులు లేని స్పష్టమైన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని అన్నారు. నకిలీ ఓటర్లు, మరణించిన వ్యక్తుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సవరించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ, కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి పౌరుని ఓటు హక్కును పరిరక్షించేందుకు ఈ ప్రక్రియ అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఓటర్ల ధృవీకరణ, మ్యాపింగ్ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పు నమోదులు, అనవసర తొలగింపులు జరగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలను ధృవీకరించిన తర్వాతే జాబితాలో మార్పులు చేయాలని ఆదేశించారు.జిల్లా స్థాయిలో ఈ ఆర్ ఓ లు, నియోజకవర్గ స్థాయిలో ఏ ఈ ఆర్ ఓ లు, సమర్థవంతంగా పనిచేయాలని, ఈపీఐసీ డిప్యూటీ తహసీల్దార్లు కూడా అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. బి ఎల్ ఓ సూపర్వైజర్లు, ఏ సి ఎల్ ఎం టిలు శిక్షణలో అందించిన సూచనలు, మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని మండల స్థాయిలో బి ఎల్ ఓ లకు నిర్వహించే శిక్షణలో ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా వివరించాలని ఆదేశించారు.ఎన్నికల విధులు సాధారణ ప్రభుత్వ పనులు కాదని, అత్యంత ప్రాధాన్యమైన బాధ్యతగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ విషయాన్ని ట్రైనర్లు బి ఎల్ ఓ లకు కూడా స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

మండల స్థాయిలో ఏ ఈ ఆర్ ఓ లు, నియోజకవర్గ స్థాయిలో ఈ ఆర్ ఓ లు తమ పరిధిలోని మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి ఐదు రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పర్యటించి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఎస్ఐ ఆర్ పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ఈ ఆర్ ఓ లు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత సాంకేతిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా తిరస్కరణలు అత్యంత జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే చేపట్టాలని చెప్పారు. బి ఎల్ ఓ లు, బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ లు) కలిసి ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత పత్రాల ఆధారంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ గుర్తింపు పత్రాలను సమర్పించి ధృవీకరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, ద్వంద్వ నమోదులు కలిగిన వారి పేర్లను తొలగించి, కొత్తగా అర్హత సాధించిన ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరి ప్రియా, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రత్యేక వాహన తనిఖీలు

మహబూబ్ నగర్ జూన్16 (వుదయం ప్రతినిధి)

రోడ్డు భద్రతను పెంపొందించడం, మోటారు వాహనాల చట్టం1988, కేంద్ర మోటారు వాహన నియమావళి అమలును పటిష్టం చేయడం లక్ష్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అమలు బృందాలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 169 వాహనాలను తనిఖీ చేయగా, నిబంధనలు ఉల్లంఘించిన 6 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.తనిఖీల సందర్భంగా వాహనాల ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, పర్మిట్, బీమా, పొల్యూషన్ అండర్ కంట్రోల్ ,సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనాలపై మోటారు వాహనాల చట్టం ప్ర ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రత్యేక వాహన తనిఖీలు కారం చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు.వాహన యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటయ్యే పత్రాలను కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని రవాణా శాఖ విజ్ఞప్తి చేసింది. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

నారాయణపేట టౌన్ జూన్16 (వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లాలో 2026 27 విద్యా సంవత్సరానికి కొత్తగా మంజూరైన 44 ప్రీప్రైమరీ సెక్షన్లలో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు , ఆయాల నియామక ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో అర్హులైన అభ్యర్థులకు మరింత అవకాశం కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు విద్యాధికారులు తెలిపారు. ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్మీడియట్ (10+2) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. మహిళా అభ్యర్థులతో పాటు పురుష అభ్యర్థులు కూడా ఈ పోస్టులకు అర్హులుగా స్వీకరించనున్నట్లు వారు తెలిపారు. ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్, ఎన్ టి టి, డి ఈ ఐ ఈ డి, బీఈడీ తదితర అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆయా పోస్టులకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించబడింది. అభ్యర్థుల ఎంపికలో స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అదే నివాస ప్రాంతం, గ్రామపంచాయతీ, మండలం జిల్లా వారీగా ప్రాధాన్యత క్రమం అమలు చేయబడుతుంది అన్నారు. ఈనెల 19వరకు - దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయం దరఖాస్తులు సమర్పించాలన్నారు. 20లోగా దరఖాస్తుల పరిశీలన తుది ఎంపిక జాబితా తయారు చేయనున్నట్లు వారు తెలిపారు.కమిటీ,సంబంధిత మండల విద్యాశాఖాధికారి అధ్యక్షతన, ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో కూడిన కమిటీ ద్వారా పరిశీలన ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుంది. ఈనెల 20లోగా - ఎంపిక జాబితాలు సంబంధిత రికార్డులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలి అన్నారు.కొత్తగా మంజూరైన 44 ప్రీప్రైమరీ సెక్షన్లు ప్రారంభించాల్సిన నేపథ్యంలో అన్ని మండల విద్యాశాఖాధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, నిర్దేశిత గడువులోగా ఎంపిక ప్రక్రియను పూర్తి చేయవలసిందిగా సూచించారు.ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన గౌరవ వేతనంపై నిర్వహించబడతాయి. తుది నియామకాలు జిల్లా స్థాయి ఆమోదానికి లోబడి ఉంటాయి అని విద్యాశాఖ అధికారి తెలిపారు.

## నీటి సమస్యలపై హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ ఎస్ బి ఎండీకి వినతి



కుత్బుల్లాపూర్, జూన్ 16, (వుదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ లోని ప్రగతినగర్ 276 డివిజన్, జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప (రాజీవ్ హిల్స్), గాజుల రామారం డివిజన్‌లోని ఏరో నగర్, మల్లంపేట్ లోని కె.వి.ఆర్ వ్యాలీ ప్రాంతాల్లో నెలకొన్న నీటి సమస్యలపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతాల్లో తాగునీరు, నిత్యా అవసరాలకు సరిపడా నీటి సరఫరా లేకపోవడం, క్రమరహిత నీటి పంపిణీ, పైప్‌లైన్ లీకేజీలు, అనధికారిక నీటి ట్యాంకర్ల నిర్వహణ వంటి సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. రాజీవ్ గృహకల్పలో పెరిగిన జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా పెంచడం, 5 బోర్‌వెల్‌ల ఏర్పాటు అర్హులైన కుటుంబాలకు వ్యక్తిగత నీటి కనెక్షన్లు మంజూరు చేయాలని, ఆయా ప్రాంతాల ప్రజలు చాలా కాలంగా తాగునీరు, నిత్యావసర నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అతిత్వరలో పరిష్కార చర్యలు చేపడతామని ఎండి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాసరావు, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, మురళీకృష్ణ, నారాయణరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సురేంద్ర కుమార్, ఆదిరెడ్డి, దాసరి మహేష్‌కుమార్ పాల్గొన్నారు

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: పుష్పనగేష్



రామచంద్రపురం, జూన్ 16(వుదయం)

రామచంద్రపురం డివిజన్‌లో వివిధ కాలనీల్లో మంజూరైన అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పాటు, కొన్ని ప్రాంతాల్లో చిన్నపాటి పనులు అసంపూర్తిగా ఉన్నాయని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసులతో కలిసి మంగళవారం ఆయన జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.గతంలో తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ప్రజల అవసరాల మేరకు మంజూరైన పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం వల్ల వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పుష్పనగేష్ తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సంబంధిత ప్రాంతాలను పరిశీలించి కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఇక శ్రీ సాయినగర్ కాలనీలో మిగిలిన రెండు రోడ్లు, మల్లికార్జున నగర్ కాలనీలో రోడ్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాలనీవాసులతో కలిసి పుష్పనగేష్ వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టిఏ సభ్యుడు పోషల్ రాజేష్

నారాయణపేట టౌన్ జూన్16 (వుదయం ప్రతినిధి)




నారాయణపేట జిల్లాలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పార్కింగ్ నిర్వహణ, రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై జిల్లా ఆర్టిఏ సభ్యుడు పోషల్ రాజేష్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోశాల రాజేష్ ఎస్పీ కి పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, వాహనాల పార్కింగ్ ఇబ్బందులు, ప్రజలకు ఎదురవుతున్న రవాణా సంబంధిత సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా నారాయణపేట పాత బస్టాండ్ ప్రాంతం, సత్యనారాయణ చౌరస్తా, మక్తల్, కోస్గి పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటం, రోడ్లపై ఇష్టా ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పట్టణాల్లో గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడం, రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే విధంగా పక్కా ప్రణాళికతో పార్కింగ్ నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని ఆర్టీఏ సభ్యుడు పోశాల రాజేష్‌కు సూచించారు.జిల్లాలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు పోలీసు శాఖ, రవాణా శాఖ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం మరింత పెంచి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎం వి ఐ ఎస్ కె మున్నీ, ఏఎంవిఐ సాయి తేజ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



వెల్దండ జూన్ 16 (వు దయం )

ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు మంగళవారం పోతే పెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల,ఉన్నత పాఠశాలను సందర్శించారు ఈ సందర్భంగా గ బడి బాట లో భాగంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి,పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్ లను పంపినీ చేశారు అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు ఎక్కువ సూచించారు,ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపొద్దు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండలుయాదవ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ గారు ఉపాధ్యాయులు, గ్రామ వార్డు మెంబర్లు, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు

# ఫీజుల 'దందా'.. నిబంధనలు" బొంద"

- చందూరులో ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం
- అడ్డగోలుగా ఫీజుల దోపిడీ-పట్టించుకోని అధికారులు
- పుట్టగొడుగుల్లా కార్పొరేట్ స్కూళ్లు.. ల్యాబ్‌లు లేవు, ప్లే గ్రౌండ్స్ అంతకన్నా లేవు!
- పుస్తకాలు, యూనిఫారాల పేరిట అదనపు బాదుడు







చందూరు, జూన్ 16 (వుదయం):అక్షరాలు నేర్పించాల్సిన అక్షరాలయాలు.. కాసులు కురిపించే వ్యాపార సముదాయాలుగా మారిపోయాయి. విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాసంస్థలు.. తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతూ కాసుల కక్కుర్తిని ప్రదర్శిస్తున్నాయి. చందూరు మున్సిపాలిటీ కేంద్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల ఇష్టారాజ్యం నడుస్తోంది. అడిగే నాథుడు లేకపోవడంతో.. 'ఫీజుల' దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. అడ్డగోలుగా ఫీజులు గుంజుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కార్పొరేట్ బోర్డులు తిప్పుతున్నా, విద్యాశాఖ అధికారులు మాత్రం 'మాకేం పట్టనట్టు' నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూల్స్ అన్నీ 'కాగితాల'కే పరిమితం!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ప్రతి ప్రైవేట్ పాఠశాలకు ఖచ్చితంగా సొంత మైదానం (ప్లే గ్రౌండ్), సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, సరిపడా గదులు, అత్యవసర ద్వారాలు ఉండాలి. కానీ చందూరు పట్టణంలోని చాలా ప్రైవేట్ పాఠశాలలు ఇరుకు గదుల్లో, సరైన వెలుతురు, గాలి లేని రేకుల షెడ్లలో, బహుళ అంతస్తుల భవనాల్లో నడుస్తున్నాయి. ఆట స్థలాలు లేకపోవడంతో విద్యార్థులు శారీరక ఎదుగుదలకు దూరమవుతున్నారు. అగ్నిప్రమాదాలు జరిగితే ప్రాణాలు కాపాడుకోవడానికి కనీస రక్షణ చర్యలు కూడా కొన్ని స్కూళ్లలో లేకపోవడం గమనార్హం.

**పుస్తకాలు, యూనిఫారాల పేరిట 'అదనపు' బాదుడు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల ఆవరణలో ఎలాంటి వ్యాపారాలు చేయకూడదు. కానీ, చందూరులోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలే స్వయంగా దుకాణాలుగా మారిపోయాయి. తాము చెప్పిన చోటే.. తాము నిర్ణయించిన ధరలకే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారాలు, బెల్టులు, టైలు కొనాలంటూ యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. మార్కెట్ ధర కంటే రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తూ తల్లిదండ్రుల నెత్తిన గుదిబండలా మారుతున్నారు.

**లక్షల్లో ఫీజులు.. జీతాలు మాత్రం వేలల్లోనే!**

"విద్యార్థుల నుంచి డొనేషన్లు, స్పెషల్ క్లాసుల పేరిట వేలాది రూపాయలు వసూలు చేసే యాజమాన్యాలు.. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రం అరకొర జీతాలు ఇస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయి. అర్హత లేని వారితో బోధన సాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు."

**పర్యవేక్షణ కరువైందా? 'మామూళ్ల' మత్తులో అధికారులున్నారా?**

పట్టణంలో విద్యాసంస్థల అక్రమ వ్యాపారం ఇంత బహిరంగంగా సాగుతున్నా.. విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద 'కథే' నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్ యాజమాన్యాలు ఇచ్చే 'మామూళ్ల' మత్తులో అధికారులు జోగుతున్నారని, అందుకే అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చందూరులో నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.




## యోగాతో మానసిక ప్రశాంతత

మధిర జూన్ 16, వుదయం ప్రతినిధి : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయుష్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కందుల రాంబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మధిర ప్రభుత్వ ఆయుర్వేదిక్ సిబ్బంది ఆధ్వర్యంలో మధిర 15వ అంగన్వాడి సెంటర్లో యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది, విద్యార్థులు యోగా సాధన చేసి దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కందుల రాంబాబు మాట్లాడుతూ, యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని అన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఏర్పడుతున్న అనేక ఆరోగ్య సమస్యలకు యోగా ఒక ఉత్తమ పరిష్కార మార్గమని పేర్కొన్నారు.

ప్రజలు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా దోహదపడుతుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ ఇన్స్ పెక్టర్ ఆర్. గణేష్ బాబు, డాక్టర్లు వెంకట్ లాల్, జాహ్నవి ఏఎన్ఎం విజయ కుమారి అంగన్వాడీ టీచర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

## రోహిత్ జన్మదినం సందర్భంగా భోజన ప్లేట్ల వితరణ



మధిర జూన్ 16, వుదయం ప్రతినిధి: మాటూరు ఉన్నత పాఠశాలలో చేరిన 6వ తరగతి విద్యార్థి చిన్నారి పూల రోహిత్ జన్మదిన సందర్భంగా తల్లీ దండ్రులు పూల పాండురంగారావు, రాజేశ్వరిలు పాఠశాల విద్యార్థులందరికి 10 వేల రూపాయల విలువైన భోజనప్లేట్స్ వితరణగా అందించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం దాతలు చేసే సహాయం ఎనలేనిదని తెలియజేస్తూ పూల పాండురంగారావు ప్రతి సంవత్సరం వారి పిల్లల పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో భోజన ఏర్పాట్లు, అవసరమైన వస్తువుల వితరణ చేయడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. దాతల దాతృత్వాన్ని కొనియాడుతూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా చక్కగా విద్యపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు షేక్ ఇబ్రహీం,పాఠశాల ఉపాధ్యాయులు కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు,చౌడవరపు సునీత రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు,బొగ్గుల శ్రీనివాసరెడ్డి,ఊటుకూరి రామరత్నం, పగిడిపల్లి ఇస్సాక్,ఎం పి వి ఎ వి ప్రసాద్ ఆఫీస్ సబార్డినేట్ షేక్ నాగుర్ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ బడి బాటలో విద్యా వెలుగులు

### సామూహిక అక్షరాభ్యాసంతో చిన్నారులకు అక్షర స్వాగతం



చర్ల జూన్ 16(వుదయం ప్రతినిధి) చిన్నారుల విద్యా ప్రస్థానానికి శుభారంభం పలుకుతూ రైస్‌పేట కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లు నిండిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి విద్యా జీవితానికి తొలి అడుగు వేయించారు. పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సాహం గా పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, వారికి ఉచితంగా పలకలు, నోట్‌బుక్స్, స్వీట్లు అందజేశారు. విద్యార్థుల ముఖాల్లో ఆనందం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక సౌకర్యాలను అందిస్తున్నాయని తెలిపారు. కొత్త విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు సంవత్సరాలు నిండిన చిన్నారులను సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యా సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పలకలు అందించడంతో పాటు పుష్టికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

## సమిష్టి కృషితోనే ఆర్టీసీ బలోపేతం




మధిర,జూన్ 16, వుదయం ప్రతినిధి: సమిష్టి కృషితోనే ఆర్టీసీ బలోపేతం అవుతుందని ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ డిపో అధ్యక్షులు ఎలియాస్ సెక్రటరీ కనపర్తి కిషోర్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం గోపాల్ రావు అన్నారు. మధిర డిపో మేనేజర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తడికమల్ల దేవరాజు ను మంగళవారం అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు యాజమాన్యం సమన్వయంతో పనిచేసి ఆర్టీసీని ఉన్నత స్థానంలోకి నిలిపేందుకు కృషి చేయాలని వారు కోరారు. నూతన డిఎం మధిర డిపోని ఆదర్శంగా నిలిపేందుకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ, సంస్థ బలోపేతానికి సమిష్టి నిర్ణయంతో ముందుకు వెళ్లాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జమలయ్య జాయింట్ సెక్రెటరీ భాస్కరరావు ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీను రీజినల్ కమిటీ మెంబర్ శ్రీనివాసరావు వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, సుదర్శన్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సుభిక్షం కోసం ముత్యాలమ్మ తల్లికి తొలకరి స్నానం



చర్ల, జూన్ 16(వుదయం ప్రతినిధి) చర్ల గ్రామంలో పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో

గ్రామ ప్రజల సుఖశాంతులు, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, లోకకల్యాణం చేకూరాలని ఆకాంక్షిస్తూ గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి మంగళవారం సందర్భంగా ప్రత్యేకంగా తొలకరి స్నాన మహోత్సవం నిర్వహించామని తెలిపిన దేవాలయ కమిటీ సభ్యులు .

ఆలయ అర్చకులు విజయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తొలకరి స్నానం భక్తుల సమక్షంలో నిర్వహించారు . వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రకృతి అనుగ్రహం లభించి గ్రామం సుభిక్షంగా ఉండాలని, రైతులకు పంటలు బాగా పండాలని పూజలు నిర్వహించారు .

ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ముత్యాలమ్మ తల్లి కృపతో గ్రామంలో సుఖశాంతులు నెలకొని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.



## అమ్మ మాట అంగన్వాడి బడిబాట కార్యక్రమం

చర్ల, జూన్ 16(వుదయం ప్రతినిధి)

చర్ల మండల పరిధిలోని ఎర్రంపాడు, తిప్పాపురం అంగన్వాడీ కేంద్రాలలో "అమ్మ మాట అంగన్వాడి బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యాభివృద్ధి, అంగన్వాడీ సేవల ప్రాధాన్యతపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు .

ఈ సందర్భంగా "అమ్మ మాట అంగన్వాడి బడిబాట" అనే నినాదంతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ద్వారా చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించడం, వారికి ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందించడం,

ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అంగన్వాడీలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా తెలిపారు . ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి చిన్నారి అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపాలని అధికారులు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల సమగ్ర వికాసానికి పునాదిగా నిలుస్తాయని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- రీజినల్ మేనేజర్ కార్యాలయం ముందు విశ్రాంత ఉద్యోగుల ధర్నా



నల్గొండ, జూన్ 16, వుదయం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) పదవీ విరమణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నల్గొండలోని రీజినల్ మేనేజర్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, 2013 పీఆర్సీ ఏరియర్స్‌కు సంబంధించిన యాజమాన్యం చెల్లించాల్సిన పీఎఫ్ కంట్రిబ్యూషన్‌ను పీఎఫ్ కమిషనర్ కార్యాలయానికి పంపించి పెన్షన్ పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే 2017 పీఆర్సీ బకాయిలు తొమ్మిది సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 పీఆర్సీని అమలు చేసి, 2017 మరియు 2021 పీఆర్సీలకు సంబంధించిన ఏరియర్స్‌ను విశ్రాంత ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని, ప్రస్తుతం ప్రతినెల అందిస్తున్న మందులను ఒకేసారి రెండు నెలలకు సరిపడా అందించాలని డిమాండ్ చేశారు. తార్నాక ఆసుపత్రిలో సభ్యత్వం పొందలేకపోయిన విశ్రాంత ఉద్యోగులందరికీ సభ్యత్వం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఉద్యోగులు లేదా ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు రూ.30 వేల అంత్యక్రియల సహాయాన్ని వర్తింపజేయాలని, చికిత్స నిమిత్తం తార్నాక ఆసుపత్రికి వచ్చే విశ్రాంత ఉద్యోగులకు విశ్రాంతి గదుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రీజినల్ మేనేజర్‌కు సమర్పించారు.

ఈ నిరసన కార్యక్రమంలో రీజినల్ అధ్యక్షుడు కత్తుల యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోనగిరి శంకరయ్య, రీజినల్ కార్యదర్శి పల్‌రెడ్డి యాదగిరి రెడ్డి, బకమల్లయ్య, శ్రీను, సీసీ శేఖర్, వీఎస్పీ రావు, ఎస్ఆర్ రెడ్డి, ఎండీ గౌస్, వివి రెడ్డి, రవీందర్, వీఏ రెడ్డి, బోయినపల్లి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. వివిధ డిపోల నుంచి విశ్రాంత ఉద్యోగులు హాజరై తమ సమస్యల పరిష్కారం కోరారు.

## సమ్మక్క--సారలమ్మ సాక్షిగా సమావేశ ప్రచారానికి శ్రీకారం



చర్ల, జూన్ 16:(వుదయం ప్రతినిధి)జూన్ 21న జరగనున్న ఆదివాసీ యువత సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో తుడుందెబ్బ నాయకులు ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా గిరిజన జాతి ఆడబిడ్డలు చర్ల మండలంలోని సమ్మక్క--సారలమ్మ దేవాలయం ఎదిర గుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి సమావేశ ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వాసం ముసలయ్య, కుర్సం రాంబాబు మాట్లాడుతూ ఆదివాసీ యువత తమ హక్కులు, సమస్యలు, భవిష్యత్ అవకాశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. జూన్ 21న నిర్వహించే సన్నాహక సమావేశంలో ఆదివాసీ యువత అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి అవకాశాలు, భూ హక్కులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. యువత సామాజిక చైతన్యంతో ముందుకు వచ్చి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రచార కార్యక్రమంలో చర్ల మండల ఆదివాసీ యువ నాయకులు పూనెం వరప్రసాద్, శ్యామల, తరుణ్, పూనెం రవికిరణ్, కోరం బిక్షపతి, ఇర్ప అరుణ్ కుమార్, ఇర్ప అరుణ్, కోరం వేణు, మడప అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాల వారీగా విస్తృత ప్రచారం నిర్వహించి ఆదివాసీ యువతను సమావేశానికి సమీకరించనున్నట్లు నాయకులు వెల్లడించారు. సమ్మక్క--సారలమ్మ దేవతల ఆశీస్సులతో ప్రారంభమైన ఈ ప్రచార కార్యక్రమం ఆదివాసీ యువతలో ఉత్సాహాన్ని నింపిందని, రానున్న సమావేశం గిరిజన యువత సమస్యలు, ఆకాంక్షలకు వేదికగా నిలుస్తుందని పాల్గొన్న నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతులు, చిన్న వ్యాపారులకు పెన్షన్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

### జూన్ 19న నల్గొండలో పీఎఫ్ఆర్డీఏ -- ఎస్ఎల్‌బీసీ తెలంగాణ సంయుక్త కార్యక్రమం

నల్గొండ, జూన్ 16, వుదయం ప్రతినిధి:ౖతులు, చిన్న వ్యాపారులు మరియు స్వయం ఉపాధి పొందుతున్న పౌరులను ఆర్థికంగా పటిష్ఠం చేయడంతో పాటు వారి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పెన్షన్ ఫండ్ నియంత్రణ మరియు అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఖ్రీ=ణాూ), ఎస్ఎల్‌బీసీ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమం జూన్ 19, 2026 శుక్రవారం ఉదయం 10:30 గంటలకు నల్గొండ పట్టణంలోని శివాజీ నగర్ రోడ్‌లో గల శాలిని రెసిడెన్సీ అండ్ బ్యాంక్వెట్ హాల్‌లో జరగనుంది. జాతీయ పెన్షన్ వ్యవస్థ (చీూూ) ద్వారా పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రత, అనిశ్చిత ఆదాయ పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, పెరుగుతున్న ధరలు, అనిశ్చిత ఆదాయ వనరులు మరియు మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక ప్రణాళిక, పెన్షన్ భద్రత అవసరంపై నిపుణులు విపులంగా వివరించనున్నారు. ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులకు క్రమబద్ధమైన పొదుపు, దీర్ఘకాలిక పెట్టుబడులు మరియు పెన్షన్ పథకాల ప్రాధాన్యతను వివరించనున్నారు.

ఈ సందర్భంగా పీఎఫ్ఆర్డీఏ అధికారులు ఎన్‌పీఎస్‌లో పెట్టుబడి వల్ల కలిగే ప్రయోజనాలు, చిన్న వయసులోనే పెట్టుబడి ప్రారంభించడం వల్ల కలిగే లాభాలు, పన్ను మినహాయింపులు, క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి విధానం, పదవీ విరమణ అనంతరం లభించే పెన్షన్ వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందించనున్నారు. అదేవిధంగా, తక్కువ మొత్తాలతోనే ఎన్‌పీఎస్‌లో పెట్టుబడి ప్రారంభించి, దీర్ఘకాలంలో పటిష్ఠమైన పెన్షన్ నిధిని సమకూర్చుకునే మార్గాలపై కూడా మార్గనిర్దేశం చేయనున్నారు. రైతు సంఘాలు, వ్యాపార సంఘాలు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, యువత మరియు ఆసక్తి గల పౌరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

**కార్యక్రమ వివరాలు:**

వేదిక: శాలిని రెసిడెన్సీ ఱ బ్యాంక్వెట్ హాల్, శివాజీ నగర్ రోడ్, నల్గొండ

తేదీ: జూన్ 19, 2026 (శుక్రవారం)

సమయం: ఉదయం 10:30 గంటలకు.

# చక్కని ఆరోగ్యం

## డెలివరీ తర్వాత బరువు తగ్గాలంటే..!



ప్రసవానంతర సమస్యల్ని దూరం చేయడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేస్తూ.. క్యాలరీలు తక్కువగా, పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని డైట్‌లో చేర్చుకుంటే ప్రసవానంతరం త్వరగా బరువు తగ్గచ్చంటున్నారు.

ప్రసవం తర్వాత శరీరం శక్తిని కోల్పోయి పూర్తిగా బలహీనపడుతుంది. అయితే ఈ శక్తిని తిరిగి కూడగట్టుకోవాలంటే.. వ్యాయామం చక్కటి మార్గం అంటున్నారు నిపుణులు. వ్యాయామం చేసే క్రమంలో ఎండార్ఫిన్లు, డోపమైన్, సెరటోనిన్.. వంటి హ్యాపీ హార్మోన్లు శరీరంలో విడుదలవుతాయి. ఇవి శరీరంలో శక్తిని పెంచడంతో పాటు ప్రశాంతతను అందిస్తాయని చెబుతున్నారు. బిడ్డకు జన్మనిచ్చాక నిద్రలేమి, అలసటతో తీవ్రమైన ఒత్తిడి ఎదురవుతుంటుంది. అయితే విభిన్న వ్యాయామాలు, యోగా, ధ్యానం.. వంటివి ఒత్తిడిని తరిమికొట్టి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఇలా ప్రశాంతంగా ఉండడం వల్ల బిడ్డ ఎదుగుదలకు పరోక్షంగా మేలు జరుగుతుందని చెబుతున్నారు నిపుణులు. గర్భధారణ సమయంలో దృఢంగా ఉంచడానికి కొన్ని వ్యాయామాలు ఎలా మేలు చేస్తాయో.. ప్రసవానంతరం కూడా కొన్ని వర్కవుట్లు తిరిగి పూర్వపు స్థితికి తీసుకురావడంలో సహకరిస్తాయి. ముఖ్యంగా డెలివరీ తర్వాత అధిక బరువును తగ్గించుకోవడం, పొట్ట తగ్గించుకోవడంలో ఇవి మేలు చేస్తాయంటున్నారు నిపుణులు.

బిడ్డ పుట్టాక కొంతమంది తల్లులు నిద్రలేమి సమస్యను ఎదుర్కొంటుంటారు. ఇలాంటి వాళ్లు వ్యాయామాలు చేయడం వల్ల సుఖంగా నిద్ర పట్టే అవకాశాలు ఎక్కువంటున్నారు నిపుణులు. సుఖ ప్రసవమైనా, సిజేరియన్ అయినా.. సాధారణంగా డెలివరీ అయిన ఆరు వారాల తర్వాతే వ్యాయామం మొదలుపెట్టమని సలహా ఇస్తుంటారు వైద్యులు. అయినా ఈ క్రమంలో ముందు ఓసారి డాక్టర్ వద్ద ఆరోగ్య పరిస్థితిని సమీక్షించుకున్నాకే ఎక్సర్‌సైజ్ ప్రారంభించడం మంచిది. అలాగే దీన్ని బట్టే మీరు ఎలాంటి వ్యాయామాలు చేయచ్చో కూడా చెబుతారు. సాధారణంగా బ్రిస్క్ వాకింగ్, ఈత, యోగా, సైక్లింగ్, పిలాటిస్, తక్కువ తీవ్రత ఉండే ఏరోబిక్ వ్యాయామాలు, పరుగు–జాగింగ్.. వంటివి ప్రసవానంతర సమస్యల నుంచి త్వరగా కోలుకునేందుకు తోడ్పడతాయంటున్నారు నిపుణులు. అలాగే ఒకేసారి ఎక్కువ సమయం వ్యాయామాలు చేయకుండా.. క్రమంగా సమయాన్ని పెంచుకుంటూ పోవడం మంచిదంటున్నారు నిపుణులు.

## ఐదేళ్ల ముందే పసిగట్టవచ్చు



ఊపిరితిత్తులు.. మన శరీరంలో అత్యంత ముఖ్యమైనవి. అయితే నేటి జీవనశైలి మార్పులు, కాలుష్యం, ధూమపానం అలవాట్ల కారణంగా చాలామంది ఊపిరితిత్తుల క్యాన్సర్ బారినపడుతున్నారు. రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్ల తర్వాత మరణానికి లంగ్ క్యాన్సర్ మరో ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ క్యాన్సర్ ఉన్నవారు శ్వాస తీసుకోవడంలో ఎకువగా ఇబ్బంది పడుతుంటారు. ఇటీవలి పరిశోధన ప్రకారం.. వ్యాధి నిర్ధారణకు ఐదు సంవత్సరాల కంటే ముందే ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని అంచనా వేయగల ఒక ప్రొటీన్ సిగ్నేచర్‌ను శాస్త్రవేత్తలు రక్తంలో గుర్తించారు. ఇది ముందస్తు చికిత్సకు మార్గం సుగమం చేయడంతో పాటు, రోగులు బతికే అవకాశాల్ని మెరుగుపరుస్తుంది. లండన్‌కు చెందిన ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్, ఆస్ట్రేలియాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన చేశారు. శాస్త్రవేత్తలు మెషిన్ లెర్నింగ్ సాంకేతికతను ఉపయోగించి యూకే బయోబ్యాంక్‌లోని దాదాపు 48,000 మంది రక్త నమూనాల్ని, వారి ఆరోగ్య రికార్డులను విశ్లేషించారు. ఇందులో ఉన్న రక్తంలోని 14 ప్రత్యేక రకాల ప్రొటీన్ల కలయికను వారు గుర్తించారు. ఇవి ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నవారిలో సగటున 5.6 సంవత్సరాల ముందే మార్పులను చూపిస్తాయి.

కణితి నుంచి కాదు: ఈ పరిశోధనలో తేలిన అత్యంత కీలకమైన విషయం ఏంటంటే ఈ ప్రొటీన్ సంకేతాలు క్యాన్సర్ గడ్డల నుంచి రావడం లేదు. వాయు కాలుష్యం లేదా ఇతర కారణాల వల్ల ఊపిరితిత్తులలో దీర్ఘకాలంగా ఏర్పడే వాపు లేదా మంట వల్ల ఈ ప్రొటీన్లు రక్తంలో పెరుగుతాయి. ఈ వాతావరణమే నిద్రాణంగా ఉన్న క్యాన్సర్ కణాలను యాక్టివేట్ చేస్తుంది. వారికి కూడా ముప్పే: ప్రస్తుతం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కేవలం 50–70 ఏళ్ల వయసు ఉండి, ఎకువ ధూమపానం చేసేవారికే చేస్తు న్నారు. కానీ, లంగ్ క్యాన్సర్ బాధితుల్లో దాదాపు పావు వంతు మంది అస్సలు ధూమపానం చేయనివారే ఉంటున్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యం ఎకువగా ఉండే ప్రాంతాల్లో నివసించే వారిలో ఈ ముప్పు పెరుగుతున్నది. ఈ కొత్త బ్లడ్ టెస్ట్ సిగరెట్ తాగని వారిలో కూడా క్యాన్సర్ ముప్పును ముందే గుర్తిస్తుంది. నివారణ సాధ్యమే: క్యాన్సర్ రాకముందే ఈ ప్రొటీన్ సంకేతాల ఆధారంగా హై–రిస్ ఉన్నవారిని గుర్తిస్తే, వారికి మంటను తగ్గించే మందులు ఇవ్వడం ద్వారా క్యాన్సర్ రాకుండా ముందే ఆపవచ్చని ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో శాస్త్రవేత్తలు గమనించారు. భారతదేశంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో దాదాపు 80% నుంచి 85% మంది రోగులు వ్యాధి చివరి దశకు చేరిన తర్వాతే హాస్పిటల్‌కు వస్తున్నారు.

## కిడ్నీ కష్టాన్ని కనిపెట్టండి



మన శరీరంలో ఎలాంటి విరామం లేకుండా నిరంతరం పనిచేసే అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. శరీరంలో పేరుకుపోయే మలినాలను బయటికి పంపించడం నుంచి రక్తపోటును నియంత్రించడం వరకు అనేక కీలక బాధ్యతలను ఇవి నిర్వహిస్తాయి. అయితే మూత్రపిండాలు దెబ్బతినడం ప్రారంభమైనా చాలా కాలం వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందుకే కిడ్నీ రుగ్మతలను నిశ్శబ్దంగా దెబ్బతీసే వ్యాధులుగా వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుత కాలంలో మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనశైలి, తక్కువ నీరు తాగడం వంటి కారణాలతో మూత్రపిండాల వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే ఎక్కువగా కనిపించే ఈ సమస్యలు ఇప్పుడు యువతలో కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం.

భారతదేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధుల బారినపడుతున్నారు. వారిలో చాలామంది చివరి దశలో మాత్రమే సమస్యను గుర్తిస్తున్నారు. ఫలితంగా రక్త శుద్ధి చికిత్సలు, మూత్రపిండాల మార్పిడి అవసరమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. అయితే సరైన అవగాహన, ముందస్తు పరీక్షలు, జీవనశైలిలో మార్పులు, ఆధునిక చికిత్సలతో మూత్రపిండాల వ్యాధులను నియంత్రించడం మాత్రమే కాకుండా నివారించడమూ సాధ్యమే అంటున్నారు నిపుణులు. రక్తాన్ని శుద్ధి చేయడం: మూత్రపిండాలు నిరంతరం రక్తాన్ని వడగట్టి శరీరానికి అవసరం లేని మలినాలను మూత్రం రూపంలో బయటికి పంపిస్తాయి. శరీరంలో నీటి సమతౌల్యాన్ని కాపాడటం: శరీరంలో నీరు అధికమైనా, తక్కువైనా సమతౌల్యాన్ని నిలుపుకోవడంలో మూత్రపిండాలు కీలక పాత్ర పోషిస్తాయి. రక్తపోటు నియంత్రణ: ప్రత్యేక రసాయన పదార్థాల ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయి. రక్తహీనతను నివారించడం: ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన హార్మోన్ల తయారీలో సహకరిస్తాయి. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడం: విటమిన్ డిని శరీరానికి ఉపయోగపడే రూపంలోకి మార్చి క్యాల్షియం శోషణకు సహకరిస్తాయి. మధుమేహం: రక్తంలో అధిక చక్కెర స్థాయిలు మూత్రపిండాల్లోని సూక్ష్మ రక్తనాళాలను దెబ్బతీస్తాయి. అధిక రక్తపోటు: రక్తపోటు ఎక్కువగా ఉండటం వల్ల మూత్రపిండాల వడపోత వ్యవస్థ బలహీనపడుతుంది. ప్యాకెట్లలో లభించే ఆహారాలు, ఊరగాయలు, వేయించిన పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల ప్రమాదం పెరుగుతుంది. తక్కువ నీరు తాగడం: శరీరంలో నీటి లోపం ఏర్పడి మూత్రపిండాలపై ఒత్తిడి పెరుగుతుంది. నొప్పి నివారణ మాత్రలు: వైద్యుల సలహా లేకుండా తరచూ నొప్పి నివారణ మందులు వాడటం మూత్రపిండాలకు హానికరం. ధూమపానం, మద్యపానం: ఇవి రక్తప్రసరణను దెబ్బతీసి మూత్రపిండాల పనితీరును తగ్గిస్తాయి.

## పెదాలు నల్లబడుతున్నాయా?



చాలామంది విషయంలో అధరాలు తమ చిన్నతనంలో ఉన్నంత మృదువుగా, గులాబీ వర్ణంలో ఉండవనే చెప్పాలి. కొంతమందికి పెదాలు నల్లగా మారడం, పొడిబారిపోవడం.. వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. దీన్నే 'లిప్ పిగ్మెంటేషన్'గా చెబుతారు నిపుణులు. మరి, ఈ సమస్య ఎందుకొస్తుంది? దీన్నుంచి బయటపడాలంటే ఏం చేయాలి? మొదలైన విషయాల గురించి నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం రండి.. లిప్ పిగ్మెంటేషన్‌కి మనం పాటించే అనారోగ్యపూరిత జీవన శైలితో పాటు వివిధ రకాల కారణాలున్నాయంటున్నారు నిపుణులు. రసాయనాలుండే సౌందర్య ఉత్పత్తుల్ని వాడడం, అతినీలలోహిత కిరణాల ప్రభావం, శరీరంలో మెలనిన్ ఉత్పత్తి అధికమవడంతో పాటు కొంతమంది గర్భిణుల్లోనూ ఈ సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఇంట్లో లభించే కొన్ని సహజ పదార్థాలతో ఈ సమస్యను దూరం చేసుకోవచ్చంటున్నారు. SPF 15 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న లిప్‌బామ్‌ను రోజూ బయటికి వెళ్లే ముందు పెదాలకు రాసుకోవాలి. తద్వారా అతినీల లోహిత కిరణాల ప్రభావం అధరాలపై పడకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే పెదాలకు అడ్డుగా మాస్క్ ధరించడం లేదా స్కార్ఫ్‌తో కవర్ చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. పిగ్మెంటేషన్ సమస్యను తగ్గించడంలో విటమిన్–ఎ సహకరిస్తుంది. అందుకే ఈ పదార్థం ఉన్న లిప్‌బామ్‌లు, లిప్‌క్రీమ్‌లు తరచూ ఉపయోగించడం వల్ల ఫలితం ఉంటుందట. అలాగే 'ఎ' విటమిన్ అధికంగా ఉండే చిలగడదుంప, క్యారట్, పాలకూర, బ్రకలీ.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడమూ ముఖ్యమే. రాత్రి పడుకునే ముందు పెదాలకు ఆలివ్ ఆయిల్ రాసుకున్నా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఇది పొడిబారిపోయి పాలిపోయిన పెదాలకు తేమనందిస్తుంది. తద్వారా అధరాలు మృదువుగా మారడంతో పాటు మంచి రంగులోకి వస్తాయట. మెలనిన్ స్థాయుల్ని అదుపు చేసే శక్తి కలబందకు ఉందని చెబుతోంది ఓ అధ్యయనం. అందుకే కలబంద గుజ్జును రోజూ రాత్రి పూట పెదాలపై రాసుకొని కాసేపు మర్దన చేసుకోవాలి. తద్వారా చర్మానికి తేమ అంది పెదాలు మృదువుగా మారతాయంటున్నారు. కొంతమందికి పదే పదే పెదాలను నాలుకతో అద్దడం, పంటితో కొరకడం అలవాటు! దీనివల్ల కూడా పెదాలు పొడిబారి రంగు మారిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ అలవాటును పూర్తిగా మానుకోవడం మంచిదంటున్నారు. తేనెను పెదాలపై రాసుకొని ఆరే వరకు అలాగే ఉంచుకోవాలి.. లేదంటే పడుకునే ముందు అప్లై చేసుకొని రాత్రంతా ఉంచుకొని మరుసటి రోజు చల్లటి నీళ్లతో కడిగేయాలి. దీనివల్ల చక్కటి ఫలితం ఉంటుందట. పడుకునే ముందు షియా బటర్.. వంటి సహజసిద్ధమైన ఉత్పత్తుల్ని అప్లై చేసుకోవడం వల్ల పెదాలకు పోషణ లభిస్తుంది.. సమస్య కూడా తగ్గుముఖం పడుతుందట. బయటి నుంచి ఎలాంటి క్రీమ్‌లు, లిప్‌బామ్ / లిప్ జెల్.. వంటివి వాడాలనుకున్నా.. ముందుగా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఇతర సహజసిద్ధమైన చిట్కాలు పాటించే ముందు కూడా అవి చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

## ఈ ఐస్‌క్రీమ్ చాలా ప్రత్యేకం

జామ, సీతాఫలం, మ్యాంగో, స్ట్రాబెర్రీ.. ఇలా రకరకాల ఐస్‌క్రీమ్‌లు తిని ఉంటారు. కానీ తాటి ముంజలతో ఐస్‌క్రీమ్ ఎప్పుడైనా రుచి చూశారా? లేదు కదూ.. ఎందుకంటే ఇది బయట దొరకదు.. ఒకసారి ట్రై చేసి చూడండి..

కావలసినవి: పాలు – అర లీటర్, కస్టర్డ్ పౌడర్ – నాలుగు స్పూన్లు, లేత తాటి ముంజలు – 12, పంచదార – 100 గ్రాములు, వెనీలా ఎసెన్స్ – కొద్దిగా



తయారీ: తాటి ముంజలు కడిగి, పొట్టు మొత్తం తీసేయాలి. అలా తీస్తున్నప్పుడు ముంజల్లోని నీటిని చిన్న పాత్రలోకి తీసి ఉంచుకోవాలి. అన్ని ముంజలూ వలిచాక ముక్కలుగా కట్ చేయాలి. కస్టర్డ్ పౌడర్‌ను ఒక బౌల్‌లో వేసి తగినన్ని నీళ్లు జోడించి.. ఉండలు కట్టకుండా కలపాలి. ఇప్పుడు వెడల్పాటి పాత్రలో పాలను వేడి చేయాలి. అవి మరుగుతుండగా.. పంచదార, కస్టర్డ్ పౌడర్ మిశ్రమం, వెనీలా ఎసెన్స్ జోడించి కలియబెడుతుండాలి. అది చిక్కగా క్రీమ్‌లా తయారయ్యాక.. ముక్కలుగా తరిగిన ముంజలను, వాటిలోని నీటిని జతచేసి.. మెల్లగా కలపాలి. కొన్ని క్షణాలుంచి దించేయాలి. గిన్నె గది ఉష్ణోగ్రతకు వచ్చిన తర్వాత.. ఓ అరగంట రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. రుచికరమైన తాటి ముంజల ఐస్‌క్రీమ్ తయారైపోతుంది. ఇక ఆస్వాదించి, ఆనందించడమే తరువాయి.

## శాండ్‌విచ్ మసాలా పౌడర్ ఇలా..

శాండ్‌విచ్ చేసినప్పుడు.. ఏమంత టేస్టీగా లేదనిపించి అసంతృప్తి కలుగుతోందా? అయితే ఈ మసాలా పౌడర్‌ను చల్లితే స్ట్రీట్‌ఫుడ్ రుచి వస్తుంది. అది ఇంట్లోనే చేయొచ్చు.. శాండ్‌విచ్ మసాలా పౌడర్



కోసం.. జీలకర్ర – 30 గ్రా, బ్లాక్ సాల్ట్, సాధారణ ఉప్పు – తగినంత, మిరియాలు, ఆమ్‌చూర్ పౌడర్ – 2 స్పూన్ల చొప్పున, ఛాట్ మసాలా – టేబుల్ స్పూన్, ఇంగువ – పావు స్పూన్, పుదీనా పొడి – టేబుల్ స్పూన్, ధనియాలు, శొంఠి పౌడర్లు – స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. జీలకర్రను సన్న సెగ మీద మంచి సువాసన వచ్చే వరకూ వేయించాలి. చల్లారిన తర్వాత మిరియాలను చేర్చి.. గ్రైండ్ చేయాలి. అందులో నల్ల ఉప్పు, సాధారణ ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, చాట్ మసాలా, ఇంగువ, శొంఠి, ధనియాలు, పుదీనా పౌడర్లు వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మెత్తని పౌడర్‌ను గాలి చొరబడని సీసాలోకి తీసుకోవాలి. మిశ్రమంలో ఒక స్పూన్ కసూరీమేథీ పొడి, అర స్పూన్ కారం కలిపితే మరింత రుచిగా ఉంటుంది. బ్రెడ్‌పై కొంచెం వెన్న రాసిన తర్వాత ఈ మసాలా పౌడర్‌ను తేలికగా చల్లాలి. కీరదోస, టొమాటో, ఉల్లి స్లైసులు, ఉడికించిన బంగాళదుంప ముక్కలు వంటివి పేర్చి.. వాటి మీద కూడా కొద్దిగా చల్లాలి. తర్వాత గ్రిల్ చేయాలి. పౌడర్‌ను తడి లేని, గాలి చొరబడని డబ్బాలో భద్రంచేస్తే.. మూడు నెలలు నిలవుంటుంది. ఈ పౌడర్– వెజ్ శాండ్‌విచ్, ఫ్రూట్ శాండ్‌విచ్.. దేనికైనా బాగుంటుంది.

## మీ దంతాలు భద్రమేనా?

అందమైన చిరునవ్వుకు మిలమిలలాడే దంతసిరి చాలా ముఖ్యం. చాలామందిలో ముందు దంతాలు నల్లగా మారడం, మురికి పట్టినట్లు అసహ్యకరమైన పసుపు రంగులోకి మారడం మనం చూస్తుంటాం. దంత క్షయానికి కేవలం పంటి పురుగులు లేదా క్యావిటీలు మాత్రమే కారణం అనుకుంటే పొరపాటే. దీని వెనుక మన దైనందిన జీవితంలో భాగమైన కొన్ని చెడు అలవాట్లు దాగి ఉన్నాయి.

సాధారణంగా దంతాల్లో తీవ్రమైన అసౌకర్యం కలగనంత వరకు చాలామంది వాటి ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. కానీ, కొన్ని అలవాట్లు లోపలి నుంచి దంతాలను క్రమక్రమంగా అరిగేలా చేస్తాయి. దీనివల్ల పళ్లు బలహీనపడి, ఊడిపోయే స్థితికి చేరుకుంటాయి. ఇలాకాకుండా మన దంతాలను రక్షించుకునేందుకు వెంటనే మానుకోవాల్సిన అలవాట్లను తెలుసుకుందాం.. గట్టిగా బ్రష్ చేయడం: కొంతమంది దంతాలు తెల్లగా మెరవాలనే ఆరాటంతో బ్రష్‌ను పళ్లపై వేసి గట్టిగా రుద్దుతుంటారు. ఎకువ సమయం పాటు బ్రష్ చేయడం వల్ల లాభం కంటే నష్టమే ఎకువ. ఇలా చేయడం వల్ల దంతాలను రక్షించే ఎనామెల్ పూర్తిగా అరిగిపోతుంది. ఫలితంగా దంతాల్లో సున్నితత్వం ఏర్పడి చల్లటి లేదా వేడి పదార్థాలు తిన్నప్పుడు పళ్లు జివ్వుమనడం మొదలవుతుంది. ఓపెనర్‌లా వాడటం: పళ్లను కేవలం ఆహారం నమలడానికి మాత్రమే ఉపయోగించాలి. కానీ. చాలామంది దంతాలను కత్తెరలానో, క్యాప్ ఓపెనర్‌లాగో భావిస్తుంటారు. దంతాలతో కూల్ డ్రింక్ బాటిల్ మూతలు తీయడం, ప్లాస్టిక్ ప్యాకెట్లు లేదా చిప్స్ ప్యాకెట్లను చింపడం, టేపులను కత్తిరించడం వంటి పనులు చేస్తుంటారు. ఈ ఒత్తిడి వల్ల దంతాలపై మైక్రో ఫ్రాక్చర్స్ ఏర్పడి పళ్లు ముకలయ్యే ప్రమాదం ఉంది. వాటి వల్ల కూడా: రోజంతా ఏదో ఒకటి తింటూనే ఉండటం లేదా పదేపదే టీ, కాఫీలు తాగడం పళ్లకు అస్సలు మంచిది కాదు. మనం తిన్న ప్రతిసారీ నోటిలో యాసిడ్స్ విడుదలవుతాయి. ఈ యాసిడ్ ఉత్పత్తి నిరంతరాయంగా సాగి, ఎనామెల్ పొరను కరిగించివేస్తుంది. దీనివల్ల దంతాలు లోపలి నుంచి గుల్లగా మారిపోతాయి. ప్రమాదం రెట్టింపు: సోడాలు, కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్, ఆలహాల్ లాంటివి తాగడం వల్ల శరీర ఆరోగ్యమే కాకుండా దంతాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. వీటిలో ఉండే అధిక ఆమ్ల గుణాలు దంతాల ఎనామెల్‌ను క్షీణింపజేసి, పిప్పిపళ్లు లేదా క్యావిటీలు వచ్చే ప్రమాదాన్ని వంద శాతం పెంచుతాయి. తిన్న వెంటనే: ఆహారం తిన్న వెంటనే బ్రష్ చేయడం సరైంది కాదు. మనం ఏదైనా తిన్నప్పుడు దంతాల ఎనామెల్ పొర కాస్త మెత్తబడుతుంది. ఆ సమయంలో బ్రష్ చేస్తే ఎనామెల్ సులభంగా ఊడిపోతుంది. కాబట్టి ఏదైనా తిన్న తర్వాత కనీసం 30 నిమిషాలు ఆగి బ్రష్ చేయడం లేదా కేవలం నీటితో నోరు పుకిలించడం మంచిది. ఫ్లాసింగ్ చేయాలి: కేవలం బ్రష్ చేయడంతోనే దంతాల శుభ్రత పూర్తి కాదు. రెండు దంతాల మధ్య ఇరుకుపోయిన ఆహార కణాలను బ్రష్ తొలగించలేదు. ఇందుకోసం డెంటల్ ఫ్లాస్ వాడాలి. ఫ్లాసింగ్ చేయకపోతే ఆ ఆహార కణాలు అకడే కుళ్లిపోయి బ్యాక్టీరియా చేరి ప్లేక్‌లా మారుతుంది. ఇది చిగుళ్ల వ్యాధులకు, దంతాలు కుళ్లిపోవడానికి ప్రధాన కారణమవుతుంది.



## కార్ల విక్రయాల్లో 27.3% వృద్ధి: సియామ్



ఈ ఏడాది మేలో దేశీయంగా ప్రయాణికుల వాహన (పీవీ – కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) టోకు విక్రయాలు 4,38,854 యూనిట్లుగా నమోదయ్యాయి. 2025 మేలో విక్రయమైన 3,44,656 పీవీల కంటే ఈ సంఖ్య 27.3% అధికం. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వల్ల వాహనాల ధరలు తగ్గడం, సులభంగా రుణాలు లభించడం ఇందుకు కలిసొచ్చినట్లు భారత వాహన తయారీదార్ల సమాఖ్య (సియామ్) సోమవారం వెల్లడించింది. అన్ని విభాగాల్లో కలిపి గతనెలలో 23,52,693 వాహనాలు టోకుగా విక్రయమైనట్లు తెలిపింది. 2025 ఏప్రిల్‌లో విక్రయమైన 20,14,158 వాహనాల కంటే ఈ సంఖ్య 16.8% అధికం. 'మేలో ప్రయాణికుల వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ద్విచక్ర వాహనాలు రికార్డు విక్రయాలు సాధించాయి. ప్రతి విభాగం రెండంకెల వృద్ధి నమోదుచేసింది. గత ఏడాది మేలో తక్కువ విక్రయాలు నమోదు కావడం వల్ల, ఈసారి అమ్మకాల్లో వృద్ధి అధికంగా నమోదైంది' అని సియామ్ డైరెక్టర్ తెలిపారు.




# మూడో రోజూ రాణించిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. ముడి చమురు ధరలు దిగి రావడం; ద్రవ్యోల్బణం, వృద్ధి భయాలు తగ్గుముఖం పట్టడమూ మార్కెట్‌కు కలిసొచ్చింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ రాణించగా.. మెటల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 24 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. సెన్సెక్స్ ఉదయం 76,526.77 (క్రితం ముగింపు 76,264.33) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,846.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 544.15 పాయింట్ల లాభంతో 76,808.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 135.25 పాయింట్ల లాభంతో 23,989.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.55గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్ షేర్లు రాణించాయి. ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, బీఈఎల్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

# భారత వృద్ధి ఆవిష్కరణల కార్యాచరణపై చర్చలు

హీరో ఎంటర్‌ప్రైజ్ యొక్క ప్రముఖ థాట్ లీడర్‌షిప్ వేదిక అయిన మైండ్‌మైన్ సమ్మిట్ 16వ ఎడిషన్ నేడు న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ సమ్మిట్‌లో దేశంలోని ప్రముఖ విధాన నిర్ణేతలు, పరిశ్రమ నాయకులు, ఆర్థికవేత్తలు, దౌత్యవేత్తలు, పెట్టుబడిదారులు, ఆరోగ్య నిపుణులు, ప్రజా మేధావులు పాల్గొని భారతదేశ అభివృద్ధి ప్రయాణంపై విస్తృత చర్చలు జరిపారు.'అనిశ్చిత సమయాలు – ఆత్మవిశ్వాసపూరిత నిర్ణయాలు: భారత్ పునఃసమతుల్యం' అనే అంశంతో నిర్వహించిన ఈ సమ్మిట్‌లో, వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో భారత్ తన ఆర్థిక పునాదులు, సంస్థాగత వ్యవస్థలు, ఆవిష్కరణల పర్యావరణం అభివృద్ధి ప్రాధాన్యతలను ఎలా బలోపేతం చేసుకుంటోందో చర్చించారు.సమ్మిట్ ప్రారంభంలో కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్, హీరో ఎంటర్‌ప్రైజ్ చైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ పాల్గొన్న ప్రత్యేక సంభాషణ జరిగింది.ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, "బలమైన దేశీయ వినియోగం ప్రపంచ ఆర్థిక అనిశ్చితులకు వ్యతిరేకంగా భారత్‌కు రక్షణగా నిలుస్తోంది. అయితే దిగుమతి చేసుకునే ముడి పదార్థాలు మధ్యవర్తి ఉత్పత్తులపై ఆధారపడటం ఇంకా ఒక ప్రధాన బలహీనతగా ఉంది" అని పేర్కొన్నారు. సమ్మిట్ విజయంపై హీరో ఎంటర్‌ప్రైజ్ చైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్ మాట్లాడుతూ, "ఈ ఏడాది మైండ్ మైన్ సమ్మిట్‌లో జరిగిన చర్చలు భారతదేశం ముందున్న అపార అవకాశాలను మార్పును స్వీకరించే దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించాయి. ఆవిష్కరణలు, బలమైన సంస్థలు, పారిశ్రామిక స్ఫూర్తి సహకార నాయకత్వం భారత అభివృద్ధి తదుపరి దశను నిర్దేశించనున్నాయని అందరూ గుర్తించారు. కి, కొత్త దృక్కోణాలను చర్చించడానికి దేశ పురోగతికి తోడ్పడేందుకు మైండ్‌మైన్ సమ్మిట్ ఒక ముఖ్యమైన వేదికగా కొనసాగుతోంది" అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలు ప్యానెలిస్టులుగా ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యురాలు డాక్టర్ షమికా రవి, పార్లమెంట్ సభ్యురాలు బన్సూరి స్వరాజ్, భారతదేశంలోని ఇటలీ రాయబారి అంటోనియో బార్తోలీ, మాజీ కేంద్ర మంత్రి సురేష్ ప్రభు, పీడబ్ల్యూసీ ఇండియా చైర్‌పర్సన్ సంజీవ్ కృష్ణన్, షెల్ ఇండియా చైర్‌పర్సన్ మాన్సి మదన్ త్రిపాఠి, టాటా పవర్ సీఈఓ & ఎండీ డాక్టర్ ప్రవీర్ సిన్హా, కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ ఎండీ నిలేష్ షా, హుడ్కో సీఎండీ సంజయ్ కుల్‌శ్రేష్ఠ, ఫైజర్ కంట్రీ ప్రెసిడెంట్ & ఎండీ మీనాక్షి నేవాటియా, గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ & సీఈఓ జస్లీన్ కోహ్లీ, ఐసీఐసీఐ లోంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ & సీఈఓ సంజీవ్ మంత్రి తదితరులు పాల్గొన్నారు. సమ్మిట్ ముగింపు సందర్భంగా 18వ బీఎంఎల్ ముంజాల్ అవార్డులు ప్రదానం చేయబడ్డాయి. సంస్థాగత అభ్యాసం అభివృద్ధికి కట్టుబడి వ్యాపార అత్యుత్తమతను ప్రదర్శించిన సంస్థలకు ఈ అవార్డులు అందజేయబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్‌సంఘ్‌చాలక్ శ్రీ మోహన్ భాగవత్ అవార్డులను ప్రదానం చేసి, 'భారత్ కా నిర్మాణ్: మూలాలు, విలువలు, భవిష్యత్' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా మైండ్‌మైన్ సమ్మిట్ ప్రభుత్వం, వ్యాపార రంగం, విద్యా సంస్థలు పౌర సమాజానికి చెందిన నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి జాతీయ అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించే దేశంలోని అత్యంత గౌరవనీయమైన వేదికలలో ఒకటిగా ఎదిగింది. 2026 ఎడిషన్ కూడా భారత భవిష్యత్తును నిర్దేశించే అవకాశాలు నిర్ణయాలపై అర్థవంతమైన చర్చలకు వేదికగా నిలిచి తన వారసత్వాన్ని కొనసాగించింది.




# రికార్డు స్థాయికి టోకు ధరలు



టోకు ధరలు గత నెలలో మరింత పెరిగాయి. ముడి చమురు అధిక ధరల వల్ల.. దేశీయంగా ఇంధనం, విద్యుత్ ధరలు ప్రియం కావడం ఇందుకు నేపథ్యం. మే నెలలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 9.68 శాతానికి పెరిగింది. ఏప్రిల్‌లో ఇది 8.26 శాతంగా ఉంది. ధరల గణనకు ఆధారిత సంవత్సరాన్ని 2011–12 నుంచి 2022–23కు సవరిస్తూ, మే నెలకు డబ్ల్యూపీఐ గణాంకాలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సోమవారం విడుదల చేసింది. డబ్ల్యూపీఐ గణనకు 697 ఉత్పత్తుల ధరలను గతంలో పరిగణించేవారు. ఇప్పుడు ఉత్పత్తుల సంఖ్య 957కు విస్తరించారు. సౌర, పవన విద్యుత్ లాంటి పునరుత్పాదక విద్యుత్, అణువిద్యుత్ ఛార్జీలనూ విద్యుత్ విభాగంలో చేర్చారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2026 మే, ఏప్రిల్‌లో టోకు ద్రవ్యోల్బణం పెరిగేందుకు ప్రధానంగా పెట్రోలియం ఉత్పత్తులు, సహజవాయువు, రసాయనాలు, ప్రాథమిక లోహాల తయారీ విభాగాలు కారణమయ్యాయి. డబ్ల్యూపీఐలో 14.1% వాటా కలిగిన ఇంధనం, విద్యుత్ విభాగ ద్రవ్యోల్బణ రేటు మేలో 30.33 శాతానికి పెరిగింది. ఏప్రిల్‌లో ఇది 24.80 శాతంగా ఉంది. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 2.43% నుంచి 3.6 శాతానికి, తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 6.68% నుంచి 7.48 శాతానికి పెరిగాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఉపశమించినందున.. ఇంధన ధరలు దిగి వస్తున్నందున జూన్ నెలలో టోకు ధరల విషయంలో కొంత ఊరట లభించొచ్చని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభం కావడానికి ముందున్న 2.5% కంటే తక్కువకు డబ్ల్యూపీఐ రావడానికి కొంత సమయం పడుతుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ డైరెక్టరు మేఘా అరోరా తెలిపారు. హర్మూజ్ జలసంధిలో రాకపోకలు సజావుగా సాగడం దేశ ఉత్పత్తిదారులు /ఎగుమతిదార్లకు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గిస్తుందని వివరించారు.

# ఆ విషయంలో కంపెనీ విఫలమయ్యింది



ఏఐ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా మెటా (Meta) ఇటీవల పలు కీలక మార్పులు చేసింది. ఈ ఏడాది మార్చిలో ఈ టెక్ దిగ్గజం ఒక కొత్త అప్లైడ్ ఏఐ (Applied AI) విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఇందులోభాగంగా సుమారు 6,500 మంది ఇంజినీర్లు, ప్రొడక్ట్ మేనేజర్లను వివిధ బృందాల నుంచి ఏఐ ప్రాజెక్టులపై పనిచేయడానికి బదిలీ చేశారు. అయితే, కంపెనీ నిర్ణయంతో ఈ విభాగానికి బదిలీ అయిన సిబ్బంది అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ విషయంపై మెటా సీటీవో ఆండ్రూ బాస్‌వర్త్ (Meta CTO Andrew Bos-worth) మాట్లాడుతూ.. ఏఐ పునర్ వ్యవస్థీకరణ విషయంలో కంపెనీ సరైన నిర్ణయం తీసుకోలేకపోయిందని అంగీకరించారు. కృత్రిమ మేధ విభాగాన్ని సరికొత్తగా తీసుకురావడంలో మెటా దారుణంగా వ్యవహరించిందని ఆండ్రూ వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్ట్ విజన్‌ను, విభాగాల మార్పుల వల్ల భవిష్యత్తులో ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలను తాము వారికి స్పష్టంగా తెలియజేయడంలో విఫలమయ్యామని అన్నారు. మే నెలలో దాదాపు 8వేల మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ఇవ్వడంతో పాటు, మిగిలిన సిబ్బందిని ఏఐ వైపు మళ్లించే క్రమంలో ఈ తప్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఇటీవల మెటా సీఈవో జుకర్ బర్గ్ (Zuckerberg) కూడా ఇటువంటి అభిప్రాయమే వెల్లడించడం గమనార్హం. కాగా కంపెనీ తీసుకున్న నిర్ణయంతో కృత్రిమ మేధ విభాగంలోని ఉద్యోగులు తమకు సృజనాత్మకత లేని పనులు కేటాయిస్తున్నారని.. దీనివల్ల తమ ఎదుగుదల తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. బలవంతపు బదిలీలు, 50 మంది ఉద్యోగులకు ఒకే మేనేజర్‌ను కేటాయించడం, ఏఐ టీమ్‌లో చేరడం తప్ప మరో అవకాశం ఇవ్వకపోవడం వంటి వాటిపైనా అంతర్గతంగా విమర్శలు వచ్చాయి.




## ఫిఫా వరల్డ్ కప్.. ఇరాన్, న్యూజిలాండ్ మ్యాచ్ డ్రా



ఫిఫా వరల్డ్ కప్ 2026లో భాగంగా గ్రూప్ జిలో ఇరాన్, న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ డ్రా అయింది. ఇరాన్ రెండుసార్లు వెనకబడినప్పటికీ చివరకు 2–2తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. న్యూజిలాండ్ ఆరంభంలోనే (7వ నిమిషం) ఒక గోల్ చేసి ఆధిక్యంలో నిలిచింది. క్రిస్ వుడ్ అందించిన పాస్‌తో ఎలిజా జస్ట్ గోల్ సాధించాడు. 31వ నిమిషంలో రామిన్ రెజాయియన్ గోల్ కొట్టడంతో స్కోరు సమం అయింది. రెండో అర్ధ భాగంలో 54వ నిమిషంలో ఎలిజా జస్ట్ మళ్లీ గోల్ చేయడంతో న్యూజిలాండ్ 2–1తో ఆధిక్యం సంపాదించింది. పది నిమిషాలకే ఇరాన్ మరో గోల్ చేసింది. 64వ నిమిషంలో రెజాయియన్ అందించిన క్రాస్‌ను మహమ్మద్ మొహెబ్బి హెడర్‌తో గోల్‌గా మలచడంతో మ్యాచ్ 2–2తో సమంగా ముగిసింది.

# 'ఎ' మ్యాచ్‌లో గొడవ గొడవ

భారత్, శ్రీలంక 'ఎ' జట్ల మధ్య ముక్కోణపు వన్డే సిరీస్ మ్యాచ్ రసాభాసగా మారింది. సూపర్ ఓవర్లో శ్రీలంక 7 పరుగుల తేడాతో గెలిచిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు ఆవేశకావేశాలతో ఊగిపోయారు. అంపైరింగ్ నిర్ణయాలు భారత్‌కు వ్యతిరేకంగా రావడంతో తిలక్ వర్మ సారథ్యంలోని భారత్–ఎ ఒక దశలో మ్యాచ్‌ను బహిష్కరించి మైదానాన్ని వీడడానికి సిద్ధమైంది. ఐపీఎల్‌లో ఎంతో ప్రశాంతంగా కనిపించిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. ప్రత్యర్థి ఆటగాడితో తీవ్ర వాదనకు దిగి మీదికి దూసుకెళ్లడం, ఒకరినొకరు తోసుకునే పరిస్థితి రావడం రావడాన్ని బట్టి ఈ మ్యాచ్‌లో భావోద్వేగాలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవచ్చు. ముక్కోణపు సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకను ఓడించి, వర్ష ప్రభావిత రెండో మ్యాచ్‌లో అఫ్గాన్ చేతిలో ఓడిన తిలక్ సేన.. లంకతో రెండో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శనే చేసినా ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో మొదట భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (21), ప్రభ్‌సిమ్రన్ (11) విఫలం కాగా.. ప్రధాన బ్యాటర్లలో ఎవ్వరూ అర్ధసెంచరీ చేయలేదు. రుతురాజ్ (37), తిలక్ (23) పర్వాలేదనిపించారు. అయితే సూర్యాంశ్ షెడ్గె (72; 66 బంతుల్లో 3×4, 2×6), విప్రాజ్ నిగమ్ (51; 49 బంతుల్లో 6×4) ఎనిమిదో వికెట్‌కు 104 పరుగులు జోడించి భారత్‌కు పోరాడే స్కోరు సాధించిపెట్టారు. ప్రత్యర్థి బౌలర్లలో షిరాజ్ (3/33), విజయకాంత్ (3/26) రాణించారు. అనంతరం సదీర సమరవిక్రమ (93; 113 బంతుల్లో 7×4) పోరాటంతో లంక లక్ష్యం దిశగా సాగింది. కానీ భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ జట్టును పోటీలో నిలిపారు. చివర్లో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారి ఆఖరి ఓవర్లో 5 పరుగులు చేయాల్సి వచ్చింది. అర్షద్ ఖాన్ గొప్పగా బౌలింగ్ చేసి 5 బంతుల్లో 3 పరుగులే ఇచ్చాడు. చివరి బంతికి లంకకు రెండు పరుగులు అవసరం కాగా.. అర్షద్ వేసిన యార్కర్ బంతి చమిక గుణశేఖర ప్యాడ్‌కు తాకింది. అతను లెగ్‌బై కోసం ప్రయత్నించాడు. రెండో పరుగు తీసే క్రమంలో రనౌటవడంతో మ్యాచ్ టై అయింది. లంక 50 ఓవర్లలో 265/9తో నిలిచింది. అయితే చమిక షాట్ ఆడే ప్రయత్నమే చేయలేదు కాబట్టి లెగ్ బై లెక్కలోకి రాదంటూ భారత్–ఎ కెప్టెన్ తిలక్ వర్మ వాదించగా.. అంపైర్లు కొట్టిపారేశారు. దీంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. వెలుతురు తగ్గిపోవడంతో ఫ్లడ్‌లైట్లు లేకుండా ఆటను కొనసాగించడం కష్టమైంది. అయినా అంపైర్లు సూపర్ ఓవర్‌కు అనుమతించారు. అర్షద్ బౌలింగ్‌ను కొనసాగించగా.. రెండో బంతికి లంక బ్యాటర్ బూట్‌కు తాకినా అంపైర్ వైడ్ ఇవ్వడంతో భారత ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక ఓవర్ చివరి బంతికి ఫుల్‌టాస్ పడగా.. అవిష్క ఫెర్నాండో క్యాచ్ ఔటయ్యాడు. కానీ అంపైర్ దాన్ని నోబాల్‌గా ప్రకటించడంతో భారత కుర్రాళ్ల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. కొందరు ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూం వైపు వెళ్లిపోయారు. తర్వాత మ్యాచ్ అధికారులు వారిని వెనక్కి తీసుకొచ్చారు. చివరి బంతికి ఒక లెగ్‌బై రాగా.. భారత్ లక్ష్యం 17 పరుగులైంది. భారత్ సూపర్ ఓవర్ మొదలుపెట్టాల్సిన సమయానికి వెలుతురు మరీ తగ్గిపోవడంతో ఈ స్థితిలో ఎలా ఆడాలంటూ కెప్టెన్ తిలక్ అంపైర్లు, లంక ఆటగాళ్లతో వాదనకు దిగాడు. కానీ ఆడాల్సిందేనని అంపైర్లు తేల్చి చెప్పారు.



ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా భారత్, శ్రీలంక 'ఎ' జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ఓ దశలోనైతే ఒకరినొకరు నెట్టుకునేంత వరకు వెళ్లింది పరిస్థితి. సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఏడు పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత ఆ జట్టు సంబరాలు చేసుకుంది. ఓటమి బాధలో ఉన్న వైభవ్‌ను ఉద్దేశించి లంక ఆటగాడు హలంబాగే ఏదో అనడంతో చివర్లో పెద్ద గొడవ తప్పలేదు. వైభవ్ అతడి మీదికి దూసుకెళ్లగా.. అతనూ మీదికొచ్చాడు. సహచర ఆటగాళ్లు వారిని వెనక్కి లాగారు. వైభవ్(Vaibhav Sooryavanshi)ను హలంబాగే ఏమన్నాడో తాజాగా బయటికొచ్చింది. ''మ్యాచ్ ముగిసింది.. ఇక నువ్వు ఇంటికి వెళ్లు'' అనడంతో వైభవ్‌కు కోపమొచ్చినట్లు జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. హలంబాగే మాటలతో సూర్య వంశీ సహనాన్ని కోల్పోయి ప్రత్యర్థి జట్టు ఆటగాడిని ఛాతిపై చేయి వేసి తోసేయడానికి ప్రయత్నించాడు. సహచర ఆటగాళ్లు కలుగజేసుకుని వైభవ్‌ను శాంతింపజేశారు.

'ఎ' సిరీస్ మ్యాచ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) అధికారులను నియమించదు. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన క్రమశిక్షణా వ్యవహారాలను పర్యవేక్షించదు. అయినప్పటికీ ప్రస్తుత వివాదంతో సంబంధం ఉన్న ఆటగాళ్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. శ్రీలంక 'ఎ' జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ ఘటనపై చర్చ జరిగిందని, భారత జట్టుకు క్షమాపణ చెప్పాలని లంక ఆటగాళ్లకు సూచించినట్లు ఓ వార్తాకథనం పేర్కొంది. తగినంత వెలుతురు లేదని సమాచారం ఉన్నప్పటికీ

# 'అందుకే వైభవ్‌కు కోపమొచ్చింది'..



'సూపర్ ఓవర్'ను కొనసాగించడానికి అనుమతించినందుకు మ్యాచ్ అధికారులపై విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వారిపై ఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. 266 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఆఖరి ఓవర్లో 5 పరుగులు చేయాల్సి వచ్చింది. దీంతో మ్యాచ్ చివర్లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అర్షద్ ఖాన్ గొప్పగా బౌలింగ్ చేసి 5 బంతుల్లో 3 పరుగులే ఇచ్చాడు. చివరి బంతికి లంకకు రెండు పరుగులు అవసరం కాగా.. అర్షద్ వేసిన యార్కర్ బంతి చమిక గుణశేఖర ప్యాడ్‌కు తాకింది. అతను లెగ్‌బై కోసం ప్రయత్నించాడు. రెండో పరుగు తీసే క్రమంలో రనౌటవడంతో మ్యాచ్ టై అయింది. లంక 50 ఓవర్లలో 265/9తో నిలిచింది. అయితే చమిక షాట్ ఆడే ప్రయత్నమే చేయలేదు కాబట్టి లెగ్ బై లెక్కలోకి రాదంటూ భారత్–ఎ కెప్టెన్ తిలక్ వర్మ వాదించగా.. అంపైర్లు కొట్టిపారేశారు. దీంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది.

# అఫ్గాన్ చేతిలో ఇండియా 'ఎ' భవితవ్యం

శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ 'ఎ' జట్టు ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ వంటి ప్రతిభావంతులున్నా ఇండియా 'ఎ' జట్టు ఆశించిన ప్రదర్శన చేయట్లేదు. దీంతో జట్టు టైటిల్ గెలవడం కాదు కదా కనీసం ఫైనల్‌కు చేరడం కూడా కష్టంగా కనిపిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని ఈ యువ జట్టు శ్రీలంక 'ఎ'పై ఓటమి అంచుల వరకు వెళ్లి చివరకు ఎనిమిది పరుగుల తేడాతో గట్టెక్కింది. తర్వాత అఫ్గాన్‌తో మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించినా బౌలర్లు చేతులెత్తేశారు. దీంతో ఆ మ్యాచ్‌లో భారత్ DLS ప్రకారం 4 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇక, తాజాగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ నిరాశపర్చడంతో భారత్ భారీ స్కోరు చేయలేకపోయింది.



# నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నమెంట్.. సెమీస్‌లో భారత్




నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నమెంట్లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్ ఎ రెండో మ్యాచ్‌లో భారత్ 2–1 తేడాతో జపాన్‌ను ఓడించింది. భారత్ తరపున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్‌సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. ప్రత్యర్థి జట్టులో హిరామిట్సు 35వ నిమిషంలో గోల్ చేసింది. వరుసగా రెండు విజయాలు సాధించి పూల్ ఎలో ఆరు పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో ఉంది. జూన్ 18న జరిగే తమ చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో ఉరుగ్వేతో తలపడనుంది.

వుదయం సినిమా
MOVIE TIME!

## పర్సంటేజ్ సబ్ కమిటీ నుంచి సురేష్ బాబు, దిల్ రాజు తప్పుకోవాలి

**వుదయం సినిమా** శుభం థియేటర్స్ లో పర్సంటేజ్ విధానం అమలుకు నిర్మాతలు సుముఖంగానే ఉన్నారు. అయితే నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్స్ కు ఇబ్బందులు తలెత్తని రీతిలో అందరికీ ఆమోదయోగ్యమైన పర్సంటేజ్ ను నిర్ణయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని సీనియర్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నట్టి కుమార్ స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. రెంటల్ విధానంలో ఒక థియేటర్ కు రూ. 7,30,000/ వస్తుందని అనుకుంటే..ఆ థియేటర్ ఓనర్ సుమారు రూ.10,00,000/ వరకు పర్సంటేజ్ విధానంలో వచ్చేవిధంగా నిర్ణయించమని అడగడంలో తప్పు లేదు. అదే పాతిక లక్షలకు సమానంగా పర్సంటేజ్ ఇవ్వమని అడిగితే, అది ఎంతమాత్రం సహేతుకంగా ఉండదు.



# 'మా ఇంటి బంగారం' ప్రీ రిలీజ్




**వుదయం:** ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూన్ 19న విడుదల కాబోతోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లతో సినిమా టీం ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం నాడు ప్రీ రిలీజ్ సెలెబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాతలు డి.సురేష్ బాబు, స్వప్నా దత్, జాన్వీ నారంగ్, డైరెక్టర్ దేవా కట్టా తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో..నిర్మాత డి.సురేష్ బాబు మాట్లాడుతూ .. ''మా ఇంటి బంగారం'తో సమంతకి మంచి విజయం దక్కాలి. 'ఓ.. బేబీ'తో సమంత, నందినీ కలిసి నాకు మంచి సక్సెస్ ఇచ్చారు. ఈ చిత్రం కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నారు. రాజ్, హిమాంక్ చాలా కష్టపడ్డారు. జూన్ 19న ఈ సినిమా రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.సమంత మాట్లాడుతూ .. 'నేను ఇకపై ఏడాదికి రెండు సినిమాలు అభిమానులకు అందించాలని అనుకుంటున్నాను. ఇప్పుడు అయితే ఓ మంచి చిత్రాన్ని చేశాం అన్నారు.

# 'శ్రీనివాస మంగాపురం' నుంచి సాంగ్ రిలీజ్

**వుదయం:** 'మంగళవారం' చిత్రంతో సంచలన విజయం అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి 'శ్రీనివాస మంగాపురం' తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకు నేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంతో ఘట్టమనేని వారసుడు జయకృష్ణ ఘట్టమనేని తెలుగు సినీ పరిశ్రమకు హీరోగా పరిచయమవుతుండగా, బాలీవుడ్ యువ నటి రాషా తడానీ 'ఉయ్ అమ్మ' పాటతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన తర్వాత టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. సీనియర్ నటుడు మోహన్ బాబు ఈ చిత్రంలో పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. నిర్మాత పీ. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వినీదత్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ గా అలరిస్తున్నాయి. తాజాగా చిత్ర బృందం మూడో సింగిల్ 'గుండె పేలిపోతోందే' పాటను విడుదల చేశారు.తొలి ప్రేమలో కలిగే మధురమైన భావోద్వేగాలను ఆవిష్కరించే ఈ పాట, ఓ యువకుడు తొలిచూపులోనే ఓ అమ్మాయిపై ప్రేమలో పడిన తర్వాత అతని మనసులో కలిగే ఉత్సాహం, ఆశ్చర్యం, ఆనందాన్ని అందంగా చూపిస్తుంది. ఆమె చుట్టూనే తిరగాలని, ఆమె ఉన్న చోటే ఉండాలని కోరుకునే ప్రేమికుడి మనసుని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ పాటకు క్లాసిక్, మోడరన్ మెలోడీతో మేళవిస్తూ అద్భుతంగా కంపోజ్ చేశారు. సాఫ్ట్ ఫ్లూట్ బిట్స్, అందమైన వయోలిన్ స్వరాలు, ఆర్కెస్ట్రేషన్ ఈ పాటను సంగీత ప్రియులకు ప్రత్యేక అనుభూతిగామార్చాయి. ఆస్కార్ విజేత గేయరచయిత చంద్రబోస్ రాసిన సాహిత్యం తొలి ప్రేమ అమాయకత్వాన్ని అద్భుతంగా పలికించగా, అనురాగ్ కులకర్ణి తన హార్ట్ టచ్చింగ్ వోకల్స్ తో పాటకు మరింత ప్రాణం పోశారు.ఆలయ నేపథ్యంతో చిత్రీకరించిన ఈ పాట విజువల్‌గా కూడా ఎంతో ఆకట్టుకుంటోంది. కలర్ ఫుల్ ఫ్రేమ్స్, అందమైన లొకేషన్స్, ఆకర్షణీయమైన విజువల్స్ పాటకు మరింత అందాన్ని చేకూర్చాయి.



# తమిళనాడు ముఖ్యమంత్రిని కలిసిన విశాల్



**వుదయం:** తమిళనాడు ముఖ్యమంత్రి గా జోసెఫ్ విజయ్ పదవీ బాధ్యతలు స్వీక రించిన సంగతితెలిసిందే. ఆ క్షణం నుంచి కోలీ వుడ్ ప్రముఖులంతా ఒక్కొక్కరిగా వెళ్లి ముఖ్య మంత్రి విజయ్‌ని మర్యాదపూర్వకంగా కలుస్తూనే ఉన్నారు. తాజాగా విశాల్ తన స్నేహితుడు అయిన సీఎం విజయ్‌ని కలిశారు. ఈ మేరకు ఆయన ఈ భేటీ గురించి పోస్ట్ చేశారు.'లయోలా కాలేజీలో మన పరిచయం ఏర్పడిన నాటి నుంచి నేను మిమ్మల్ని 'డార్లింగ్' అని పిలుస్తూనే ఉన్నాను.. అందులో ఎలాంటి మార్పు రాలేదు. ఓ సాధారణ హీరోగా మొదలైన మీ ప్రయాణంలోని అన్ని అడ్డంకులను, విమర్శలను ఎదుర్కొని, మీ మౌనంతో, విజయంతో వాటన్నిటినీ పక్కకు నెట్టేశారు. ఒక సూపర్‌స్టార్ గా మీరు ఉన్నత శిఖరాల కు ఎదిగి ఈనాడు తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి అయ్యారు.ఈ రోజు పదవి, హోదా మారాయి కానీ మీరు మాత్రం మారలేదు. మిమ్మల్ని కలవడం ఎంతో ఆనందాన్నిచ్చింది, అదే ఆప్యాయతను మళ్లీ అనుభూతి చెందాను. ఎంజీఆర్ గారి నుంచి.. జయలలిత అమ్మ వరకు, స్టాలిన్ అంకుల్ నుండి నా ప్రియ సోదరుడు ఉదయ నిధి స్టాలిన్ వరకు.. మన రాష్ట్ర ముఖ్యమంత్రిని 'డార్లింగ్' అని పిలవడం ఎంతో ముచ్చటగా అనిపించింది. నాలోని ఈమధుర క్షణాలు ఎప్పటికీ నిలిచి ఉంటాయి. మీ కోసం తీసుకు రావాల్సిన బొకే, శాలువాకి బదులుగా ఆ డబ్బును మీ తరపున, మీ పేరు మీద తమిళనాడులోని ముగ్గురు అర్హులైన నిరుపేద బాలికల చదువు కోసం ఉపయోగించినందుకు మీకు ధన్యవాదాలు.

# 'ది ఇండియా స్టోరీ' అఫీషియల్ పోస్టర్ రిలీజ్

**వుదయం:** జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ & స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లతో ఆసక్తిని పెంచిన చిత్రబృందం, తాజాగా విడుదల చేసిన ఈ పోస్టర్‌తో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది.ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయవాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా ఆవిష్కరించింది. ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారతదేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాంశం. సాధారణ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలోఅవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది.ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా స్వాతి వినాయక్ సైందానే, అనితా జాధవ్, వినాయక్ సైదానే, కల్పేష్ షా, దేవయాని ఖోరాటే, ప్రేమ్ జోషి వ్యవహరిస్తున్నారు. సినిమాటోగ్రఫీని నిశాంత్ భాగవత్, సంగీతాన్ని మంగేష్ ధాక్డే, ఎడిటింగ్ ను ఆశిష్ మ్హాత్రే, సాహిత్యాన్ని షకీల్ అజామీ, సౌండ్ డిజైన్‌ను అన్మోల్ భావే అందిస్తున్నారు.



# అల్లు అర్జున్ సాంస్కృతిక ప్రభావం.. AA23 థీమ్ మ్యూజిక్‌ను ఉపయోగించిన ప్రధాని మోడి

**వుదయం:** సినీ ఇండస్ట్రీలో పాన్ ఇండియా ట్రెండ్ మొదలు కాకముందే..ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ దేశమంతటా పెద్ద స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన సినిమాలు, పాటలు, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ .. అన్నీ సరిహద్దులను దాటి



ప్రేక్షకులను మెప్పించి వారి మనసుల్లో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నాయి.అందుకు లేటెస్ట్ ఎగ్జాంపుల్ ప్రధాని నరేంద్ర మోడి తన సోషల్ మీడియా పోస్టుల్లో ఒక దానిలో AA23 థీమ్ మ్యూజిక్‌ను ఉపయోగించటమే. ఇది అల్లు అర్జున్‌కు ఉన్న ప్రజాదరణ, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలియజేస్తోంది.AA23 ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ దాని థీమ్ మ్యూజిక్ ఇప్పటికే మెయిన్‌స్ట్రీమ్ చర్చల్లో చోటు దక్కించుకుంది. రాబోయే ప్రాజెక్ట్ నుంచి వచ్చిన కంటెంట్‌కే దేశవ్యాప్తంగా ఇంతటి ఆదరణ ఉండటమనేది చాలా అరుదైన విషయంగా పేర్కొనవచ్చు. చాలా సంవత్సరాలుగ ాఅల్లు అర్జున్ సక్సెస్‌ఫుల్ నటుడు మాత్రమే కాదు.. సరిహద్దులను దాటి రాణిస్తున్నారు. ఆయన సినిమాలు, అందులోని కంటెంట్ తరచుగా సాంస్కృతిక క్షణాలుగా మారుతూ భారతదేశం అంతటా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.AA23 మూవీ చుట్టూ రోజు రోజుకీ అభిమానులు, సినీ ఇండస్ట్రలో ఆసక్తి పెరుగుతోంది. ఇలాంటి సందర్భాలే అల్లు అర్జున్‌ని పాన్ ఇండియాస్టార్‌గా నిరూపిస్తున్నాయి. అలాగే సినిమా పరిమితులను దాటి విస్తరించిన ఆయన ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

## సంగీతం కచేరీకి, నృత్యానికి అద్భుత స్పందన



**వుదయం:** నగరం లో గత రెండు రోజులు గా వేదం ఆర్ట్ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో జరిగిన సంగీత కచేరీ కి మరియు నృత్య ప్రదర్శన కి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అమెరికాలో విజయవంతమైన ప్రదర్శనల అనంతరం భారతదేశంలో తమ ప్రయాణాన్ని ప్రారంభించిన వేదం ఆర్ట్ రెండు రోజుల పాటు సంగీతం, సంస్కృతి, నృత్యాన్ని కలగలిపిన అద్భుత కార్యక్రమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట టైంలెస్ సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. భానుమతి కాలం నుంచి నేటి తరానికి చెందిన పాటల వరకు తెలుగు సినీ సంగీత ప్రయాణాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన ఈ సంగీత విహారం ప్రేక్షకులను భావోద్వేగాలకు గురి చేసింది.

# 'సేవ్ ది టైగర్స్' సీజన్ 3 ప్రీమియర్ గ్రాండ్ సక్సెస్

**వుదయం:** సోమవారం సాయంత్రం హైదరాబాద్ AMB సినిమాస్‌లో జరిగిన "సేవ్ ది టైగర్స్ సీజన్ 3" గ్రాండ్ ప్రీమియర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. పలువురు సినీ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరు కాగా.. వారి నవ్వులతో, సందడితో సాయంత్రం ఆహ్లాదంగా మారింది. అతిథులు, సెలబ్రిటీలు, నటీనటులు, సాంకేతిక బృందం మరియు క్రియేటర్లు.. ఇలా అందరూ కలిసి ప్రాంతీయ OTT వినోదంలో పెద్ద హిట్‌గా నిలిచిన సేవ్ ది టైగర్స్ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన సీజన్3ను ఎంజాయ్ చేశారు. తారల తళుకులతో మెరిసిన ఈ రెడ్ కార్పెట్ వేడుకకు టీవీ సీరియల్స్ నుంచి సినిమాల వరకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్లు, హై–ఫ్యాషన్‌లో సెలబ్రిటీల మెరిసే హాజరు, ఎక్స్‌క్లూజివ్ మీడియా ఇంటరాక్షన్లు, అలాగే ప్రీ స్క్రీనింగ్ గెట్–టుగెదర్స్.. ఇలా అన్నీ కలిసి ఈ స్ట్రీమింగ్ ప్రారంభానికి అద్భుతమైన వేదికగా నిలిచాయి.సేవ్ ది టైగర్స్ 3 స్పెషల్ సెలబ్రిటీ ప్రీమియర్ వేడుకలో టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్, కామాక్షి భాస్కర్ల, రాగ్ మయూర్, బిగ్ బాస్ తెలుగు 5 విజేత వీజే సన్నీ, కళ్యాణ్ పడాలా (బిగ్ బాస్ సీజన్ 9 విజేత), చైతన్య రావు, వెంకటేష్ కాకుమాను, కార్తిక్ రత్నం, ఆదిత్య మండల, శ్రీనాథ్ మాగంటి, జబర్దస్త్ కమెడియన్ ముక్కు అవినాష్, నిరుపమ్, కిరీటి దామరాజు, మానస్ సహా పలువురు ప్రముఖులు పాల్గొని ప్రీమియర్‌ను ఎంజాయ్ చేశారు.




# 'సింగ్ గీతం' ఘన విజయం చాలా ఆనందాన్ని ఇచ్చింది..

**వుదయం:** లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు లేటెస్ట్ గోల్డెన్ బ్లాక్ బస్టర్ 'సింగ్ గీతం'. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోనమై ఈ చిత్రం ప్రేక్షకులు విమర్శకులు అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినిమా విశేషాలు పంచుకున్నారు.'సింగ్ గీతం' చాలా ఆసక్తికరంగా వుంది. కొత్త ప్రయోగాలు చేయడంలో ఎప్పుడూ ముందుండే మీలాంటి లెజెండరీ దర్శకుడికి ఇది పర్ఫెక్ట్ మూవీ. ఈ కథ 40 ఏళ్లుగా తెరపైకి రావడానికి ఎదురుచూస్తోందని చెప్పారు. ఆ ఆలోచన ఎలా పుట్టింది?–సుమారు 40 ఏళ్ల క్రితం నాకు ఒక వినూత్నమైన ఆలోచన వచ్చింది. ప్రపంచంలోనే తొలిసారిగా, సినిమాలోని ప్రతి సంభాషణను మాట్లాడకుండా పూర్తిగా పాట రూపంలో చెప్పాలని అనుకున్నాను. బ్రాడ్‌వే మ్యూజికల్స్‌లో పాటలు, సంభాషణలు వేరుగా ఉంటాయి. కానీ నేను మాత్రం ప్రతి మాటను పాడుతూ చెప్పే సినిమా చేయాలని కలగన్నాను. ఆ ఆలోచన నాతోనే దాదాపు 40 ఏళ్ల పాటు ప్రయాణించింది. మద్రాస్‌లోనూ, నా ఇంట్లోనూ, ఎన్నో చోట్ల ఈ కథ నా వెంట తిరిగింది. చివరికి నాగ్ అశ్విన్ దృష్టికి వెళ్లింది. ఆయన ఈ ఆలోచనను ఎంతో ఇష్టపడి, గొప్ప అభిరుచితో ముందుకు తీసుకెళ్లారు.


లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.